

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ఆర్‌టిసి ఎన్నికలలో ఎర్రజెండా రెపరెపలు 02

'అగ్నివీర్'ల సేవా కాలం మరో రెండేళ్లు పొడిగింపు 07

సంపుటి 09, సంచిక: 335 | గురువారం | 05-11-2026 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00

అమెరికా కాంగ్రెస్ డెమోక్రాట్ల వశం

బద్దలైన రిపబ్లికన్ల కంచుకోటలు

- టెక్సస్, ఒహియో, కాన్సాస్‌లలో 100 సంవత్సరాల తర్వాత డెమోక్రాట్ల గెలుపు
- కీలకమైన గవర్నర్ పదవులూ వారికే

అమెరికా ఎన్నికల్లో భారత సంతతి విజయాలు


08

జార్జియా గవర్నర్ ఎన్నికల్లో చరిత్ర సృష్టించిన నల్లజాతీయురాలు లాన్స్

అమెరికా చరిత్రలో సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లిం ఎల్ సయెద్



మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు ట్రంప్‌కు అమెరికన్ల గుణపాఠం



వాషింగ్టన్ : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ప్రతిపక్ష డెమోక్రాట్ల అభ్యర్థులు కాంగ్రెస్ ఉభయసభల్లో ఘన విజయాలు సాధించారు. కాంగ్రెస్‌ను తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలేవిధంగా ప్రజలు రిపబ్లికన్‌పార్టీకి వ్యతిరేకంగా మూకుమ్మడి తీర్పు చెప్పారు. దీంతోపాటు 39 గవర్నర్ పదవులకు (36 రాష్ట్రాలు, మూడు టెరిటరీలు) మేయర్ పదవులకు జరిగిన ఎన్నికలలో డెమోక్రటిక్‌పార్టీ అభ్యర్థులు చరిత్రాత్మక విజయాలు నమోదు చేశారు.జీవన వ్యయాల పెరుగుదలపై ప్రజాగ్రహమే ఈ ఎన్నికల ఫలితమని అంతర్జాతీయ మీడియా వ్యాఖ్యానించింది. మొదటిసారి అనేక చారిత్రక ఘట్టాలు ఈ ఎన్నికలలో నమోదయ్యాయి. తుది సమాచారం లభ్యమయ్యేనాటికి దిగువసభలో 435 స్థానాలకుగాను 367 స్థానాల్లో కౌంటింగ్ పూర్తయింది.వీటిల్లో డెమోక్రాట్లు 228 స్థానాలు గెలుచుకోగా,రిపబ్లికన్లు 139 స్థానాలు గెలుచుకున్నారు.ఎగువసభ సెనేట్‌లో కూడా బలాబలాలు తారుమారయ్యాయి. మొత్తం 100 స్థానాలకుగాను 35 స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరగ్గా 33 స్థానాల ఫలితాలు వెలువడ్డాయి.ఈ ఫలితాలతో కలిపిచూస్తే డెమోక్రాట్లకు సెనేట్‌లో 54 స్థానాలతో మెజార్టీ లభించగా, రిపబ్లికన్ల బలం 44కు తగ్గిపోయింది. నిన్నటివరకూ రిపబ్లికన్లకు సెనేట్‌లో 53 స్థానాల బలం ఉండేది.మిషిగన్ రాష్ట్ర సెనేట్‌కు జరిగిన ఎన్నికల్లో డెమోక్రాట్ అభ్యర్థి అబ్దుల్ ఎల్ సయెద్ విజయం సాధించారు. అమెరికా చరిత్రలో మొట్టమొదటి ముస్లిం సెనేటర్‌గా ఆయన స్థానం సంపాదించుకున్నారు.మిన్నెసోటాలో సెనేట్‌కు ఎన్నికైన పెగ్గీ ఫ్లానగన్ మొదటిసారి విజయం సాధించిన స్థానిక అమెరికా మహిళగా చరిత్ర సృష్టించారు. ఆమె విజయం ఒక మైలురాయి ఘట్టం. న్యూ మెక్సికోలో మొదటి స్థానిక మహిళా గవర్నర్‌గా దేవ్ హోలాండ్ విజయం

తరువాయి 8లో

కరువు సహాయక చర్యలపై

10న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

ఆ తరువాత మండల కేంద్రాల్లో పంటలు నష్టపోయిన బాధిత రైతులతో ఆందోళనలు

- కరువు బాధితులకు న్యాయం జరిగేంతవరకూ నిరంతర కార్యక్రమాలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ
- పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలి
- మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నాలు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. అనంతరం మండల కేంద్రాల్లో పంటలు నష్టపోయిన రైతులతో ఆందోళనలు నిర్వహించి, వారి సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. కరువు బాధితులకు న్యాయం జరిగే వరకు ఈ కార్యక్రమాలను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని తెలిపారు. తెలంగాణలో కరువు పరిస్థితులు తీవ్రరూపం దాల్చి రైతాంగం సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు అంచనాలు,

తరువాయి 8లో


ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతు

త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని సిపిఐ నిర్ణయించినట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రాంరెడ్డి నర్సోత్తమరెడ్డికి, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సామ రామ్‌మోహన్ రెడ్డికి మద్దతు ప్రకటించారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న తమ పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని సాంబశివరావు చెప్పారు.

నేడు కేబినేట్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 5వ తేదీన మధ్యాహ్నం 4 గంటలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎలొనొ ప్రభావంతో రాష్ట్రంలో ప్రస్తుత కరువు పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, నీటిమట్టాలు, సాగు, తాగు నీటి సమస్యలు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయం, మియాపూర్, తదితర ప్రాంతాలలోని ప్రభుత్వ భూముల వినియోగం, మెట్రో రైల్ 2వ దశ విస్తరణ, కేంద్ర ప్రభుత్వ సహకారం, వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం అనధికారికంగా సమావేశం కానుంది. అనంతరం సాయంత్రం 4 గంటలకు మంత్రివర్గ సమావేశం అధికారికంగా జరగనుంది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వేర్వేరుగా సర్క్యులర్ జారీ చేశారు.



ప్రధాని మోదీ దేశద్రోహి

ఆయనను ఆమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంత్రిస్తున్నారు

చర్చకు వస్తే 5 నిమిషాల్లో నిరూపిస్తా

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సవాల్

సంగ్రూర్ : పంజాబ్‌లో వచ్చే ఏడాది ఆరంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. సంగ్రూర్‌లోని ఇన్సాఫ్ ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, పంజాబ్ ఇన్‌చార్జ్ సచిన్ పైలట్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు పర్గత్ సింగ్, రాష్ట్ర సీనియర్ నాయకులు ప్రతాప్ బాజ్వా, విజయ్ ఇందర్ సింగ్లా, చరణ్‌జిత్ సింగ్ చన్నీ, సుఖ్‌జిందర్ సింగ్ రంధావా, రాజిందర్ కౌర్ భట్టల్, అమరీందర్ సింగ్ రాజా వారింగ్

తరువాయి 12లో



నాగర్ కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను పరిశీలించి రైతుల కష్టాలను అడిగి తెలుసుకుంటున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

గ్రామాల్లో సిపిఐ ప్రతినిధి బృందాల

కరువు యాత్ర

09



డీప్‌టెక్ ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణ

- ప్రత్యేక ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు
- పారిశ్రామిక రంగంలో 8.1 శాతం వృద్ధి
- ఫిక్కీ శతాబ్ది వేడుకల్లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణను ప్రపంచ స్థాయి డీప్‌టెక్, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఎఐ, క్వాంటం టెక్నాలజీ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లు, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. బేగంపేటలోని ఐటిసి కాకతీయ హోటల్‌లో బుధవారం నిర్వహించిన ఫిక్కీ శతాబ్ది వేడుకలు, తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో వారు పాల్గొని ఫిక్కీతువై రూపొందించిన తెలంగాణ డీప్‌టెక్ బ్లూప్రింట్ నివేదికను ఆవిష్కరించారు. అనంతరం డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పరిశోధనలు, ఆవిష్కరణలు ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులు, సేవలుగా మారాలని ఆకాంక్షించారు. ఇందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డీప్‌టెక్ రంగంలో స్టార్టప్‌లకు అవసరమైన పెట్టుబడులు, పరీక్షా కేంద్రాలు, ధ్రువీకరణ సదుపాయాలు కల్పించాల్సిన

తరువాయి 12లో

ఉమ్మడి ఖమ్మంను ముంచెత్తిన మురసు

- కుండపోత వాన, పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- తడిసిన ధాన్యం - పత్తికి పొంచి ఉన్న విపత్తు
- తెగిపోయిన దారులు, కొట్టుకుపోయిన అప్రోచ్‌రోడ్లు
- బొగ్గు ఉత్పత్తికి ఆటంకం
- జనజీవనం అస్తవ్యస్తం

ప్రజాపక్షం/ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం




ఉమ్మడి ఖమ్మం జిల్లాను మురసు తుఫాన్ ముంచెత్తింది. ఎల్ నినో కారణంగా భూగర్భ జలాలు అడుగంటగా, ఉన్న నీటితో అష్టకష్టాలు పడి పండించుకున్న పంటను ఒక్కసారిగా దెబ్బతీసింది. చేతికి వచ్చిన వరి పంట నేలపాలు కాగా పత్తి, మిర్చి ఇతర వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. మురసు తుఫాన్ కారణంగా మంగళవారం చిరుజల్లులతో ప్రారంభమై బుధవారం భారీ వర్షం కురిసింది. ఈ ఏడాదికి పలు చోట్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పాల్వంచ, అశ్వారావుపేట, సత్తుపల్లి, పెనుబల్లి చంద్రుగొండ, నేలకొండపల్లి తదితర ప్రాంతాలలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెండు మూడు రోజుల్లో కోయాల్సిన వరి పొలాలు నేలకొరగడంతో పాటు వాటిపై నుంచి నీరు పారడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా పలు మండలాలు జలదిగ్బంధంలో చిక్కుకు పోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆయా మండలాల్లోన్ని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. అప్రోచ్ రోడ్లు కొట్టుకుపోయాయి. ప్రధాన రహదార్లపై నీళ్లు పొంగిపొర్లుతున్నాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గోదావరి తాలిపేరు కిన్నెరసాని పెద్దవాగులో జలకళ ఉట్టిపడుతోంది. సింగరేణి వ్యాప్తంగా మురసు తుఫాను

తరువాయి 8లో

కండక్టర్ ప్రవళిక మృతి

- సిఎం, మంత్రులు తీవ్ర విచారం
- కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- ఆమె తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రకటన
- రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, రూ.కోటి ప్రమాద బీమా
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి





ప్రజాపక్షం/హైదరాబాద్


ప్రయాణికురాలు బస్సు నుంచి కిందకు నెట్టేయడంతో తీవ్రంగా గాయపడిన మహిళా కండక్టర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. గత నెల 25న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని మిట్టగూడెం వద్ద మణుగూరు డిపో

తరువాయి 12లో

ఇంటర్ బోర్డ్‌లో వరుస వివాదాలు!

- 'ఫైర్' ఎన్ఒసి సర్టిఫికెట్లులేని కళాశాలలపై వేటు
- గుర్తింపు రద్దుపై సర్వత్రా చర్చ
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాపక్షం/హైదరాబాద్



వరుస వివాదాలకు ఇంటర్మీడియట్ విద్యామండలి (ఇంటర్ బోర్డు) కేంద్ర బిందువుగా మారుతోంది. నకిలీ సర్టిఫికెట్లతో ఒప్పంద జూనియర్ లెక్చరర్స్ క్రమబద్ధీకరణ వివాదం ముగియక ముందే, ప్రైవేటు కళాశాలల అగ్నిమాపక ఎన్ ఒ సి పత్రాలు, గుర్తింపు రద్దు లాంటి అంశాలు మరింత వివాదంగా మారుతోంది. దీంతో ఇంటర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఒక వేళ ఎన్ఒసి సమర్పించని లేదా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన కళాశాలను రద్దు చేస్తే ఆ కళాశాలలో చదివే విద్యార్థుల పరిస్థితి ఏమిటనేది ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. కళాశాల గుర్తింపు పక్రియను ముందుగానే ముగించుకుని, అడ్మీషన్ల పక్రియ చేపడితే గందగోళ పరిస్థితులు వచ్చేవి కాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కళాశాలల గుర్తింపు విషయంలో ప్రతి ఏటా తీవ్ర జాప్యం చేయడం పట్ల తీవ్ర అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యా సంవత్సరం సగం

తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
గురువారం
05-11-2026
www.prajapaksham.in

ట్రంప్ అహంకారానికి అమెరికన్ల చెంపపెట్టు

అమెరికా రాజకీయాల్లో కీలక మలుపు చోటుచేసుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి అమెరికా ఓటర్లు గట్టి హెచ్చరిక పంపించారు. అధికారంలో ఉన్న అధ్యక్షుడి రాజకీయ బలాన్ని అంచనా వేసే మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ ఆధిక్యం సాధించడం సాధారణ రాజకీయ పరిణామం కాదు. ట్రంప్ రెండో విడత పాలనపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి ఇది స్పష్టమైన సంకేతం. కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు ఆధిక్యతలోకి వచ్చారు. మొత్తం 435 ఓటింగ్ సభ్యుల్లో డెమొక్రాట్ల సంఖ్యా బలం కనీస మెజారిటీ సంఖ్య 218 దాటింది. కాగా ఎగువ సభ సెనేట్‌లో రిపబ్లికన్‌ల 52–48 బలం 46–54గా తిరగబడినట్లు తెలుస్తున్నది. పూర్తి ఫలితాలు రావలసి ఉంది. రెండేళ్ల క్రితం ట్రంప్‌కు పట్టం కట్టిన ఓటర్లే ఇప్పుడు ఆయన విధానాలకు వ్యతిరేకంగా నిలబడటం అమెరికా రాజకీయాల్లో కీలక పరిణామం. టెక్సస్, జార్జియా, అయోవా, ఓహియో, ఉత్తర, దక్షిణ కరోలినాలు, మియామె వంటి సంప్రదాయకంగా రిపబ్లికన్లకు అనుకూలమైన రాష్ట్రాలలో డెమొక్రాట్లు సాధించిన విజయాలు ఈ ఎన్నికల ప్రాధాన్యతను మరింత పెంచాయి. టెక్సస్‌లో డెమొక్రాట్లు జేమ్స్ టలారికో సెనేట్ స్థానాన్ని కైవసం చేసుకోవడం, గినా హినోజోసా గవర్నర్‌గా విజయం సాధించడం చారిత్రాత్మక పరిణామాలు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత టెక్సస్ నుంచి డెమోక్రటిక్ సెనేటర్ ఎన్నిక కావడం రిపబ్లికన్లకు గట్టి దెబ్బ. జార్జియాలో కీషా లాన్స్ బాటమ్స్, అయోవాలో రాబ్ సాండ్ విజయాలు కూడా ఇదే రాజకీయ మార్పునకు నిదర్శనాలు. ఓహియోలో డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడిగా భావించే ఇండియన్–అమెరికన్ వివేక్ రామస్వామి ఓటమి కూడా రిపబ్లికన్ శిబిరానికి ఎదురుదెబ్బే. ఈ ఫలితాలను డెమొక్రాట్ల విజయంగా మాత్రమేగాక, ట్రంప్ పాలనా విధానాలపై ప్రజలు ఇచ్చిన తీర్పు కోణంలోనూ చూడాలి.

అమెరికా ఓటరుకు దేశభక్తి, జాతీయ భద్రత, సరిహద్దుల పరిరక్షణ వంటి అంశాలు ఎంత ముఖ్యమో, నిత్యజీవితంలో ఎదురయ్యే ధరల పెరుగుదల, ఉద్యోగ భద్రత, వైద్య ఖర్చులు, అద్దెలు, కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా అంతే ముఖ్యం. ఎన్నికల ఫలితాల్లో ఈ అంశాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఎంతవరకు మేలు చేసిందన్న ప్రశ్న ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తోంది. ఇరాన్‌తో యుద్ధం అమెరికా రాజకీయాల్లో మరో కీలక అంశం. విదేశాల్లో సైనిక ఘర్షణలకు భారీగా ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, స్వదేశంలో ప్రజల జీవన వ్యయాన్ని నియంత్రించలేకపోతే ప్రజల ఆగ్రహం సహజం. డీజిల్, ఇంధన ధరలు పెరగడం రవాణా నుంచి వ్యవసాయం వరకు అనేక రంగాలను ప్రభావితం చేస్తుంది. అమెరికా ప్రజలు మరో అంతులేని యుద్ధంలో చిక్కుకోవాలని కోరుకోవడం లేదు. జాతీయ భద్రత పేరుతో యుద్ధాలకు ప్రాధాన్యం ఇవ్వడం, అదే సమయంలో ప్రజల ఆర్థిక సమస్యలను నిర్లక్ష్యం చేయడం ట్రంప్‌కు రాజకీయంగా ఎదురుదెబ్బగా మారింది. యుద్ధోన్మాదంతో రగిలిపోతున్న ఇజ్రాయెల్‌కు ట్రంప్ ప్రభుత్వం అందిస్తున్న మద్దతు కూడా అమెరికా సమాజంలో చర్చనీయాంశమైంది. అమెరికాలోని యువత, విద్యార్థులు, ముస్లిం సమాజాలు, ప్రగతి శీల ప్రజాస్వామ్య వాదులు ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని ప్రశ్నిస్తున్నారు.

ఇరాన్‌తో ఎడతెగని సైనిక చర్యలు, ఇజ్రాయెల్‌కు మద్దతు, మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక జోక్యం వంటి అంశాలు ప్రభుత్వ విదేశాంగ విధానంపై అసంతృప్తిని పెంచాయి. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్టు చేయడం, క్యూబాపై ఆంక్షలను కఠినం చేయటం వంటి చర్యలు కూడా అమెరికా విదేశాంగ విధానంలో జోక్యందారీ ధోరణిపై చర్చను పెంచాయి. ఒక దేశంలో ప్రజాస్వామ్యం లేదని చెబుతూ మరో దేశంపై తన రాజకీయ, ఆర్థిక శక్తిని ప్రయోగించే ట్రంప్ వైఖరి అమెరికా విధాన నైతిక వైరుధ్యానికి పరాకాష్ఠ. ట్రంప్ రాజకీయాలకు ఒకప్పుడు బలమైన మద్దతుగా నిలిచిన వలస వ్యతిరేక నినాదాలే ఇప్పుడు ఆయనకు సమస్యగా మారుతున్నాయి. హెచ్1బి వీసాలపై కఠిన వైఖరి, విద్యార్థి వీసాలపై ఆంక్షలు, విదేశీ విద్యార్థుల పట్ల అనిశ్చితి, పుట్టుకతోనే పౌరసత్వం కల్పించే రాజ్యాంగ హక్కును పరిమితం చేయాలన్న ప్రయత్నాలు అమెరికాలో నివసిస్తున్న వలస కుటుంబాల్లో ఆందోళన కలిగించాయి. ఈ పరిణామాలు భారతీయ అమెరికన్లను ప్రభావితం చేసి ఉండవచ్చు.

ట్రంప్ రాజకీయ అజెండాలో మరో వివాదాస్పద అంశం మహిళల పునరుత్పత్తి హక్కులు. అబార్షన్ హక్కులపై అమెరికా సమాజంలో పరస్పర విరుద్ధమైన భావనలు ఉన్నాయి. 2022లో సుప్రీంకోర్టు దేశవ్యాప్త అబార్షన్ హక్కును రద్దు చేసిన తరువాత అనేక రాష్ట్రాల్లో ప్రజలు ఈ అంశంపై నేరుగా ఓటు వేస్తున్నారు. తాజాగా మిస్సోరీలో అబార్షన్లపై మరిన్ని ఆంక్షలు విధించే ప్రతిపాదనను ఓటర్లు తిరస్కరించడం, వర్జీనియాలో పునరుత్పత్తి స్వేచ్ఛకు రాజ్యాంగ రక్షణ కల్పించే ప్రతిపాదనకు మద్దతు లభించడం గమనార్హం. ఓటర్లు కాలిఫోర్నియా, కొలరాడోలలో ప్రతిపాదించిన కొత్త ఓటరు గుర్తింపు నిబంధనలను తిరస్కరించడం, మిస్సోరీలో రిపబ్లికన్లు రూపొందించిన నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించడం కూడా ముఖ్యమైన పరిణామాలు. అధికార పార్టీ తన ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్య ప్రక్రియలను మార్చాలని ప్రయత్నిస్తే ఓటర్లు దాన్ని ప్రశ్నిస్తారని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి.

ఈ ఎన్నికల పూర్తి ఫలితాలు వెలువడిన తర్వాత అమెరికా రాజకీయాలకు అసలైన పరీక్ష ప్రారంభం కానుంది. కాంగ్రెస్ ఉభయసభల్లో డెమోక్రాట్లకు ఇప్పటికే ఆధిక్యం రావడంతో ట్రంప్ ప్రభుత్వం ఇకపై తాను అనుకున్న ప్రతీ నిర్ణయాన్ని సులభంగా అమలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అమెరికా రాజ్యాంగ వ్యవస్థలో అధ్యక్షుడికి విస్తృత అధికారాలున్నప్పటికీ, బడ్జెట్ ఆమోదం, ప్రభుత్వ నిధుల కేటాయింపు, చట్టాల రూపకల్పన, ఉన్నతాధికారుల నియామకాలకు ఆమోదం, ప్రభుత్వ విధానాలపై విచారణలు వంటి అంశాల్లో కాంగ్రెస్‌ది కీలక పాత్ర. ముఖ్యంగా ప్రతినిధుల సభలో డెమోక్రాట్ల ఆధిపత్యం ఏర్పడటం వల్ల ట్రంప్ ప్రభుత్వంపై దర్యాప్తులు, విచారణలు, పత్రాల సమర్పణకు ఆదేశాలు, అధికారుల నుంచి వివరణలు కోరడం వంటి చర్యలకు మార్గం సుగమమవుతుంది. ఈ ఫలితాల వల్ల ట్రంప్ అధికారాలు ఒక్కసారిగా కుప్పకూలిపోతాయనిగానీ, అమెరికా రాజకీయాల ముఖచిత్రం హఠాత్తుగా మారిపోతుందనిగానీ అనుకోవడానికి వీల్లేదు. అయితే, మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లు తీర్పు, 2028 అధ్యక్ష ఎన్నికల్లో పునరావృతమయ్యే అవకాశాలు లేకపోలేదు. అమెరికా ప్రజలు ఒక వ్యక్తి ఓటమిని కాదు, తమ జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాల్లో తమకు ప్రాధాన్యం ఉండాలని కోరుకుంటున్నారు. ప్రపంచానికి నాయకత్వం వహించే దేశం ముందుగా తన ప్రజల సంక్షేమం, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలని ఆశిస్తున్నారు. ఈ ఎన్నికల తీర్పు ట్రంప్, ఆయన మద్దతుదారులకు రాజకీయంగా హెచ్చరిక. అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థలో అధ్యక్షునికి కాంగ్రెస్ నిర్ణయాలను తిరస్కరించేందుకు వీటో అధికారం ఉన్నప్పటికీ ఆయన అధికారానికి హద్దులున్నాయని గుర్తుచేసిన ప్రజా సందేశం. దేశం ఒక అధ్యక్షుడి వ్యక్తిగత రాజకీయ ప్రయోగాలకు వేదిక కాదు. ప్రజలే యజమానులు. ప్రజాస్వామ్యానిదే అంతిమ అధికారం.

ట్రంప్‌కు ఉన్నది ఇక రెండేళ్లే. ఈ వాస్తవాన్ని ఇప్పటికైనా తెలుసుకుంటే కొంత మేలు. ఇరాన్, రష్యా–ఉక్రేన్ యుద్ధాలను ముగించటంపై తక్షణం దృష్టిపెడితే, పాలస్తీనియన్‌లపై ఇజ్రాయెల్ దుందుడుకుతనాన్ని ఆపగలిగితే కొంత సానుకూలత ఏర్పడుతుంది. ఇరాన్‌తో యుద్ధం ముగింపు ట్రంప్ నిర్ణయంపై ఆధారపడి ఉంది. హోర్ముజ్ జలసంధి ద్వారా స్వేచ్ఛా రవాణా పునఃప్రారంభమైతే ఆయిలు ధరలు తగ్గి అమెరికాయేకాదు ఆయిలు దిగుమతి చేసుకునే దేశాలన్నీ సంతోషిస్తాయి. ఇప్పుడు బంతి ట్రంప్ కోర్టులో ఉంది.



ఇది చాలా గొప్ప విషయం

ఇప్పుడు డెమోక్రాట్లు అమెరికా ప్రతినిధుల సభ, సెనేట్‌లను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. వారు ట్రంప్‌ను జవాబుదారీగా నిలబెట్టగలుగుతారు. అది చాలా గొప్ప విషయం. ఆదాయ, సంపద అసమానతలు భారీగా ఉన్న ప్రస్తుత తరుణంలో, మనం ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. మనం శ్రామిక కుటుంబాల కోసం తీవ్రంగా పోరాడాలి. ఇకపై సాకులు చెప్పడం కుదరదు.

- బెర్నీ సాండర్స్
అమెరికా స్వతంత్ర సెనేటర్



సునామీలు ఎదిరించే ప్రయత్నాలను కొనసాగిద్దాం

సముద్రంలో భూకంపాలు రావడం, వాల్కనో విస్ఫోటనాలు జరగడం, కొండచరియలు విరిగిపడడం, అగ్నిపర్వతాలు బద్దలు కావడం, ఉల్కాపాతం ఉద్భవించడం లాంటి విపత్తులు సంభవించినపుడు సముద్రపు అలలు నోళ్లు తెరుచుకొని ఉవ్వెత్తున 100 అడుగుల ఎత్తు వరకు ఎగిసిపడుతూ, గంటకు 800 కిమీ వేగంతో రాకాసి అలలు ప్రయాణిస్తూ, తీర ప్రాంత జనావాసాలను మహా విపత్తు ముంచేయడాన్నే సునామీ అని అంటాం. 26 డిసెంబర్ 2004 తొలిసారి హిందూ మహాసముద్రంలో భూకంపం రావడంతో ప్రపంచ చరిత్రలో ఓ అత్యంత విధ్వంసకర సునామీ రావడం, 14 దేశాలకు చెందిన 2,83,000 మందిని పొట్టన పెట్టుకోవడం చూసాం. అక్టోబర్ 2026లో 'అర్నాబ్', నవంబర్ 2026లో 'మురసు' పేర్లతో తుఫాన్ల దుష్ప్రభావాన్ని కూడా నేడు చవిచూస్తున్నాం.

సునామీ అనబడే జపానీస్ పదానికి హార్బర్ కెరటం అని అర్థం. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగా 80 శాతం వరకు సునామీలు సంభవిస్తున్నాయి. ఇలాంటి అత్యంత ప్రమాదకర సునామీ ప్రళయాల్లో నష్టాన్ని తగ్గించడానికి ముందస్తు గుర్తించడం, హెచ్చరికలు జారీ చేయడం, సత్వరమే చర్యలకు పూనుకోవడం, ఆధునిక పరిశోధనలతో సునామీ రాకను ముందే పసిగట్టడం, తీర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడం లాంటి లక్ష్యాలను పెట్టుకొని 2015లో ఐరాస సభ్యదేశాలు తీసుకున్న నిర్ణయం ప్రకారం 2016 నుంచి ప్రతి ఏట 05 నవంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ సునామీ అవగాహన దినం పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ సునామీ అవగాహన దినం–2026 ఇతివృత్తంగా సునామీలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటూ మన ప్రయత్నాలను చేద్దాం అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు.

సునామీ విపత్తుల పట్ల విషయ పరిజ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, విపత్తు ప్రమాదపు అంచున నివసిస్తున్న తీర ప్రాంత ప్రజలను సన్నద్ధంచేయడం, గత సునామీ చరిత్ర నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం, సునామీ బాధితులకు సంఘీభావం తెలియజేయడం, ఆధునిక డిజిటల్ శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో సునామీలను ముందస్తు అంచనాలతో హెచ్చరికలు జారీ చేయడం, ప్రపంచ దేశాలు సమన్వయంతో పనిచేయడం, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని ఏకరువు పెట్టడం, రాబోయే తరాలకు సునామీ పట్ల కనీస జ్ఞానాన్ని అందించడం లాంటి అంశాలు సునామీ వల్ల జరిగే ప్రాణ ఆస్తి నష్టాలను పూర్తిగా తగ్గిస్తాయని గమనించాలి.

పర్యావరణ కాలుష్యంతో సంభవిస్తున్న ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా కూడా సునామీలు ఎగిసిపడవచ్చని తెలుసుకుందాం. సునామీ విపత్తుల గూర్చి పూర్తి అవగాహనను ఆకళింపు చేసుకుందాం. సునామీలు నేర్పిన గత గుణపాఠాలను మరువకుండా రాబోయే రోజుల్లో రాకాసి అలల వలలో పడకుండా తీర ప్రాంత మానవాళిని కాపాడుదాం. సునామీ సృష్టించే విధ్వంసానికి అడ్డుకట్ట వేద్దాం.

(05 నవంబర్ 'ప్రపంచ సునామీ అవగాహన దినం' సందర్భంగా)

బి.ఎం. రెడ్డి

ఆర్‌టిసి ఎన్నికలలో ఎర్రజెండా రెపరెపలు



ఎస్.బాబు, అధ్యక్షులు
టిజిఎస్ ఆర్‌టిసి
ఎంప్లాయిస్ యూనియన్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత ఆర్‌టిసిలో ఎన్నికలు 2016లో జరిగి టిఎంయు గుర్తింపు సంఘంగా ఏర్పడింది. కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించాలి. ఆ ప్రకారంగా 2018 లో జరగాల్సిన గుర్తింపు సంఘ ఎన్నికలు అనేక కారణాల వల్ల వాయిదా పడ్డాయి. 2019లో 55 రోజుల సమ్మె తరువాత కెసిఆర్ ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్లకు మంగళం పాడారు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 09.10.2026న అంటే దాదాపు పదేళ్ళ తరువాత గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించింది.

నా 42 ఏళ్ళ అనుభవంలో ఇలాంటి గుర్తింపు సంఘ ఎన్నికలు ఎప్పుడూ చూడలేదు. సినిమా వాళ్ళు కథలో ట్విస్ట్ లు ఇచ్చినట్లు అంతకు మించి అన్నట్లుగా ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు నడిచాయి. ఈ ట్విస్ట్ లకు కారణం **టిఎంయు అంతర్గత కలహాలు**. వారి సొంత సమస్యకు కోర్టుల కెక్కి 34 వేల మంది కార్మికులను ఇబ్బంది పెట్టారు. టిఎంయు 'ఎ' గ్రూప్, 'టి' గ్రూప్‌లుగా ఏర్పడి జూన్ 2026న జరగాల్సిన ఎన్నికలను అక్టోబర్ దాకా లాక్కొచ్చారు. ఒకసారి 'ఎ' వర్గం పైచేయి అయితే, మరోసారి 'టి' వర్గం పైచేయిగా సాగింది. ఈ రెండు వర్గాల వల్ల వారి క్యాడర్ అనుభవించిన క్షోభ వర్ణనాతీతం. ఎన్నికల్లో ఏ వర్గం ఉంటుందో తెలియదు. ఏ వర్గం ఊడుతుందో తెలియదు. లేక రెండు వర్గాలు ఉంటాయా? ఉండవా? అనే మిలియన్ డాలర్ల ప్రశ్నలు. గుర్తు దగ్గర నడిచిన డ్రామా కోర్టులు, ప్రభుత్వం జోక్యంతో పిచ్చెక్కిపోయింది. చివరి నిముషం వరకు నడిచిన ఈ మెలోడ్రామా కార్మికుల్ని గందరగోళం లోకి నెట్టింది. యూనియన్ తమకు రాదని తెలుసుకున్న 'ఎ' గ్రూప్ బాణం గుర్తుపై కన్నేసిం ది. ఎలాగైనా ఆ గుర్తును దక్కించుకోవాలని పావులు కదిపిం ది. ఫలితంగా టిఎంయు 'టి' వర్గ ఎన్నికల గుర్తు అయిన బాణం ఎ వర్గానికి పోయింది. టిఎంయు 'టి' వర్గానికి నిచ్చిన గుర్తు కేటాయించారు. ఇందులో కాంగ్రెస్ పనితనం బాగా ఉందని కార్మికులు అర్థం చేసుకున్నారు.

ఆర్‌టిసిలో తెలంగాణ వర్కర్స్ యూనియన్ గురించి ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. ఇది గతంలో టిఆర్‌ఎస్ యూనియన్. దీని గుర్తు చార్మినార్. ఈ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల గురించి ఆర్టీసి కార్మికులకు తెలియదు. దాని జెండా, ఎజెండా ఏమిటో తెలియదు. ఈ యూనియన్‌ని టిఎంయు 'ఎ' వర్గం అద్దెకు తెచ్చుకుంది. చార్మినార్ గుర్తుతో పోటీ పడకుండా చోరీ చేసిన గుర్తుపై పోటీకి దిగింది. ఈ యూనియన్ కి రాష్ట్రంలో ఏ డిపోలనూ కమిటీలు లేవు. వారెపుడూ కార్మికవర్గ సమస్యలపై పోరాడిందీ లేదు. 2016 ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కి వచ్చింది 37 ఓట్లు మాత్రమే.

టిఎంయు 'ఎ' వర్గం గతంలో టిఆర్ఎస్ పంచన చేరింది. గుండెల్లో కెసిఆర్‌ని నింపుకున్నారు. కెటిఆర్ పైజేబులో, హరీష్ రావు పక్క జేబులో ఉన్నట్లు చెప్పుకొన్నారు. ఎక్కడ చెడిందో కానీ ఆ నాయకుడు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. కాదు తూచ్ అని కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అంతే... అక్కడనుండి కాంగ్రెస్ పార్టీ ఆ నాయకుడిని వెనకేసుకొచ్చింది. కాంగ్రెస్ పార్టీ తమ సొంత యూనియన్ అయిన ఐఎన్‌టియుసి అనుబంధ సంఘాన్ని గాలికి వదలి తెలంగాణ వర్కర్స్ అనే యూనియన్ ను అద్దెకు తెచ్చి అద్దె నాయకులకు బ్రహ్మరథం పట్టింది. ఆ నాయకులు ఎర్రజెండా యూనియన్‌ను ఎన్నికల్లో గెలవనివ్వబోం అంటూ భీషణ ప్రతిజ్ఞ చేశారు. అద్దె నాయకులు రియల్టర్లు కావడంతో ట్రిపుల్ M ఫార్ములాను అమలు చేశారు. మందు ఏరులై పారింది. మనీ సర్క్యులేషన్ లోకి వచ్చింది. మందుకు మటన్ తోడై మత్తెక్కిచ్చింది. తాగారు, ఊగారు, వాగారు. వారి వల్ల ఎన్ని మూగజీవాలు బలయ్యాయో లెక్కలేదు. ఓటుకు నోటు అనే విధంగా రియల్టర్లు విజృంభించారు. ఇది నాణానికి ఒక వైపు.

ఇప్పుడు నాణానికి మరోవైపున ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకత్వం జెఎసి లో ఉన్న టిఎంయు, ఎన్ఎంయు లతో ఐక్యకూటమి ఏర్పాటు చేసి ఎన్నికల బరిలో నిలిచింది. ఈ జెఎసి పక్షానికి ట్రిపుల్ ఎం ఫార్ములా సౌకర్యాలు లేవు. వీరు 3 బృందాలుగా ఏర్పడి నేరుగా కార్మికవర్గంలోకి చొచ్చుకుపోయి ప్రచారం చేశారు. అద్దె యూనియన్ నాయకుల ప్రచార శైలి ధనస్వామ్యంతో నడిస్తే, ఎంప్లాయీస్ యూనియన్ జెఎసి కూటమి ప్రచారశైలి జనస్వామ్యంతో నడిచింది. వీరు ప్రతి డిపోలో గేటు మీటింగులు పెడుతూ కార్మికులను వ్యక్తిగతంగా కలుస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అద్దె యూనియన్ నాయకులు వారికున్న ఆర్థిక వనరులతో ప్రచారాన్ని హోరెత్తించాడు. గజమాలలు, గండపెండేరాలు, పూలవర్షాలు, కాన్వాయ్‌లు, హోర్డింగులు, కటౌట్లతో చేసిన ప్రచారం అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలను తలపించింది. తెలంగాణ వర్కర్స్ యూనియన్ వారు రీజియన్లలో బహిరంగ సభలు, జన సమీకరణలు, బాజా భజంత్రీలతో ప్రచారానికి రంగులద్దారు. ఎంప్లాయీస్ యూనియన్ జెఎసి కూటమి ఈ ఎన్నికల్లో ఎక్కడా ఒక్క బహిరంగ సభ కూడా నిర్వహించలేదు. ఓటుకు నోటును ఎంప్లాయీస్ యూనియన్ ఐక్య కూటమి పంచిన దాఖలాల్లేవు. అయినా ఈ కూటమికి కార్మికులు ఓట్ల వర్షం కురిపించారు. 10,000 ఓట్ల మెజారిటీతో గెలవాల్సిన ఎంప్లాయీస్ యూనియన్ ఐక్య కూటమి, అద్దె యూనియన్ నాయకులిచ్చిన తాయిలాలతో మెజారిటీ తగ్గింది తప్ప ఎంప్లాయీస్ యూనియన్ గెలుపుని ఆపలేకపోయారు.

అక్టోబర్ 14, 15 తేదీలలో జరిగిన పోస్టల్ బ్యాలెట్‌లో కూడా అద్దె సంఘ నాయకులు నోట్లకట్టలతో కార్మికుల్ని ప్రభావితం చేయాలని చూశారు. మెదక్ లో 18 ఓట్లు వస్తే అద్దె యూనియన్ ఆ రీజియన్ క్లాజ్–6 గెలిచే పరిస్థితి వచ్చింది. ఒక ఓటుకు 2 లక్షల రూపాయలు ఆఫర్ ఇచ్చారు. అయినా వారికి కేవలం ఒకే ఒక్క ఓటు దక్కింది. మరికొన్ని చోట్ల ఫోన్ పేలు, గూగుల్ పేలు నడిపారు. కంచిపట్టు చీరలు పంచారు. వారే గెలిచి విజయోత్సవ సభ నిర్వహిస్తారనే నమ్మకంతో మహిళలకు డ్రెస్ కోడ్ పేరుతో పట్టు చీరల పంపకం జరిగింది. అయినా వారు ఓటమిపాలయ్యారు. రాష్ట్ర గుర్తింపు సంఘంగా ఎంప్లాయీస్ యూనియన్‌నే 18,375 ఓట్లు ఇచ్చి కార్మికవర్గం ఎంచుకుంది. అద్దె సంఘానికి 13,709 ఓట్లు మాత్రమే రావడంతో ఆ నాయకుల ఆశలు అడియాసలయ్యా యి.

ఎన్నికల ప్రచారానికి ఎంప్లాయీస్ యూనియన్ కార్మికుల్ని డొనేషన్లు(విరాళాలు) అడుగుతుంటే, అద్దె యూనియన్ నాయకులు కార్మికులకు డబ్బు ఆఫర్ చేయడం జరిగింది. వారికి ఏ లాభం లేకుండా మనకి డబ్బెందుకు ఇస్తున్నారని కార్మికులు బుర్రకు పని చెప్పారు. వారి కుళ్ళు, కుతంత్రం కార్మికులు అర్థం చేసుకున్నారు. ఈయూ అయితేనే కార్మికుల పక్షాన పోరాడుతుందని నమ్మారు. అందుకే అద్దె సంఘాన్ని చిత్తుగా ఓడించారు. దానికి కూడా అనేక ట్విస్టులు. రాష్ట్ర గుర్తింపు సంఘంగా 9 యూనియన్లు పోటీ పడ్డాయి. బ్యాలెట్ పేపర్ లో వారి యూనియ న్లు ఉన్నా ఎస్.డబ్ల్యు.యు ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ సంఘం ఇది కాంగ్రెస్ పార్టీ యూనియన్ వారి త్రాసు గుర్తుకు ఓటు వేయకుండా అద్దె సంఘం గుర్తుపై ఓటేశారు. అలాగే మరో 6 సంఘాలు వారి గుర్తుకు ఓటు వేయకుండా అద్దె యూనియన్ గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ భక్తిని చాటుకున్నారు. ఎవరి గుర్తుకు వారు ఓటు వేసుకుంటే అద్దె సంఘానికి 5 వేల ఓట్లు తగ్గి 8 వేలకే పరిమితం అయ్యేది. ఓట్లు టోటల్ కాంప్లిమెంట్ 34,904 కాగా పోలైన ఓట్లు 34,421. వీటిలో 18,375 ఓట్లు సాధించి క్లాజ్–3 కింద రాష్ట్ర గుర్తింపు సంఘంగా ఎంప్లాయీస్ యూనియన్ గెలిచింది. టిడబ్ల్యుయుకి 13,709 ఓట్లు రావడంతో కాంగ్రెస్ పార్టీతో పాటు అద్దె సంఘ నాయకుల మైండ్ బ్లాంక్ అయిపోయింది. ఎంప్లాయీస్ యూనియన్ ఇచ్చిన షాక్ కి కాంగ్రెస్ పార్టీ షేక్ అయింది. అద్దె సంఘ నాయకులకు దిమ్మతిరిగి బొమ్మ కనబడింది. ఆ దెబ్బతో వారి ముఖచిత్రం మారిపోయింది. ఎస్.టి.ఎం. యు కి 15, బి.డబ్ల్యు.యు 320, కె.పి 0, కె.ఎస్ 193. బికెయు 259, ఎస్.డబ్ల్యు.యు 35, టిజెఎంయుకి 1,315 ఓట్లు స్టేట్ బ్యాలెట్ కు వచ్చాయి. 130 ఓట్లు చెల్లలేదు.

ఎంప్లాయీస్ యూనియన్‌ని ఓడించాలని, అద్దె సంఘాన్ని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు, చేసిన ప్రయత్నాలను ఆర్టీసి కార్మికులు తిప్పికొట్టారు. అందుకే ఈ విజయం కార్మికులకు అంకితం. రాష్ట్ర గుర్తింపు సంఘంగా ఎంప్లాయీస్ యూనియన్ పై బాధ్యత పెరిగింది. వెంటనే ప్రభుత్వ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయించి విలీన ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని కార్మికవర్గం కోరుతోంది.

ఇదిలా ఉంటే, కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం క్లాజ్–6 గుర్తింపు సంఘానికి ఆ రీజియన్లలో పోలైన ఓట్లలో 50 శాతం పైన రావాలి. అప్పుడు మాత్రమే ఆ యూనియన్‌కి క్లాజ్–6 గుర్తింపు ఇవ్వాలి. కాని నల్గొండ, వరంగల్, మెదక్ మరియు సికింద్రాబాద్ రీజియన్లలో 50శాతం పైన ఏ యూనియన్ కూ ఓట్లు రాలేదు.ఆ వివరాలు ఒక్కసారి పరిశీలిద్దాం. (పక్కన పట్టికలో)

ఇలాంటి సందర్భంలో రాష్ట్ర గుర్తింపు యూనియన్ ఆ నాలుగు రీజియన్లలో గుర్తింపు సంఘంగా ఉంటుందని కోడ్ ఆఫ్ డిసిప్లిన్ చెబుతోంది. కానీ రిటర్నింగ్ ఆఫీసర్ పై 4 రీజియన్లలో 50 శాతం ఓట్లు చూడకుండా ఆ రీజియన్‌లో ఎక్కువ ఓట్లు పొందిన యూనియన్ కు గుర్తింపు ఇచ్చింది. ఇది కోడ్ ఆఫ్ డిసిప్లిన్‌ను ఉల్లంఘించడమే. యూనియన్లను సంప్రదించకుండా, ముందస్తు నోటీసు లేకుండా రిటర్నింగ్ అధికారి ఏకపక్ష నిర్ణయం తీసుకోవడంలో కాంగ్రెస్ పార్టీ హస్తం ఉందని కార్మిక సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. అలా చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన అద్దె యూనియన్ టిడబ్ల్యుయు వర్గానికి 3 రీజియన్లు కట్టబెట్టడం రిటర్నింగ్ అధికారి చేసిన దుందుడుకు చర్య. లేబర్ డిపార్టుమెంట్ లోనే అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్ జరుగుతుంటే వర్కింగ్ క్లాస్ తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలి? 28–10–2026న ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జెఎసి రిటర్నింగ్ అధికారి ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ లేబర్ కమిషనర్ ఆఫీస్‌ను ముట్టడించారు. కార్మిక వర్గం గర్జనతో ఆ ప్రాంతం హోరెత్తింది. పరిస్థితిని గమనించిన అడిషనల్ లేబర్ కమిషనర్ చర్చలకు ఆహ్వానించి, సమస్యను రిజాల్వ్ చేస్తామని హామీ ఇవ్వటంతో కార్మికులు శాంతించారు.



S.No.	Union	Region	Com.Votes	Clause–6 గుర్తింపుకు రావలసిన ఓట్లు	యూనియన్‌కు వచ్చిన ఓట్లు	తేడా	రిమార్క్స్
1.	SWF	NLG	2,036	1,019	965	54	50% రాలేదు. గుర్తింపు ఇచ్చారు
2.	TWU	WL	3,041	1,521	1,451	70	50% రాలేదు. గుర్తింపు ఇచ్చారు
3.	TWU	MDK	1,808	905	887	18	50% రాలేదు. గుర్తింపు ఇచ్చారు
4.	TMU	Secbad	6,718	3,360	3,244	116	50% రాలేదు. గుర్తింపు ఇచ్చారు

ప్రజా ఉద్యమాలే ఊపిరిగా..పేదల పక్షాన పోరాటమే జీవితంగా...
వరంగల్ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో కామ్రేడ్ మేకల రవి ప్రస్థానం

వరంగల్ జిల్లా రాజకీయ, సామాజిక ఉద్యమ చరిత్రలో సిపిఐ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మేకల రవికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. సుమారు నాలుగు దశాబ్దాల పాటు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)లో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ప్రజా నాయకుడు ఆయన. ఆయన అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, వరంగల్ జిల్లా ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. ప్రజానాట్యమండలి నుంచి రాజకీయ ప్రస్థానం 1986లో ప్రారంభమై, ప్రజానాట్యమండలి కళాకారునిగా తన ప్రజా జీవితాన్ని ప్రారంభించిన మేకల రవి, కళను ప్రజా చైతన్యానికి ఆయుధంగా మలిచారు. పాటలు, కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సామాన్య ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని కల్పించేందుకు కృషి చేశారు. అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీతో అనుబంధం పెంచుకొని పార్టీ నిర్మాణంలో క్రియాశీలకంగా పనిచేశారు. పార్టీ నిర్మాణంలో కీలక బాధ్యతలు చేపట్టిన మేకల రవి తన రాజకీయ జీవితంలో అనేక ముఖ్యమైన బాధ్యతలను నిర్వహించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) నగర కార్యదర్శిగా, సిపిఐ వరంగల్ నగర కార్యదర్శిగా, వరంగల్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యునిగా పనిచేశారు. అలాగే ఎఐటియుసి వరంగల్ జిల్లా నిర్మాణ బాధ్యతల్లో కీలక పాత్ర పోషించారు. పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను క్రమశిక్షణతో, అంకితభావంతో నిర్వహిస్తూ కార్యకర్తలకు మార్గదర్శకంగా నిలిచారు. భూపోరాటాల సందర్భంలో పేదల పక్షాన అలుపెరుగని పోరాటం చేశారు. వరంగల్ నగరంలో పేదలు, నిరుపేద కుటుంబాలు, ఇళ్ల స్థలాలు లేని నిరాశ్రయుల సమస్యలపై ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపారు. భూపోరాటాల్లో చురుకుగా పాల్గొంటూ వేలాది పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు సాధించేందుకు జరిగిన పోరాటాల్లో కీలక పాత్ర పోషించారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, వారి హక్కుల కోసం అధికారులను నిలదీస్తూ, ప్రజలను సమీకరిస్తూ ఉద్యమాలు నిర్వహించారు. మైక్రోఫైనాన్స్ బాధితుల కోసం పోరాటం మైక్రోఫైనాన్స్ సంస్థల వేధింపులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మహిళలు, కుటుంబాలకు అండగా నిలిచారు. అధిక వడ్డీలు, అప్పుల ఒత్తిళ్లు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా బాధితులను సమీకరించి పోరాటాలు నిర్వహించారు. పేదల ఆర్థిక హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి ప్రజా ఉద్యమ చరిత్రలో గుర్తుండిపోతుంది.



కార్మిక, యువజన ఉద్యమాలకు సేవలు

యువజన ఉద్యమం నుంచి కార్మిక ఉద్యమం వరకు వివిధ రంగాల్లో తనదైన ముద్ర వేశారు. యువతను సామాజిక మార్పువైపు నడిపించడంలో, కార్మికుల సమస్యలపై పోరాడడంలో, సంఘటిత శక్తి ప్రాధాన్యతను వివరించడంలో కృషి చేశారు. ప్రజా సంఘాల నిర్మాణానికి, పార్టీ విస్తరణకు నిరంతరం శ్రమించారు. నేటి తరానికి ఆయన జీవితం స్ఫూర్తిగా నిలుస్తుంది. పదవులు, హోదాల కంటే ప్రజల మధ్య ఉండటానికే ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడు మేకల రవి. ఎన్నో ప్రజా ఉద్యమాల్లో భాగస్వామిగా ఉంటూ, పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో పనిచేశారు. ఆయన అకాల మరణం సిపిఐ వరంగల్ జిల్లా సమితికి, ప్రజా సంఘాలకు, ఉద్యమకారులకు తీరని లోటు. కామ్రేడ్ మేకల రవి భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన చేసిన ప్రజా పోరాటాలు, పేదల కోసం సాగించిన ఉద్యమాలు, పార్టీ నిర్మాణానికి చేసిన సేవలు ఎప్పటికీ ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి. ఎర్రజెండా నీడలో సాగిన ఆయన పోరాట జీవితం రాబోయే తరాలకు మార్గదర్శకం. కామ్రేడ్ మేకల రవికి జోహార్లు!

షేక్ బాష్ మియా, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి

యాదవుల ఆత్మగౌరవానికి
కాంగ్రెస్ ప్రభుత్వ అండ

‘శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్’లో
ముఖ్యమంత్రి సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : యాదవుల ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం విషయంలో తమ ప్రభుత్వం రాజీపడబోదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. యాదవులకు కేవలం గౌరవమే కాకుండా, వారికి దక్కాల్సిన రాజకీయ, సామాజిక వాటా కూడా కల్పిస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఇప్పటికే యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో పాటు నిర్వహణకు రూ.5 కోట్లు కేటాయించామని తెలిపారు. శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ చైర్మన్ మాజీ ఎంపి ఎం.అంజన్ కుమార్ యాదవ్, ఎంపి ఎం.అనిల్ కుమార్ యాదవ్‌ల నేతృత్వంలో నిర్వహించిన సదర్ సమ్మేళానికి ముఖ్యఅతిథులుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సదర్ యాదవుల పండుగ మాత్రమే కాదని, యావత్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ సమ్మేళనమని పేర్కొన్నారు.

గతంలో ఏ ముఖ్యమంత్రి సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని, యాదవుల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ గుర్తింపును ఇచ్చిందన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకమని, ఒకనాటి గొల్లకొండే నేటి గోల్కొండగా మారిందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని కొనియాడారు. యాదవ సామాజిక వర్గానికి తమ ప్రభుత్వం తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించిందన్నారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించామని సిఎం వివరించారు.

తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి : తెలంగాణాను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవనం, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర ప్రగతిలో యాదవులు భాగస్వాములు కావాలని సిఎం పిలుపునిచ్చారు.

రాహుల్‌గాంధీ, తేజస్వీ యాదవ్ స్నేహం దేశానికి అవసరం : ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, బీహార్ నేత తేజస్వీ యాదవ్ మధ్య కొనసాగుతున్న స్నేహం దేశానికి ఎంతో అవసరమని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. వీరిద్దరి స్నేహం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

తెలంగాణలో సిఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లే, బీహార్‌లో తేజస్వీ యాదవ్ రూపంలో మరో యువ ముఖ్యమంత్రిని చూడాలని ఆశిస్తున్నామని, ఆయన ముఖంలో రాహుల్‌గాంధీ కనిపిస్తున్నారని, ఇద్దరూ కవల సోదరుల్లా ఉన్నారని వ్యాఖ్యానించారు. ఈ సదర్ సమ్మేళనంలో మంత్రి పొన్నం ప్రభాకర్, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, ఎంపి మల్లు రవి, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎంపి ధర్మేంద్ర యాదవ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాష్ట్రాలకు చెందిన యాదవ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్ నినో ముప్పును
సమర్థవంతంగా ఎదుర్కోవాలి

ప్రజల్లో అవగాహన పెంచాలి..
గ్రామాల్లో పర్యటించాలి
శాసనమండలి చైర్మన్
గుత్తా సుఖేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/నకిరేకల్ : ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తలెత్తే సవాళ్లను సమష్టిగా, సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని,కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం నకిరేకల్ పట్టణ కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో నియోజకవర్గస్థాయి ఎల్ నినో అవగాహన సదస్సు నిర్వహించారు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు, ఆయా శాఖల పనితీరుపై సమీక్షిస్తూ అధికారులను ప్రశ్నించారు. కొందరు అధికారులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

తమ పనితీరును మార్చుకోవాలని, శాఖలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర,ఆదాయం లభించే డిమాండ్ ఉన్న పంటల సాగును ప్రోత్సహించాలని, వచ్చే సీజన్లలో సన్నధాన్యం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని గుత్తా సూచించారు.

భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితులు డిసెంబరు, జనవరి నుంచి సమస్య మరింత తీవ్రం కావచ్చని అన్నారు. రైతులు యాసంగిలో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు.

ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల ప్రధాన పనులను పూర్తి చేసి, వాటి ద్వారా చెరువులను నింపుతామని చెప్పారు. 1951 నుంచి 2026 వరకు దేశంలో 16సార్లు కరువు పరిస్థితులు ఏర్పడగా, పదిసార్లు తెలంగాణ ప్రభావితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అవసరమైతే అద్దె బోర్ల ద్వారా తాగునీరు అందిస్తామని, పశుగ్రాసం సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉంటే ప్రస్తుత పరిస్థితులు తలెత్తేవికావని విమర్శించారు. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, జిల్లా జాయింట్ కలెక్టర్లు శ్రీనివాస్,ప్రేమ్‌కరణ్ రెడ్డి, డిఆర్‌డిఓ శేఖర్‌రెడ్డి, ఆర్‌డిఓ వై.అశోక్‌రెడ్డి, చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీత, మాజీ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, గుత్తా మంజుల మాధవరెడ్డి, నాగులవంచ వెంకటేశ్వరరావు, స్థానిక మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, గున్నోజు బ్రహ్మాచారి,తహసీల్దార్ యశ్వంత్ రాజ్ వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

షార్ట్‌ఫిలిం సిడిని ఆవిష్కరించిన గుత్తా : ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులు ఉపన్యాసాలకే పరిమితం కాకుండా.. పల్లె ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా పాటలు, వీధి నాటకాలతో అవగాహన కల్పించడం అభినందనీయమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఎంపిడిఓ జిఎంఎస్ బ్రహ్మాచారి రూపొందించిన జలసిరి బతుకమ్మ (ఎల్ నినోను ఎదుర్కొనే వ్యూహాలు) షార్ట్‌ఫిలిం సిడిని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, జిల్లా కలెక్టర్, చంద్రశేఖర్ అదనపు కలెక్టర్, శ్రీనివాస్ డిఆర్‌డిఏ పీడీ శేఖర్ రెడ్డి తదితరులతో కలిసి ఆవిష్కరించారు.

రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే మా లక్ష్యం

తెలంగాణలో 14 ఎంపి స్థానాలు గెలుస్తాం
అమిత్ షా వ్యాఖ్యలకు ధీటైన సమాధానం ఇస్తాం: జగ్గారెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలా వద్దా అనేది నిర్ణయించేది దేశ ప్రజలేనని, ఆయన ప్రధాని కాలేరని చెప్పడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎవరని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ప్రశ్నించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని, తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు గాను 14 స్థానాలు గెలిచి కాంగ్రెస్‌కు అందిస్తామని ప్రకటించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2004లో యుపిఎ ప్రభుత్వం ఏర్పడినప్పుడు సోనియా గాంధీని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలని ఎంపిలు కోరినా వారు ఆ పదవిని స్వీకరించలేదని జగ్గారెడ్డి గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా నియమించారని, ఆయన కూడా రాహుల్ గాంధీని ప్రధాని పదవి చేపట్టాలని కోరగా తిరస్కరించారని తెలిపారు. నెహ్రూ, గాంధీ కుటుంబాలు దేశ ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షించాయని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ రఘుపతి రాఘవ రాజారాం భజన చేసిన సమయంలో బిజెపి పుట్టలేదని, శ్రీరాముడి పేరును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. శ్రీరాముడి పేరుతో అధికారంలో ఉన్న బిజెపి ఆయన ఆదర్శాలకు అనుగుణంగా పాలన సాగించడం లేదని మండిపడ్డారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కాంగ్రెస్ నాయకుడని, నెహ్రూ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. తెలంగాణను భారతదేశంలో విలీనం చేయడంలో పటేల్ పాత్రను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ నేతల చరిత్రను కూడా బిజెపి తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అమిత్ షా అహంకారపూరిత వ్యాఖ్యలకు రానున్న ఎన్నికల్లో ప్రజలే సమాధానం చెబుతారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

రైతు భరోసా నిధుల విడుదలపై తప్పుడు సందేశాలు

సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

ప్రజాపక్షంహైదరాబాద్ : రైతు భరోసా నిధులు విడుదలయ్యాయంటూ కొన్ని జిల్లాల రైతులకు బుధవారం ఉదయం వచ్చిన సందేశాలు పూర్తిగా అవాస్తవమని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ఈ సందేశాలకు ఎలాంటి ఆధారాలు లేవని, రైతులు వాటిని నమ్మవద్దని వ్యవసాయ శాఖ సంచాలకుడు డాక్టర్ బి.గోపి తెలిపారు ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యవహారంపై సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్), నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసి) సంస్థలతో చర్చించిన అనంతరం ఈ సందేశాలు నిరాధారమైనవిగా నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. తప్పుడు సందేశాల వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసేందుకు సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించామని, సమగ్ర విచారణ చేపట్టాలని కోరినట్లు వెల్లడించారు.

రాష్ట్ర పర్యటనకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ రాష్ట్ర పర్యటనకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. రాష్ట్రానికి ఒక్క మెట్రో ప్రాజెక్టు, ఒక్క జాతీయ ప్రాజెక్టు, ఒక్క జాతీయ స్థాయి విద్యాసంస్థనైనా తీసుకురాలేదన్నారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే, బిజెపి చెప్పులు మోసే పార్టీగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ హైదర్‌నగర్ డివిజన్ నాయకులు దామోదర్ రెడ్డి తెలంగాణ భవన్‌లో బుధవారం బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, రాష్ట్ర హక్కులను ఢిల్లీ పార్టీల నాయకత్వాల ముందు తాకట్టు పెడుతున్న కాంగ్రెస్, బిజెపి తీరు దొందూ దొందే అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే తమ రాజకీయ ప్రయోజనాలకే ఆ పార్టీ నాయకులు ప్రాధాన్యతనిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నాయకుల ముందు తాకట్టు పెట్టే కాంగ్రెస్, బిజెపిలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళ్తున్నారని, రాష్ట్ర పరిపాలన కంటే ఢిల్లీ పర్యటనలు, రాజకీయ ప్రయోజనాలపైనే ఆయన ఎక్కువ దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. భూ దందాలు, కమీషన్ల కోసమే ఎమ్మెల్యే గాంధీ రేవంత్ రెడ్డి పంచన చేరారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై పగబట్టి నీటిని ఎత్తిపోయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే హైదరాబాద్‌లో మళ్లీ తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. ఎన్నికల సమయంలో అడ్డూ అదుపు లేకుండా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం లేదన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

తెలంగాణ సమాజానికి క్షమాపణ
చెప్పాలని డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణకు వచ్చి కేంద్ర హోంమంత్రి అమిత్ షా అబద్ధాలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధిపై మాట్లాడే ముందు 12ఏళ్ల బిజెపి పాలనలో తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇద్దరు కేంద్ర మంత్రులు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా తెలంగాణకు ఎన్ని నిధులు తీసుకొచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ‘ఆర్‌ఆర్ ట్యాక్స్’ అంటూ ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ గాంధీ భవన్ ఎదుట అమిత్ షా దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశాయి. తెలంగాణ సమాజానికి అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి.టిపిసిసి ఫిషరీస్ సెల్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, గ్రంథాలయ మాజీ చైర్మన్ రియాజ్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కవులు, కళాకారులు కల్వకుంట్ల కుటుంబానికి కనిపించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కళాకారులు సిద్ధమయ్యారని తెలిపారు. కళాకారులకు చేసిన అన్యాయం బిఆర్‌ఎస్‌కు తగిలిందని వ్యాఖ్యానించారు. గద్దర్‌ను కెసిఆర్ అవమానించిన విషయాన్ని కళాకారులు మర్చిపోలేదని అన్నారు. ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గద్దర్ పేరుతో అవార్డులు అందిస్తున్నారని, అందెశ్రీ రచించిన పాటను రాష్ట్ర గీతంగా మార్చారని తెలిపారు. గోరేటి వెంకన్నకు కోటి రూపాయల నజరానా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ పదేళ్ల మోసంపై కళాకారులు గళం విప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కెటిఆర్ కళాకారుల గురించి మాట్లాడటం వారిని మరోసారి అవమానించడమేనని మెట్టు సాయికుమార్ విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో దోపిడీ, మోసాలకు గురికాని వర్గం లేదని ఆరోపించారు. తెలంగాణ కులగణనలో లేని కల్వకుంట్ల కుటుంబానికి రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. బిఆర్‌ఎస్‌కు 14 ఏళ్ల వనవాసం తప్పదని అన్నారు.

ఒలింపిక్స్‌లో పతకాలే తెలంగాణ క్రీడాకారుల లక్ష్యం కావాలి

క్రీడలు టైమ్‌పాస్ కోసం కాదు..
ప్రపంచం మనవైపు చూసేలా ఆడాలి
మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి ప్రపంచ వేదికపై తెలంగాణ కీర్తిని చాటిచెప్పడమే రాష్ట్ర క్రీడాకారుల ప్రధాన లక్ష్యం కావాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. క్రీడలు కేవలం కాలక్షేపం కోసం కాదని, ప్రపంచం మనవైపు చూసేలా ప్రతిభను ప్రదర్శించాలని అన్నారు. కఠోర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో అంతర్జాతీయ పోటీలకు సిద్ధం కావాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో పునర్నిర్మించిన టెన్నిస్ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలు, శిక్షణ కోసం ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో జరగనున్న ఖేలో ఇండియా పోటీల్లో 29 రాష్ట్రాల నుంచి సుమారు 7 వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. ఈ పోటీలకు ఆతిథ్యమిచ్చే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ రెండో ఎడిషన్‌ను విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. ప్రతిభావంతులకు నాణ్యమైన శిక్షణ, మెరుగైన వసతులు, తగిన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్‌లకు డీఎస్పీ ఉద్యోగాలు కల్పించి ప్రభుత్వం గౌరవించిందని గుర్తుచేశారు. భారత్ కంటే చిన్న దేశమైన దక్షిణ కొరియా ఒలింపిక్స్‌లో విశేషమైన పతకాలు సాధిస్తోందని, భారత్ కూడా ఆ స్థాయికి చేరుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ అందించడంతోపాటు వారి నైపుణ్యాలను మెరుగుపరచాలని సూచించారు. లక్ష్యాలను చిన్నవిగా నిర్దేశించుకోకుండా ప్రపంచ స్థాయి పోటీల్లో విజయం సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. తెలంగాణ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. క్రీడారంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపడంతోపాటు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.

నీటి కొరత పేరుతో విద్యార్థులకు సెలవులా?

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి,
పుట్ట లక్ష్మణ్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : నీటి కొరత పేరుతో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తూ విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తే సహించేది లేదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావం సాకుతో విద్యార్థులను ఇళ్లకు పంపడం, ఆన్‌లైన్ తరగతుల పేరుతో చదువులకు విఘాతం కలిగించడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, హాస్టళ్లలో నీటి సమస్యపై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని పలు విద్యాసంస్థలు, హాస్టళ్లలో నీటి కొరత కారణంగా సెలవులు ప్రకటించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. బోర్లలో నీరు అందుబాటులో లేకపోతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో వార్షిక, ప్రవేశ పరీక్షలు ఉండటంతో విద్యార్థులు హాస్టళ్లలోనే ఉంటూ చదువుకుంటారని, ఇప్పుడే నీటి సమస్య తలెత్తితే పరీక్షల సమయంలో పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.ఇప్పటికే 80 శాతం ఫీజులు వసూలు చేసిన ప్రైవేటు విద్యాసంస్థలు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తున్నాయని ఆరోపించారు. నీటి కొరత పేరుతో విద్యార్థులను ఇళ్లకు పంపి ఆన్‌లైన్ తరగతులు నిర్వహించే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. విద్యాసంస్థల్లో నీటి సరఫరా, వినియోగంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల చదువులతో చెలగాటమాడే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేయాలని మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొడంగల్‌లో నవంబర్ 7 నుంచి మెగా రైతు మేళా

ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు ఈనెల7 నుంచి 9వ తేదీ వరకు కొడంగల్‌లో మెగా రైతు మేళా నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 7వ తేదీ ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేళాను ప్రారంభిస్తారన్నారు. 26 ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థల భాగస్వామ్యంతో 150 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, నాణ్యమైన విత్తనాలు, డ్రిప్ పరికరాలు ప్రదర్శించనున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో సాంకేతిక సమావేశాలు, ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు.మొదటి రోజు 7,500 మంది రైతులు, రెండో రోజు మహిళా రైతులు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. చివరి రోజు సుమారు 10 జిల్లాల నుంచి 50 వేల మంది రైతులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. రైతుల ఆదాయం పెంపు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే విధానాలపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ చక్రపాణికి ముఖ్యమంత్రి సంతాపం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ డాక్టర్ ఎ.చక్రపాణి మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలిని పునరుద్ధరించిన అనంతరం తొలి చైర్మన్‌గా డాక్టర్ చక్రపాణి ఎంతో నిబద్ధతతో పని చేశారని గుర్తుచేసుకున్నారు. పార్లమెంటరీ సంప్రదాయాల పట్ల అపారమైన గౌరవం కలిగిన చక్రపాణి చైర్మన్‌గా నిష్పక్షపాతంగా వ్యవహరించారని సిఎం పేర్కొన్నారు. దాదాపు ఐదు దశాబ్దాల ప్రజా జీవితంలో అంకితభావంతో ఆయన ఎన్నో సేవలందించారని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఒక సంతాప సందేశంలో సిఎం పేర్కొన్నారు.

భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ డాక్టర్ ఎ. చక్రపాణి మృతి పట్ల తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. డాక్టర్ చక్రపాణి మరణవార్త తనను ఎంతగానో కలచివేసిందని పేర్కొన్నారు.

ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక సానుభూతిని తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. దివంగత నేత ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

బిసి కమిషన్ చైర్మన్ సంతాపం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి మాజీ చైర్మన్ ఎ. చక్రపాణి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో దశాబ్దాల పాటు నిరాడంబరంగా, విలువలకు కట్టుబడి చురుకైన పాత్ర పోషించిన వ్యక్తిగా చక్రపాణి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా ఆయనతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, పలు కార్యక్రమాల్లో కలిసి పనిచేసిన సందర్భాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. చక్రపాణి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

తెలంగాణ ప్రభుత్వం
ఇరిగేషన్ సర్కిల్, ఆర్మూర్.
టెండర్ నోటీసు
నిజామాబాద్ జిల్లా, ఎర్గట్ల మండలం, తడ్పకల్ గ్రామంలోని గోదావరి పుష్కర ఘాట్ మరమ్మతు పనులకు సంబంధించి (గోదావరి పుష్కరాలు 2026-27), టెండర్ నోటీసు నం. 23/2026-27 (తేదీ: 04.11.2026) ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. రూ.78.50 లక్షల విలువైన ఈ పనులకు సంబంధించిన టెండర్ వివరాలు 04-11-2026 నుండి 18-11-2026 వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ (e-procurement) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాల కోసం https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించగలరు.
సం/- పర్యవేక్షక అభియంత,
నీటి పారుదల సర్కిల్, ఆర్మూర్
DIPR R.O. No. : 13138-PP/CL/ADVT/2026-27, Date: 04-11-2026

MMC
మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్
డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, వెటర్నరీ సెక్షన్, ఎంఎంసి.
మెయిల్: ddveterinary.mmc@gmail.com సెల్ నెం: 9989930-397
Lr.No. 109/DD/VET/MMC/2026 ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 04.11.2026
NIT No. 19/DD/VET/MMC/2026, Item No.1 to 2, తేది: 04.11.2026

Sl. No.	పని పేరు	అంచనా విలువ (రూ.లలో)
1	ఉప్పల్ జోన్ - ABC/ARV కార్యక్రమం - అర్హతగల NGOలు / AWOల ద్వారా పశు జనన నియంత్రణ (ABC) / యాంటీ-రాబిస్ వ్యాక్సినేషన్ (ARV) కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానించే ప్రతిపాదన. (2వ రీ-కాల్).	రూ. 1,04,40,000/-
2	మల్కాజిగిరి జోన్ - ABC/ARV కార్యక్రమం - అర్హతగల NGOలు / AWOల ద్వారా పశు జనన నియంత్రణ (ABC) / యాంటీ-రాబిస్ వ్యాక్సినేషన్ (ARV) కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానించే ప్రతిపాదన. (2వ రీ-కాల్).	రూ. 1,21,80,000/-

ఈవెంట్స్	క్ర.నం.1 నుండి 2 కొరకు
డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ	05/11/2026 మ.3.00 గం.లకు
డౌన్‌లోడ్ ముగింపు తేదీ	09/11/2026 మ.3.00 గం.ల వరకు
ప్రైస్ బిడ్ ప్రారంభ తేదీ	09/112026 మ.3.01 గం.లకు

మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.inలో చూడవచ్చు
సం/- డిప్యూటీ డైరెక్టర్, వెటర్నరీ సెక్షన్,
మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్
DIPR R.O. No. : 13124-PP/CL/ADVT/2026-27, Date: 04-11-2026

మార్కెట్ చైర్మన్ పీఠం కోసం పోటాపోటీ

ఆశల్లో త్రిమూర్తులు
పట్టుబడుతున్న కడియం శ్రీహరి
సీనియర్ కోటాలో
వంగాల తీవ్ర ప్రయత్నం







ప్రజాపక్షం/జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పీఠం కోసం తీవ్ర పోటీ నెలకొంది. ముగ్గురు సీనియర్ నాయకులు పోటీ పడుతున్నారు. ఇద్దరు జనగామ మండలానికి చెందిన వారు కాగా మరో కరు రఘునాథ్లపల్లి మండలానికి చెందిన వారు. అయితే ఆనవాయితీగా చైర్మన్ పీఠం జనగామ నియోజకవర్గానికి చెందిన వారికే దక్కుతుంది. ఈ దఫా స్టేషన్ఘనపూర్ నియోజకవర్గానికి ఇవ్వాలని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి పట్టుబడుతున్నారు. దీనితో జనగామ మార్కెట్ కమిటి చైర్మన్ ఎంపిక రసవత్తంగా మారింది. ముఖ్యమంత్రి స్థాయిలో పావులు కదుపుతుండడంతో చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందన్నది ఆసక్తికరంగా నెలకొంది. జనగామ నియోజకవర్గం, జనగామ మండలానికి చెందిన వంగాల మల్లారెడ్డి మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటున్నారు. ఆయన భార్య వంగాల కళ్యాణి రెండు సార్లు మున్సిపాల్టీ కౌన్సిలర్గా పనిచేశారు. ప్రస్తుతం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. మల్లారెడ్డి సైతం పిఏసిఎస్ డైరెక్టర్గా పనిచేశారు. రాజకీయాల్లో తలపండిన నాయకుడే అయినప్పటికి పదవులు దక్కలేదు. ఈయన కొడుకు అమెరికాలో ఉంటుండగా రాహుల్గాంధీతో మంచి సంబంధాలుఉన్నట్లు సమాచారం. వంగాల మల్లారెడ్డి మొదటి నుండి మార్కెట్ కమిటి చైర్మన్ కోసం పోటీ పడ్డారు. గతంలో బిసికి కేటాయించడంతో ఆయన ప్రయత్నాలు విఫలయం అయ్యాయి. ఈ దఫా తప్పకుండా తనకే ఇవ్వాలని కోరడంతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, రాజ్యసభ సభ్యులు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్రెడ్డి, స్టేషన్ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ నియోజకవర్గ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్రెడ్డిని కలిసి చైర్మన్ పదవి తనకే ఇవ్వాలని కోరడంతో పాటు వారి వద్ద అభయం తీసుకున్నట్లు తెలుస్తుంది.


తీవ్ర ప్రయత్నాల్లో లింగాల జగదీష్చందర్రెడ్డి

స్టేషన్ఘనపూర్ నియోజకవర్గం రఘునాథపల్లి మండలానికి చెందిన లింగాల జగదీష్చందర్రెడ్డి మొదటి నుండి కాంగ్రెస్లో ఉన్నారు. వారి కుటుంబం పూర్తిగా కాంగ్రెస్. జగదీష్చందర్రెడ్డి గతంలో రఘునాథపల్లి జడ్పిటిసిగా పనిచేశారు. ఎవరు పార్టీలు మారినా ఆయన మాత్రం కష్టకాలంలోనూ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్లో చేరినప్పుడు సైతం ఆయన పార్టీ మారలేదు. పైగా సింగపురం ఇందిర, కడియం శ్రీహరి ఎవరు కాంగ్రెస్లోకి వచ్చిన పార్టీ కమిట్మెంట్తో వారి కోసం పనిచేశారు. ఒక విధంగా స్టేషన్ఘనపూర్ జనరల్ సీటు అయితే జగదీష్ చందర్రెడ్డి ఎమ్మెల్యే క్యాండెట్ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఆయనకు ఇప్పటి వరకు ఏ పదవి దక్కలేదు. గతంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోసం ప్రయత్నించగా మాజీ జడ్పిటిసి మారుజోడు రాంబాబుకు దక్కింది. ప్రస్తుతం జగదీష్చందర్రెడ్డికి పదవి ఇవ్వకుంటే కాంగ్రెస్లోని సీనియర్లను (పాత కాంగ్రెస్) కడియం గుర్తించడం లేదన్న విమర్శలు వచ్చే అవకాశం ఉంది. దీనితో కడియం శ్రీహరి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ దఫా స్టేషన్ఘనపూర్ నియోజకవర్గానికే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కొందరు సీనియర్లు సైతం జగదీష్చందర్రెడ్డియే సరియైన వ్యక్తి అన్న అభిప్రాయాలు సైతం వ్యక్తం చేస్తున్నారు.

తెరమీదకు కొత్త కరుణాకర్రెడ్డి పేరు

జనగామ మండలంలోని చిటకోడూరు గ్రామానికి చెందిన కొత్త కరుణాకర్రెడ్డి పేరు సైతం బలంగా వినిపిస్తుంది. ఈయన మొదటి నుండి కాంగ్రెస్లోనే ఉన్నారు. గడిచిన ఎమ్మెల్యే ఎన్నికల్లో సరిగా పనిచేయలేదని విమర్శలు ఉన్నాయి. అయితే నియోజకవర్గ ఇంఛార్జి కొమ్మూరి ప్రతాప్రెడ్డి కూడా కరుణాకర్రెడ్డికి అభయం ఇచ్చినట్లు తెలుస్తుంది. మొదట్లో ఈయన పేరు బలంగా వినిపించినప్పటికి ఆ తరువాత వినిపించలేదు. మళ్లీ తెరమీదకు వచ్చింది. ఇటీవల ఛలో డిల్లీ సందర్భంగా కరుణాకర్రెడ్డి డిల్లీలోనే ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి వద్ద చక్రం తిప్పించారన్న ప్రచారం జరుగుతుంది. ఇలా మార్కెట్ చైర్మన్ కోసం ముగ్గురు పోటీ పడుతుండగా ఎవరికి దక్కుతుందన్నది చర్చనీయాంశంగా మారింది.

పారదర్శకంగా అంగన్వాడీ పోస్టుల భర్తీ



ప్రజాపక్షం/ములుగు: అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా చేపడుతున్నామని జిల్లా వరావు తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని స్పష్టం చేశారు. బుధవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆర్డిఓ కృష్ణవేణి, ఎస్డిసి ప్రతాప్, డిఎంహెచ్ఓ గోపాలరావు, డిడబ్ల్యూఓ ప్రేమలత, ఫైవ్ మెన్ కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్, హెల్ప్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థుల అర్హతలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో దళారుల ప్రమేయానికి తావులేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని సూచించారు. జిల్లాలోని తాడ్వాయి, వెంకటాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 31 అంగన్వాడీ టీచర్, 104 అంగన్వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నవంబర్ 4 నుండి 7వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలిరోజు తాడ్వాయి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్ పోస్టుల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నవంబర్ 5న వెంకటాపురం ప్రాజెక్టు అంగన్వాడీ టీచర్ పోస్టులకు, 6న తాడ్వాయి ప్రాజెక్టు అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు, 7న వెంకటాపురం ప్రాజెక్టు అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటల నుండి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

పంట రుణాలను పునర్వ్యవస్థీకరించాలి

కరువు రైతులకు బ్యాంకుల అండ
బ్యాంకు అధికారులకు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం



ప్రజాపక్షం/భూపాలపల్లి: జిల్లాలో కరువు పరిస్థితుల నేపథ్యంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని, అవసరమైన ఆర్థిక సహాయ సహకారాలు అందించి వారికి ఉపశమనం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బ్యాంకు అధికారులను ఆదేశించారు. కరువు ప్రభావిత మండలాల రైతుల నుంచి రుణాల వసూళ్ల విషయంలో ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దని, రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని ఐడిఓసి సమావేశ మందిరంలో ఎల్డిఎం ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ (డిఎల్సిసి), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డిఎల్ఆర్సి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం జిల్లాలోని కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్, మల్హార్రావు, కొత్తపల్లి గోరి మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించిందన్నారు. ఆయా మండలాల రైతులకు ఉపశమనం కల్పించేందుకు ఎస్ఎల్బీసీ, ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం పంట రుణాలను పునర్వ్యవస్థీకరించాలని సూచించారు. కరువు ప్రభావిత మండలాల రైతులకు 12 నెలల మారటోరియం కల్పించడంతో పాటు రుణాల చెల్లింపు కాలపరిమితిని మొత్తం 36 నెలల వరకు పొడిగించే వెసులుబాటు ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని బ్యాంకు అధికారులు సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన రైతులందరికీ ప్రయోజనం చేకూర్చాలన్నారు. ఈ సమావేశంలో ఎల్డీఎం బి. నాగరాజు, ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్ సాయి, నాబార్డ్ ఏజీఎం చైతన్య, చంద్రశేఖర్, ఎస్బీఐ ఆర్ఎం సుబ్బారావు, యూబీఐ ఏజీఎం తేజావత్ సర్వేశ్, కృష్ణమోహన్, కే రాజశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జిల్లాలోని వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రా పద్ధతిలో రెండు పడకల ఇళ్ల కేటాయింపు: అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ: జనగామ మున్సిపాల్టీతో పాటు బచ్చన్నపేట మండల పరిధిలో మిగిలిపోయిన 93 రెండు పడక గదుల ఇళ్లకు బుధవారం డ్రా నిర్వహించి అర్హులైన వారికి కేటాయించారు. అదనపు కలెక్టర్ బోన్సా లోమ్, మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి, వైస్ చైర్మన్ బూష పర్వతాలు ఈ డ్రాలో పాల్గొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో చిత్రీకరణ మధ్య ఈ డ్రా కొనసాగింది. ఇందిరమ్మ ఇళ్ల ఎల్2 జాబితా, ప్రజావాణి ధరఖాస్తులు, ప్రజా ప్రతినిధులు లిఖితపూర్వకంగా అందజేసిన జాబితా ఆదారంగా ఆ మూడు జాబితాల్లోని అర్హత కుటుంబాన్ని ఏకీకృత జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. ఎంపిక జాబితాలు గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాలు, తహాశీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తామని, జిల్లా వెబ్సైట్లో కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. జనగామ మున్సిపాల్టీ పరిధిలోని బాణాపురంలో పరిధిలో 75 రెండు పడకల ఇళ్లకు డ్రా ద్వారా 75 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని, అదే విధంగా 15 మంది వేయిటింగ్ లిస్ట్ లబ్ధిదారులను కూడా డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగిందన్నారు. బచ్చన్నపేట మండలం ఇటుకాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల 18 రెండు పడకల గదుల ఇళ్లకు డ్రా పద్ధతిలో 18 మందికి ఎంనిక చేశామని, అదే విధంగా ఐదుగురు వేయింటింగ్ లబ్ధిదారులను సైతం ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇంఛార్జీ పిడి బల రామరావు, జనగామ మున్సిపల్ కమీషనర్ రాజశేఖర్రెడ్డి, అడిట్ అధికారి దేవేందర్, బచ్చన్నపేట తహాశీల్దార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా పేరుతో వస్తున్న నకిలీ సందేశాలపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ సందీప్కుమార్ ఝూ

ప్రజాపక్షం/జనగామ : రైతు భరోసా పేరుతో రైతులకు వస్తున్న సందేశాలు నకిలివని, వాటిని నమ్మవద్దని జిల్లా కలెక్టర్ సందీప్కుమార్ ఝూ తెలిపారు. బుధవారం ఆయనొక ప్రకటన చేస్తూ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశాలు, సూచనల మేరకు ఈ ప్రకటన జారీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల 70వేల మంది రైతులకు ఈ నకిలీ సందేశములు వచ్చినట్లు గుర్తించామని, ఈ విషయాన్ని సైబర్ క్రైమ్ విభాగం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రైతు భరోసా పేరుతో వచ్చే అనుమానాస్పద సందేశాలను రైతులు నమ్మవద్దని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

రైస్ డిపోలు, సూపర్ మార్కెట్లలో తనిఖీలు



ప్రజాపక్షం/జనగామ: బియ్యం ధరల్ని పెంచి విక్రయిస్తూ వినియోగదారులపై భారం వేస్తున్నారన్న సమాచారంతో తూనికలు కొలతలు అధికారి ఝాన్సీ, జిల్లా సివిల్ సప్లయ్ డిఎం సురేష్రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జనగామలోని పలు రైస్ డిపోలు, సూపర్ మార్కెట్లలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు సూపర్ మార్కెట్లతో విక్రహిస్తున్న బియ్యం బస్తాలను కాంటా వేసి సరిచూశారు. బిపిటి కిలో ధర 66 రూపాయలు, ఆర్ఎన్ కిలో ధర 74 రూపాయలు, జెఎస్ఆర్ కిలో ధర 79 రూపాయలు ధరను వ్యాపారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. జిల్లా కలెక్టర్ సందీప్కుమార్ ఝా ఆదేశాల మేరు తనిఖీలు చేయడం జరిగిందని, బియ్యం బ్యాగుల్లో నిర్ధిత ప్రమాణాలు పాటించాలని, తూకం తక్కువగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. పలు బ్యాగులతో తూకం తక్కువగా ఉండాన్ని గుర్తించారు. తక్కువ బియ్యం ఉన్న వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. వ్యాపారులు నిర్రేదశించిన ధరల పట్టికను తప్పనిసరిగా పాటించాలన్నారు. బియ్యం కుత్రిమ కొరత సృష్ఠించి ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనికీల్లో ఏసి ఎస్ఓ ఇర్ఫాన్, డిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

10న కలెక్టరేట్ ముట్టడి

సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్

ప్రజాపక్షం/మరిపెడ: మహబూబాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలనీ, పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న తలపెట్టిన జిల్లా కలెక్టరెట్ ముట్టడి కార్యక్రమంలో రైతులు, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ పిలుపునిచ్చారు. జిల్లాలో నెలకొన్న వర్షభావ పరిస్థితుల వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రైతులకు పంట నష్ట పరిహారం, రుణ ఉపాశమనం కలిగించాలనీ కోరారు. అలాగే నవంబర్ 5,6,7 తేదీలలో సిపిఐ బృందం కరువు ప్రభవిత ప్రాంతలలో పర్యటించి పంట నష్టలను, రైతు సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. మరిపెడ మండలంలోని ప్రతి గ్రామం నుంచి రైతులు,కర్షకులు ఐక్యంగా తరలివచ్చి నవంబర్ 10న తలపెట్టిన కలెక్టరెట్ ముట్టడి విజయవంతం చేయాలనీ అయన విజ్ఞప్తి చేశారు.

ఫ్రాంక్ఫిన్ ఏవియేషన్ సంస్థ

మోసపూరిత వైఖరిపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భాషబోయిన సంతోష్



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ జిల్లా రాంనగర్లోని ఫ్రాంక్ఫిన్ సంస్థ ఏవియేషన్ కోర్సు పేరుతో విద్యార్థులను మభ్యపెట్టి, వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి భాషాబోయిన సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏవియేషన్ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తూ, విమానాశ్రయాల్లో 100 శాతం ఉద్యోగాల గ్యారంటీ ఇస్తామని నమ్మబలికి, 11 నెలల శిక్షణ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఫీజుల రూపంలో వసూలు చేసినట్లు విద్యార్థులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అయితే, హామీ ఇచ్చిన విధంగా సరైన తరగతులు నిర్వహించకుండా, నాణ్యమైన శిక్షణ అందించకుండా, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, విమానయాన రంగంలో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, విద్యార్థులను హోటల్, హాస్పిటాలిటీ రంగాల వైపు మళ్లిస్తున్నారని, నెలకు రూ.40 వేల నుంచి రూ.2.50 లక్షల వరకు వేతనాలు వస్తాయని ఆశ చూపి, చివరకు కేవలం రూ.10 వేల నుంచి రూ.15 వేల వేతనంతో కూడిన పనులకు పంపిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భాషాబోయిన సంతోష్, సంస్థ యాజమాన్యాన్ని నిలదీసి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. అనంతరం సుబేదారి పోలీస్ స్టేషన్లో సీఐ రంజిత్ను కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, విద్యార్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషాబోయిన సంతోష్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును ఆసరాగా చేసుకొని ఏవియేషన్ రంగంలో ఉద్యోగాల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేసి, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా విద్యార్థులను మోసం చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంస్థ యాజమాన్యం స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడే విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఏఐఎస్ఎఫ్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

జిఎం కార్యాలయం ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా



ప్రజాపక్షం/భూపాలపల్లి: సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సింగరేణికి ప్రభుత్వం చెల్లించవలసిన 59 వేల కోట్ల బకాయిని వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిఎం కార్యాలయం ముందు ఏఐటీయూసీ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అన్ని మైన్స్ పై గని మేనేజర్లకు వినతి పత్రాన్ని అందజేసి జిఎం కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా నిరసన తెలిపి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిఎం రాజేశ్వర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా మోటపలుకుల రమేష్ మాట్లాడుతూ గతంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘంగా కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. గతంలో అపాయింట్మెంట్ పొందిన డిపెండెంట్ అభ్యర్థులకు నెల రోజుల్లో ఉద్యోగ నియామక పత్రాల ఇప్పిస్తామని అనుమతుల పేరుతో జాప్యం చేస్తుందన్నారు. మరోవైపు కార్మికుల సొంతింటి పథకాన్ని అమలు చేస్తానని పలుమార్లు హామీలు ఇచ్చిన ఇప్పటికి అమలు చేయడం లేదని అన్నారు. రక్షణ ఉత్పత్తికి సంబంధించిన బూట్లు, హెల్మెట్లు, బీట్లు డ్రిల్లు రాడ్లు, హెచ్డి యంత్రాలు సంబంధించిన స్పేర్స్ అత్యవసర పరికరాల కొరత కారణంగా కార్మికుల భద్రత, ఉత్పత్తి పై ప్రభావం చూపుతోందన్నారు. ప్రభుత్వం సింగరేణికి చెల్లించవలసిన 59 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అనేక సమస్యలపైను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని లేదంటే సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఈ సందర్భంగా రమేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, ఎండి ఆసిఫ్ పాషా, జి.శ్రీనివాస్, సింగ్ సార్, రవికుమార్, బ్రాంచ్ కమిటీ నాయకులు నూకల చంద్రమౌళి, తాళ్ల పోశం, నాయకులు, రాజేందర్, కొమురయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం ప్రభుత్వ బాధ్యత



ప్రజాపక్షం/వరంగల్: ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రిగా పేరుగాంచిన వరంగల్ ఎంజిఎం ఆసుపత్రి నేడు అనేక సమస్యలకు నిలయంగా మారడం అత్యంత ఆందోళనకరమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) వరంగల్ జిల్లా సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మస్కా సుధీర్, ధర్మారపు సాంబమూర్తి విమర్శించారు. బుధవారం ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎంజిఎం ఆసుపత్రిని సందర్శించి, ముఖ్యంగా చిన్నపిల్లల వార్డులో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, ఆర్ఎంఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడే పరిస్థితులు ఎంజిఎంలో నెలకొనడం బాధాకరమన్నారు. పిల్లల వార్డులో సరిపడా వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో వెంటిలేటర్ సదుపాయాలు లేకపోవడం, అవసరమైన సమయంలో చిన్నారులకు ఆక్సిజన్ అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.చిన్నారుల నుంచి రక్త నమూనాలు సేకరించినప్పటికీ మూడు రోజుల వరకు పరీక్షా నివేదికలు అందకపోవడం వల్ల వైద్య చికిత్సల్లో జాప్యం జరుగుతోందని, ఫలితంగా కొన్ని సందర్భాల్లో సీజనల్ వ్యాధులుగా భావించి చికిత్స అందించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. వైద్యం అందించాల్సిన వార్డులే అపరిశుభ్రతకు నిలయాలుగా మారితే పేద రోగులు ఎవరికి చెప్పుకోవాలన్నారు. చిన్నపిల్లల జనరల్ వార్డులో ఫ్యాన్లు సరిగా పనిచేయకపోవడం, పనిచేస్తున్న ఫ్యాన్లు కూడా శుభ్రతకు నోచుకోకపోవడం, చిన్నారులు ఉపయోగించే బాత్రూంలు పూర్తిగా దెబ్బతిన్న స్థితిలో ఉండటం ఆసుపత్రి నిర్వహణలోని లోపాలను తెలియజేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి అబ్బు, తోట రాజు, సహాయ కార్యదర్శులు సోమవారపు నవీన్, జగదీష్, కోశాధికారి గణేష్ రాజ్, సమితి సభ్యులు కంపల్లి చింటూ, అన్వేష్ కుమార్ పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

ఆత్మకూర్లో భూ రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



ప్రజాపక్షం/ఆత్మకూరు: భూముల రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నా రు. బుధవారం ఆత్మకూరు మండలం బ్రాహ్మణ పల్లి రెవెన్యూ లోని కామారం గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే తీరును హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఇంకా ఎన్ని ఎకరాలలో సర్వే పూర్తి చేయాల్సి ఉందనే వివరాలను భూములు, కొలతలు శాఖ ఏడీ నూర్ సింగ్, సర్వేయర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోవర్లతో సర్వే నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. అక్కడ ఉన్న స్థానిక రైతులతో సర్వే తీరు గురించి కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను కచ్చితంగా నమోదు చేసే దిశగా రీసర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. భూముల రీసర్వేను పూర్తి చేయడంలో రైతులు సహకరించాలని సూచించారు.సర్వే సమయం లో రైతులు తమ భూమి హద్దులను సరిగా చూపించాలని అన్నారు. సర్వేయర్లు సర్వే సమయం లో జాగ్రత్తలు వహించాలని సూచించారు.పారదర్శకంగా చేపడుతున్న భూముల రీసర్వేతో రైతుల భూ హక్కులకు భరోసా లభిస్తుందన్నారు. రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తోట లక్ష్మీ, ఇతర అధికారులు, సర్వేయర్లు, స్థానిక రైతులు, పాల్గొన్నారు.

ఉపాధి కల్పన, జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి



ప్రజాపక్షం/ములుగు: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాతీరాజ్ కమిషనర్ దివ్య దేవ రాజన్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఉపాధి పనులు, కూలీల హాజరు, జాబ్కార్డుల జారీ, జలసిరి పనులు, గ్రామీణ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ములుగు సమీకృత కలెక్టరేట్ నుండి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఎం సంపత్రావు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీలకు 12,280 చోట్ల ఉపాధి పనులు ప్రారంభమైనట్లు కమిషనర్ తెలిపారు. నవంబర్ 3న రాష్ట్ర వ్యాప్తంగా 5,02,697 మంది కూలీలు పనులకు హాజరయ్యారని వెల్లడించారు. ఇంకా పనులు ప్రారంభం కాని పంచాయతీల్లో వెంటనే పనులు చేపట్టాలని, ఉపాధి కోరే ప్రతి కూలీకి పని కల్పించాలని సూచించారు. జాబ్కార్డుల జారీలో పెండింగ్ సమస్యలను పరిష్కరించి, కూలీల హాజరు, పనిదినాల నమోదును పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జలసిరి కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 55,133 పనులు ప్రారంభించగా, 14,121 పనులు పూర్తయ్యాయని తెలిపారు. వ్యవసాయ కుంటలు, ఊటకుంటలు, ఇంకుడుగుంతలు, బోరుబావుల రీఛార్జి నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. పశుగ్రాస సాగు, పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. గ్రామీణ మౌలిక వసతుల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ములుగు జిల్లాలో 171 గ్రామ పంచాయతీలకు గాను 162 చోట్ల ఉపాధి పనులు ప్రారంభించామని, నవంబర్ 3న 7465 మంది కూలీలు హాజరయ్యారని అదనపు కలెక్టర్ సంపత్రావు వివరించారు. పనులు ప్రారంభమైన పంచాయతీల్లో సగటు కూలీల హాజరు 46గా నమోదైందని, ఇది రాష్ట్ర సగటు 41 కంటే ఎక్కువగా ఉండడంపై కమిషనర్ జిల్లా అధికారులను అభినందించారు. జిల్లాలో చేపట్టిన వ్యవసాయ కుంటల పనులతో పాటు నవంబర్ 19 నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాల్సిన 254 నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బియ్యం ధరలు పెంచితే కఠిన చర్యలు

కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ఖమ్మం: జిల్లాలో బియ్యం ధరల నియంత్రణకు యంత్రాంగం కఠిన చర్యలకు సిద్ధమైంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి బియ్యం విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మినా ఉపేక్షించేది లేదని కలెక్టర్ దివాకర టిఎస్ హెచ్చరించారు. బియ్యం నిత్యావసర వస్తువు కావడంతో ప్రజలకు అందుబాటు ధరల్లో సరఫరా చేయాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాసరెడితో కలిసి బియ్యం ధరల నియంత్రణ, సరఫరా వ్యవస్థపై సంబంధిత శాఖల అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బియ్యం విక్రయించే ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేస్తూ ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన రిటైల్ ధరల ప్రకారం బిపిటి, కెఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకాలు కిలో రూ.74, హెచ్ఎంటి, జెఎస్ఆర్ రకాలు కిలో రూ.79కు విక్రయించాలని స్పష్టం చేశారు. మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులందరూ ఈ ధరలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లాలో బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. కొందరు వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా నిల్వలు దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లఘించిన వారి బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకొని వేలం వేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బియ్యం సరఫరా సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిర్ణీత ధరల అమలును పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, డిఎం సివిల్ సప్లయ్ మల్లికార్జునబాబు, లీగల్ మెట్రాలజీ అధికారులు, మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు పాల్గొన్నారు.

13న జిల్లా స్థాయి మెగా క్విజ్

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, జిల్లా విద్యాశాఖ సహకారంతో 13న జిల్లా స్థాయి మెగా క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నషా ముక్త్ భారత్, తెలంగాణ రైజింగ్ 2047 కార్యక్రమంలో భాగంగా 13న శుక్రవారం నాయుడుపేట సర్కిల్ సమీపంలోని టిసివి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థుల్లో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై సమగ్ర అవగాహన కల్పించడం, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సాధారణ జ్ఞానం, చరిత్ర, సంస్కృతి, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఆరు నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీకి అర్హులని తెలిపారు. ప్రతి విద్యా సంస్థ నుండి గరిష్టంగా రెండు జట్లు (ఒక్కో జట్టుకు ఇద్దరు చొప్పున) నలుగురు పాల్గొనవచ్చునని తెలిపారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదన్నారు. ఈ క్విజ్ పోటీలను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సైబర్ క్రైం సిఐ రవికుమార్



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని సైబర్ క్రైం సిఐ బి.రవికుమార్ అన్నారు. సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా డివిఎస్‌పి సిహెచ్‌ఆర్‌వి ఫణీంధర్ ఆదేశాల మేరకు బుధవారం సోషల్‌వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో సిఐ మాట్లాడారు. అపరిచిత మెయిల్స్, లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి ఫోన్ చేసి నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో కేసు నమోదు చేయాలని తెలిపారు. వాట్సప్, టెలిగ్రామ్ యాప్‌లలో అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని అవి సైబర్‌నేరగాళ్లు పంపినవిగా భావించాలన్నారు. వాటిని ఓపెన్‌చేస్తే బ్యాంక్‌ఖాతాల్లోని నగదు ఖాళీ అయ్యే అవకాశం ఉందన్నారు. ఒటిపిలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరికి తెలపడం, షేర్ చేయడం వంటివి చేయవద్దన్నారు. ఈ సదస్సులో సైబర్‌క్రైం స్టేషన్ ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, మహిళ కానిస్టేబుళ్లు నాగేంద్రమ్మ, అప్సనా, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ రీనా ధరిదేవి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలి

సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



ప్రజాపక్షం/కల్లూరు: బాణసంచా విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ వ్యాపారస్తులను కోరారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పండగను సురక్షితంగా జరుపుకునేలా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో దీపావళి పండుగ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు బాణసంచా విక్రయాలకు అనుమతులు, తాత్కాలిక బాణసంచా విక్రయాల కేంద్రాల ఏర్పాటు, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రత, అత్యవసర వైద్య సేవలు, విద్యుత్ భద్రత తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల పరిధిలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా...

ఖిల్లా రోప్‌వే పనులు పూర్తి

మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనులను నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రోప్‌వే నిర్మాణ ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనుల పురోగతిపై రోప్‌వే నిర్మాణ సంస్థ సిఇఒ రంజిత్ పరకాసి బుధవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతను, పర్యాటక ఆకర్షణను దృష్టిలో ఉంచుకుని రోప్‌వే ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. రోప్‌వే ప్రారంభమైన అనంతరం పర్యాటకులకు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రోప్‌వేకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు, వాహనాల పార్కింగ్ సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. సందర్శకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రోప్‌వే నిర్వహణకు అవసరమైన భద్రతా ప్రమాణాలు, సాంకేతిక తనిఖీలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. ఖిల్లా రోప్‌వే అందుబాటులోకి వస్తే పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పర్యాటకుల సంఖ్య పెరిగేలా, సందర్శకులకు మెరుగైన అనుభూతి కలిగేలా రోప్‌వే నిర్మాణం జరగాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి అన్ని పనులను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసి రోప్‌వే సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని మంత్రి సూచించారు.

పాములేరు వాగు ఉధృతిని పరిశీలించిన ఎస్పి



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలంలో భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, మూకమామిడి ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నాయి. రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండటంతో పలు చోట్ల వాహన రాకపోకలను అధికారులు నిలిపివేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. తాళ్లపాయి గ్రామం వద్ద పాములేరు వాగు వరద ఉధృతిని ఎస్పి రోహిత్ రాజు పరిశీలించారు. డిడిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మండలంలో వందలాది ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీటమునకగా, పలుచోట్ల వరి నేలకొరిగింది. పంట నష్టంపై అధికారులు తక్షణమే సర్వే నిర్వహించి నివేదికలు రూపొందించి పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి నాయకులు డిమాండ్



ప్రజాపక్షం/-సత్తుపల్లి: సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సత్తుపల్లి ఏరియాలోని గనులు, వివిధ విభాగాల అధికారులకు, ఏరియా జిఎం వెంకటాచారికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ మాట్లాడుతూ.. ఆగస్టు 28న యాజమాన్యంతో కుదిరిన ఒప్పందంలోని హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. మెడికల్ బోర్డులను పునఃప్రారంభించాలని, మారుపేర్ల సమస్య పరిష్కరించి అర్హులకు ఉద్యోగాలు కల్పించాలని, పెండింగ్ డిపెండెంట్ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.సమస్యలను పరిష్కరించకపోతే ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో ఎఐటియుసి ఉపాధ్యక్షుడు భీమ్మయ్య, పిట్ కార్యదర్శులు నర్సింగరావు, కిషోర్, నాయకులు బాలసుబ్రమణ్యం, బుగ్గ సుధాకర్, భారత్, శ్రీను, వీరభద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కరిస్తాం

డ్రైన్‌లలో పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మేయర్ మూడ గణేష్



ప్రజాపక్షం/పాల్వంచ : లోతట్టు ప్రాంతాలలో ముంపు సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ గణేష్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపద్యంలో పాల్వంచలో బుధవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా 8, 42వ, డివిజన్‌లలో నిలిచిన వరద నీటిని డ్రైన్‌లోకి మళ్లించే పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన, అంతర్గత రహదారులపై నిలిచే వరద నీటిని సమీప మురుగు కాలువల ద్వారా సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. డ్రైన్‌లలో పేరుకుపోయిన వ్యర్థాలను జెసిబి సాయంతో తక్షణమే తొలగించి పూడికతీత పనులను వేగవంతం చేయాలని, వాతావరణం సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షాలతో విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రభలకుండా బ్లీచింగ్, దోమల మందు పిచికారి పనులు చేపట్టాలని చెప్పారు. అత్యవసర సేవల కోసం కంట్రోల్ రూమ్‌ను సమన్వయం చేసుకొంటూ తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు నామా పండు, కాకటి రవీందర్, కాంగ్రెస్ నాయకులు రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికులు విధుల బహిష్కరణ



ప్రజాపక్షం/మణుగూరు: గత నెల 25వ తేదీన మణుగూరు నుండి భద్రాచలం బయలుదేరిన బస్సులో జరిగిన వివాదంలో గాయపడిన కండక్టర్ ప్రవళిక మంగళవారం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.. ఆమె మృతి సందర్భంగా బుధవారం ఖమ్మం డివిజన్‌లోని ఆర్‌టిసి కార్మికులు సంతాపం తెలుపుతూ విధులు బహిష్కరించారు. మణుగూరు పట్టణంలో ఆమెకి సంఘీభావం తెలుపుతూ ఆ కుటుంబానికి న్యాయం జరగాలని డి మాండ్ చేస్తూ ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవ చేస్తూ కర్తవ్యం నిర్వహిస్తున్న ఆర్‌టిసి కార్మికులకు భద్రత కరువైందని, ప్రభుత్వం ఈ విషయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలని అదేవిధంగా మృతి చెందిన ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ మాట్లాడుతూ ఆర్‌టిసి మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలని, గుండ్ల ప్రవళిక కుటుంబానికి కోటి రూపాయలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కుటుంబరావు, సిపిఐ మణుగూరు మండల సహాయ కార్యదర్శి నరేష్, ఎఐటియుసి కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, ఎఆర్ బాబు, రాజు, సందీప్, పూర్ణచందర్, యాదవ్, ఓంకార్ రాములు పాల్గొన్నారు.

ఆర్‌టిసి సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

కండక్టర్ మృతి బాధాకరం

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : విధి నిర్వహణలో తీవ్రంగా గాడపడి మృతి చెందిన ఆర్‌టిసి మహిళా కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.1కోటి నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఇటీవల ప్రయాణికులు బస్సు కిందికి తోసివేయడంతో హైదరాబాద్‌లోని సాయిసంజీవిని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతిచెందడం అత్యంత బాధాకరం అన్నారు. ఆమె మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బుధవారం కొత్తగూడెం ఆర్‌టిసి డిపో ఎదుట గుర్తింపు సంఘం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభకు హాజరైన ఆయన ప్రవళిక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో దాడి జరిగి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం అన్నారు. ఆర్‌టిసిలో మహిళా కండక్టర్లకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక చట్టాన్ని తేవాలన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని బాధితకుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ గణేష్, ఆర్‌టిసి గుర్తింపు సంఘం నాయకులు కందుల భాస్కర్, నజీర్, అప్పారావు, రవి, సిపిఐ నాయకులు జక్కుల రాములు, హన్మంతరావు, దుర్గ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై ఉద్యమించాలి

గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

అజ్మీర రామ్మూర్తి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తి నాయక్ తెలిపారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశం తేజావత్ కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ గిరిజన సమాఖ్య ఇంచార్జ్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గిరిజనుల సమస్యలపై ఉద్యమించాలని, దానికి అనుగుణంగా నాయకులు పని చేయాలన్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో కమిటీల నిర్మాణం ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో జాతీయ మహాసభలు నిర్వహించడం హర్షణీయమన్నారు. త్వరలో మహాసభల తేదీలను ప్రకటించనున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాలలో పనిచేస్తూ పార్టీని విస్తరింపజేసేవిధంగా ప్రతి గిరిజన నాయకుడు కృషి చేయాలన్నారు. గిరిజనులలో 32 ఉపకులాలు ఉన్నాయని గిరిజనులకు తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు.. గిరిజన సమాఖ్య బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి బోడా వీరన్న, శేఖర్, ఖమ్మంజిల్లా కార్యదర్శి బానోత్ జగన్నాథం, జిల్లా అధ్యక్షుడు బానోత్ రాంబాబు, రాంకోటి, జిల్లా నాయకులు బానోత్ నాగేశ్వరరావు, నర్సింహా, గుగులోత్ శ్రీను, పాల్తీయా శ్రీను, భరత్, వీరన్న, రామ్మూర్తి, ప్రసాద్, సీతారాం, హరిదాస్, నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు పరిశీలించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/సత్తుపల్లి: తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. బేతుపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో వేంసూరు మండలంలోని సుమారు 59 చెరువులకు నీరు చేరే అవకాశం ఉందని తెలిపారు. పెనుబల్లి మండలంలోని లంకసాగర్ ప్రాజెక్టు పరిస్థితులను సైతం పరిశీలించారు. తుఫానుతో పంటలు దెబ్బతిన్న రైతులతో మాట్లాడి అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి నివేదికలు త్వరగా సిద్ధం చేయాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించి అత్యవసర సమయాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట చైర్మన్ రిహానా కమల్ పాషా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, కమల్ పాషా, వ్యవసాయ, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'సర్' రద్దుకు పోరాటం

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోదీ

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, తొలగించిన 13 కోట్ల ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా 'పీపుల్స్ ఎగైనెస్ట్ ఎస్ఐఆర్' పేరుతో పోరాటం సాగిస్తున్నామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ తెలిపారు. బుధవారం ఖమ్మంలో సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్నారు. రద్దయిన ఓట్లలో వ్యవసాయ, వలస కార్మికులు, దళితులు, మైనార్టీల ఓట్లే అధికంగా ఉన్నాయన్నారు. దేశంలో తీవ్ర కరువు నెలకొన్న కేంద్ర ప్రభుత్వం ఎరువుల సబ్సిడీలను లక్షల కోట్లు తగ్గించి రైతులపై భారం మోపిందన్నారు. గోదాములో ఆరుకోట్ల టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నా, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలను దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కరువు సాయం కింద రెండు లక్షల కోట్లు కేటాయించి, రేషన్ బియ్యాన్ని 10 కేజీలకు పెంచక పోతే డిసెంబర్‌లో మార్చ్ టూ గోడౌన్స్ చేపట్టి గోదాములను ముట్టడిస్తామని హెచ్చరించారు. 22ఎ పేరుతో పేదల అసైన్డ్ భూములను వేలం వేస్తూ కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలను ఆపాలని డిమాండ్ చేశారు. 15 నుంచి నల్లగొండలో జరిగే రైతు మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది తరలి వస్తారన్నారు. ఫిబ్రవరి 14 నుండి 17 వరకు బెంగళూరులో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలను నిర్వహిస్తామని తెలిపారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులు పెంచి రోజు వారి కూలీ రూ. 600 చెల్లించాలని కోరారు. ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతికి ఆయన సంతాపం తెలిపారు. కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, నాగేశ్వర రావు, సారంగి పాపారావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పరికరాల దొంగలకు రిమాండ్



ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి, వేంసూరు మండలాల పరిధిలో రైతులకు సంబంధించిన ట్రాక్టర్ పరికరాలు, ఫుల్ వీల్స్, రోటోవేటర్ దొంగిలించిన ఐదుగురు నిందితులను బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సత్తుపల్లి రూరల్ సిఐ పి. సర్వయ్య, వియం.బంజర్ ఎస్ఐ షాకీర్, వేంసూరు ఎస్ఐ పి. ప్రదీప్ విలేకర్ల సమావేశంలో బుధవారం వెల్లడించారు. సిఐ సర్వయ్య మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా పెనుబల్లి, వేంసూరు మండలాల్లో రైతుల ట్రాక్టర్లకు సంబంధించిన సామాగ్రి చోరీకి గురైనట్లు అనేక ఫిర్యాదులు అందాయి. బుధవారం పెనుబల్లి మండల పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద వియం బంజర్ ఎస్ఐ షాకీర్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రాచమల్లు, శ్రీనివాసులతో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు అశోక్ లే లాండ్ వాహనాలను ఆపి ప్రశ్నించగా అనుమానస్పదంగా వ్యవహరించడంతో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా ఒకరు పరారైనట్లు సిఐ సర్వయ్య తెలిపారు. నిందితులు పంతంగి చెన్నకేశవ్, కుంట రాఘవేంద్ర, మేకల గోవర్ధన్, గోబిన నవీన్, పుచ్చి ముత్తయ్యను అదుపులోకి తీసుకోగా దమ్మపేట మండలానికి చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు, అదే విధంగా వీరి వద్ద నుండి ఎనిమిది ఫుల్ వీల్స్, ట్రాక్టర్ సామాన్లు స్వాధీన పరచుకున్నామని వీటి విలువ సుమారు రూ. 6.50లక్షలు ఉన్నట్లు అంచనా వేశారు. వీరిని కోర్టుకు హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

రైస్ మిల్లులలో సిఐడి తనిఖీలు



ప్రజాపక్షం / జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో పలువురు రైస్ మిల్లర్లు సన్న బియ్యానికి బదులు దొడ్డు బియ్యం సరఫరా చేసిన ఘటనలో పది రోజుల క్రితం రాధాకృష్ణ, లక్ష్మీ సాయి, లక్ష్మీ వెంకటరమణ, రైస్ మి ల్లర్స్ యజమానులను లైన్ ఓల్లాల మల్లిఖార్జున్, యాంసాని సంపత్ లెంకలపల్లి మధులను అదుపులోకి తీసుకున్న సిఐడి పోలీస్‌లు సాక్షాధారులతో కో ర్టులో హాజరుపరచగా కోర్టు ముగ్గురు వ్యాపారులను జైలుకు పంపించింది. సిడిఐ పోలీస్‌లు విచారణ కోసం కస్టడీ ఇవ్వాలని కోరగా కోర్టు అనుమతించింది. కస్టడీకి తీసుకున్న మిల్లర్స్‌తో సిఐడీ పోలీస్‌లు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జమ్మికుంటలోని రైస్ మిల్లులలో పలు ఫైల్లను తనిఖీ చేసి సీన్‌రీ కనస్టక్సన్ చేసినట్లు సమాచారం. జైల్లో ఉన్న రైస్ మిల్లర్లతో ఆయా మిల్లుల సిఐడి పోలీసులు విచారణ జరపడంతో పట్టణంలోని వ్యాపారులు ఆందోళనకు గురయ్యారు.

రేపు సిపిఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ ఏజెంట్లు,కస్టమర్ల సమావేశం



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లా అగ్రిగోల్డ్ ఏజెంటు, కస్టమర్ల సమావేశం ఈనెల 6వ తేదీన సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో జరుగుతుందని సిపిఐజిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. బుధవా రం సిపిఐ జిల్లా కార్యాలయంలో అగ్రిగోల్డ్ ఏజెంట్ల కస్టమర్ల సమావేశం బి. నరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఏజెంట్ల, కస్టమర్ల సమస్యలు చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడానికి అందరూ కలిసి కట్టుగా ఉండాలని, వారందరినీ ఐక్యం చేయడం కోసం వారికి సిపిఐ అండగా ఉంటుందని తెలిపారు. 6వ తేదీన జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా అగ్రిగోల్డ్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పశ్య పద్మ హాజరవుతారని,ఈ సమావేశంలో సిపిఐ వారు తీ సుకునే బాండ్ల వెరిఫికేషన్ సెంటర్‌ను కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని చర్చించనున్నట్లు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని,అధిక సంఖ్యలో ఏజెంట్లు,కస్టమర్స్ పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనివాస్ కోరారు. సమావేశంలో అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కస్టమర్లు బి.నరేష్, పి.శ్రీనివాస్,సతీష్, రవి,కుమార్ ,జ్యోతి పాల్గొన్నారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ వేగవంతం : ఎమ్మెల్యే



ప్రజాపక్షం/జగిత్యాల: రెండో విడ త ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జగిత్యాల ఎమ్మె ల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ఎంపిడిఒలతో జగిత్యాల శాసనసభ్యుడు డాక్టర్ సంజ య్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అర్హులై న లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తిం చి,వారికి త్వరితగతిన ఇందిర మ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేసేలా అ వసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షే మ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయం తో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒలు చిరంజీవి,రమాదేవి,నీరజ ,భీమేష్,ఎంపిఒ వాసవి పాల్గొన్నారు.

ముస్లింల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఎంఐఎం కృషి



ప్రజాపక్షం/పెద్దపల్లి : తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం విశేషంగా కృషి చేస్తుందని ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 20 26 గైడ్స్ ను కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ముఖ్యంగా బాల,బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకా రం చేయాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,జీవితంలో పదవ తరగతివార్షిక పరీక్ష కీలకమని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహదపడుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్,పెద్దపల్లి పట్టణ ఎం ఐఎం అధ్యక్షుడు సయ్యద్ ఉమేర్ అహ్మద్,ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శి కలీం,జాయింట్ సెక్రటరీ ముజాహిద్,బర్కత్, ఇర్ఫాన్, మోహిద్,కోశాధికారి ఇంతియాజ్ ఖాన్ తో,మునవర్ ఖాన్ , మాజీ అధ్యక్షుడు ఇమ్రాన్,ప్రధానోపాధ్యాయులు అరుణ, ఉపాధ్యాయులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-6 సమర్పించవచ్చు

ప్రజాపక్షం/ సిద్దిపేట : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సందర్భంగా ప్రారంభించిన ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేని, గతంలో ఓటరుగా నమోదైన అర్హత కలిగిన వారు తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని భారత ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి హైమావతి తెలిపారు. ఫారం6 లో 'మొదటిసారి ఓటరుగా నమోదు' చేసుకుంటున్నట్లు పేర్కొనవలసి ఉండటంతో, తప్పుగా ప్రకటించేస్తున్నారేమోనని, ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 31 ప్రకారం తప్పుడు ప్రకటనలు ఎవరైనా చేస్తే శిక్షార్హమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందవలసిన అవసరం లేదని కూడా భారత ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. జాబితా సవరణల వల్ల ఓటు హక్కును కోల్పోయిన ఏ పౌరుడైనా, ఎటువం టి భయం లేకుండా ఫారం6 ద్వారా తిరిగి నమోదు కోసం దరఖాస్తు చే సుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హతైన ప్ర తి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, ఓటర్ల జాబితా పారదర్శకతను, వి శ్వసనీయతను కాపాడటం ఎన్నికల సంఘం లక్ష్యమని, ఈ అవకాశాన్ని అర్హులైన పౌరులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని అదేవిధంగా రాష్ట్రంలోని ప్రతీ నిరుపేదకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు . ధర్మపురి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు రూ.45 లక్షల విలువైన కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదల సంక్షేమం,అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్,మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్,అధికారులు, కాంగ్రెస్ నాయకులు చిలుముల లక్ష్మ ణ్, మున్సిపల్ కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచులు,నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

ధర్మపురికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ,భవన నిర్మాణానికి స్థల పరిశీలన

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని స్థలాన్ని బుధవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూ రు చేయించినట్లు తెలిపారు. భవన నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సం స్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్,మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి ,ప్రజాప్రతినిధులు,కౌన్సిలర్లు,సర్పంచులు,అధికారులు,పాల్గొన్నారు.

అదనపు కోర్టుకు ప్రభుత్వ భవనం కేటాయించాలి: అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేసినందుకు మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌ను బుధవారం ధర్మపురి బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎజిపిఇమ్మడి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందెల రమేష్, కార్యదర్శి రామడుగు రాజేష్,ఉపాధ్యక్షుడు మామిడాల శ్రీకాంత్,న్యాయవాదులు రౌతు రాజేష్, అలుక వినో ద్ కుమార్,కస్తూరి శరత్ కుమార్,చిలువేరి మనోహర్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బిసి హాస్టల్ విద్యార్థి మృతి

న్యాయం చేయాలని తల్లిదండ్రులు, గ్రామస్తుల డిమాండ్



ప్రజాపక్షం/గజ్వేల్: వర్గల్ మండల కేంద్రం లో ని బిసి వసతి గృహంలో ఓ విద్యార్థి ఉరివేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి బాధితులు, పోలీస్‌లు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్కుక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన ఆరే మల్లేశం కుమారు డు రామ్ చరణ్ (15) వర్గల్ మండల కేంద్రంలో ని బిసివసతి గృహంలో ఉంటూ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి విద్యనభ్యసిస్తున్నాడు. కాగా ఉ దయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థి రామ్ చరణ్ ను ఉపాధ్యాయుడు మందలించినట్లుగా సమాచారం. దీంతో మనస్థాపానికి గురైన రామ్ చరణ్ బిసి వసతి గృహానికి చేరుకొని స్లాబ్ కుక్కెంకు ఉ రివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యా హ్నం వసతి గృహ సిబ్బంది గమనించి వార్డెన్ న ర్సింలుకు సమాచారం అందించారు. ఈ క్ర మంలో వార్డెన్ గౌరారం పోలీసులకు సమాచా రం చేరవేయడంతో వారు సంఘటన స్థలానికి చే రుకొని రామ్ చరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. కాగా గజ్వేల్ చేరుకున్న విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఆయా విద్యార్థి సంఘ నేతలు బాధిత కు టుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, పోలీసులు గజ్వేల్ తో పాటు వర్గల్ బిసి వసతి గృహం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరామర్శ

పాతూరు గ్రామానికి చెందిన విద్యార్థి ఆరే రామ్ చరణ్ ఆత్మహత్య చేసుకున్న సమాచారం అం దుకున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మ న్ వంటేరు ప్రతాపరెడ్డి గజ్వేల్ ఆసుపత్రికి చేరు కొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించడం తోపాటు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం / గంగాధర : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం హిమ్మత్‌నగర్, కురిక్యాల, లక్ష్మీ దేవిపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతుల వివరాలను నమోదు చేసుకొని తేమశాతం వచ్చిన వెంటనే వద్దు కొనుగోలు చేయాలని రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతుల ఖాతాలోధాన్యం డబ్బులు జమ అయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సహకార అధికారి రామాంజనేయచార్య, సింగిల్ విండో చైర్మన్లు వెలిచాల తిర్మల్ రావు, దూలం బాలగౌడ్, తహసీల్దార్ అంబటి రజిత, ఎంపిడిఒ దమ్మని రాము, ఎపిఎం కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిరుత మంగ, మాజీ జడ్‌పిటిసి సత్తు కనుకయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, పొత్తూరి ప్రభాకర్, తాళ్ల సురేష్, జారతి సత్తన్న, ఆకుల అంజన్న, పవుల్, బెజ్జంకి కళ్యాణ్, తాళ్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం నిర్విరామ కృషి



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేస్తుందని, రా ష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం మం డల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసా య సహకార సంఘ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ, ప్రాథమిక పరపతి సహకార సంఘం సంయుక్త ఆ ధ్వర్యంలో ఏర్పాటుచేసిన సబ్సిడీ ఆరుతడి విత్తనా ల పం పిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ము ఖ్యఅతిథిగా హాజరై ఆరుతడి విత్తనాల పంపిణీని ర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు కల్లి బొల్లి మా టలు చెప్పుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని, అలాంటి వారి మాటలను ప్రజలు విశ్వసించవద్ద ని సూచించారు.రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏమాత్రం లేదని, 12 గంటలు నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని తెలిపారు. వేసవికాలం పంటల కు ముఖ్యమంత్రితో స్వయంగా జిల్లా మంత్రి శ్రీధ ర్ బాబు ఎమ్మెల్యే మక్కాన్సింగ్‌లతో కలిసి ముఖ్యమంత్రిని ఒప్పించి పంటలకు తాగునీరు అందించామని ఎనిమిది నియోజకవర్గాలకు సాగునీరు అందిందని చెరువులు, కుంటలు,బావులలో భూగ ర్భ జలాలు పెరిగాయని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ఐకెపి, సింగల్ విండో, వ్యవసాయ మార్కెట్ ఎ క్కడైనా విక్రయించుకోవచ్చని లేదా లాభాలు వస్తే మిల్లర్ల కు కూడా ఇష్టం ఉన్న కాడ విక్రయించుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 24 వేల ఎకరాలలో వరి పంట పండిందని స్పష్టం చేశారు. చివరి తడికి నీరు అం దకపోతే దాదాపు పదివేల ఎకరాల నష్టం వాటిల్లేదని వి వరించారు. ప్రభుత్వం ఆరుతడి విత్తనాలను ఎస్‌సి రైతులకు ఉచితంగా ఇతర రైతులకు సబ్సిడీపై అందజేస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రంలో కాం గ్రెస్ అధికారంలో ఉండగా ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని, ఇప్పటికీ ప్రాజెక్టులు చెక్కుచెదరలేదని తెలిపారు. ఎస్‌ఆర్ ఎస్ పి కాలువలను అప్పటి ప్రధానమంత్రి ఇంది రాగాంధీ హయాంలో ప్రారంభించారని,అప్పటినుండి నేటి వరకు రైతులకు సాగునీరు అందుతుందని తెలిపారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎస్‌ఆర్ ఎస్ పి కాలువకు ఒక్క షట్టర్ కూడా నిర్మాణం చేసిన దాఖలాలు లేవని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తే అది కూలిపోయిందని,ప్రస్తుతం కొంతమంది నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు నీళ్లను ఎత్తిపోయవచ్చని అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నారని ఎక్కడి నుండి ఎలా ఎత్తిపోయాలో వివరించాలని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభు త్వం నిత్యం ప్రజల రైతుల సంక్షేమం కోసం పరితపిస్తుందని సిఎం రేవంత్ రెడ్డి రైతు పక్షపాతిగా నిలుస్తున్నారని తెలిపారు. కేంద్రం అందిస్తున్న యూరియా విత్తనాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని అవగాహన లేకుండా రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ప్రజలు నమ్మవద్దని సూచించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై ఆరుతడి విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్న య్య గౌడ్,మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మా ర్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు,సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివా స్,కృషి విజ్ఞాన శాస్త్రవేత్త ఓదెల సంపత్,మండల వ్యవసా య అధికారిని ఈ పైడి తల్లి,సిఇఒబూరుగు సంతోష్ కుమార్‌తోపాటు మండలంలోని సింగిల్ విండో చైర్మన్లు డైరెక్టర్లు మున్సిపల్ కౌన్సిలర్లు,మండలంలోని సర్పంచులు,సహకార సంఘం సిబ్బంది,ఎఇలు కాంగ్రెస్ నా యకులు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

నల్లగుట్టను పరిరక్షించుకోవాలి



సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం / ముస్తాబాద్ / రాజన్న సిరిసిల్ల : ముస్తాబాద్ మండలం గూ డూరు, నామాపూర్ గ్రామాల మధ్య లో ఉన్న సర్వేనంబర్ 410 లో గల పల్లగుట్టను పరిరక్షించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంక ట్ రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ గుంటి వేణు ఆధ్వర్యంలో చాడ వెంకట్ రెడ్డి బు ధవారం పల్లగుట్టను సందర్శించారు. ఈ సందర్భంగా గుట్టలో జరుగుతున్న తవ్వకాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పల్లగుట్టలో జరుగుతున్న తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని, తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పల్లగుట్ట సహజ భౌగోళిక స్వరూపాన్ని కాపాడడంతోపాటు గూడూరు, నామాపూర్ గ్రామాల పర్యావరణాన్ని, భూగర్భ జల వనురులను పరిరక్షించాలన్నారు. తవ్వకాలు నిలిపివేయకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గూడూ రు మాజీ సర్పంచ్ సాకలి రమేశ్, సిపిఐ జిల్లా సెక్రటరీ మంద సుదర్శన్, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పం తం రవి, కదారి రాములు, గీస భిక్షపతి, చెరుకు ఎల్లం, సిపిఐ గ్రామ శాఖ నాయకులు కిషన్ పాల్గొన్నారు.

శాశ్వత భూ సమస్యల పరిష్కారం కోసం భూ రీ సర్వే

పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భూభారతి చట్టం తెచ్చిందని, అందులో భాగంగానే భూముల రీ సర్వే చేస్తున్నట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. భూ సర్వే చేసే రెండు రోజుల ముందు పట్టాదారులకు సమాచారం ఇవ్వాలని సర్వే అధికారులకు కలెక్టర్ సూచించారు. బుధవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం గోపాల్‌పూర్‌లో నిర్వహిస్తున్న భూ రీ సర్వేను ఆమే ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూముల సర్వే వంద సంవత్సరాల క్రితం నిర్వహించినందున పలు సమస్యలు తలెత్తున్నందున వాటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ సర్వే చేస్తుందన్నారు. ముందుగా చిన్న గ్రామాలను ఎంపిక చేసి శాశ్వత భూ సమస్యలు లేని గ్రామంగా మార్చేందుకు అధికారులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. గోపాల్‌పూర్ గ్రామంలో సుమారు 399 ఎకరాలు ఉండగా,ముందుగా గ్రామ సరిహద్దు, ప్రభుత్వ స్థలాలు, అబాది, చెరువులు, కుంటలు, నక్షబాటలు సర్వే చేశాకే పట్టా భూములు సర్వే చెయ్యాలని సర్వేయర్‌లను కలెక్టర్ ఆదేశించారు. పట్టా భూములు సర్వే చేసే రెండు రోజులు ముందుగానే రైతులకు సమాచారం అందించాలన్నారు. సర్వే చేసిన తర్వాత భూమి యొక్క వివరాలను తప్పని సరిగా భూ యజమానులకు, రైతులకు తెలుపాలని సర్వేయర్‌లకు సూచించారు. రైతులు,భూ యజమానులు ఈ స ర్వే అధికారులకు సహకరించాలని కోరారు. అలా గే భూమి కొనేటప్పుడు తప్పని సరిగా సర్వే చేయి ంచుకున్నాకేకొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ప్రజాపక్షం / మానకొండూర్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యం విక్రయించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మానకొండూర్ సొసైటీ, హాక ఆధ్వర్యంలో ముంజంపల్లి, మానకొండూర్, సదాశివపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసినధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మ ద్దతు ధర అందిస్తుందని రైతులు దళారులను ఆ శ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తహసీల్దార్ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, ఊటూరు తదితరులు పాల్గొన్నారు.


రుణ వాయిదాలు చెల్లించాలని ఒత్తిడి చేయొద్దు: కలెక్టర్



ప్రజాపక్షం/కరీంనగర్ :ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నందున అర్హులైన రైతులకు బ్యాంకర్లు అండగా నిలవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. బ్యాంక్ అధికారులను ఆదేశించారు. కరువు వేళ సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించి పంట రుణాల పునర్వ్యవస్థీకరణ ద్వారా రై తులకు ఆర్థిక ఉపశమనం కల్పించాలని కలెక్టర్ కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఐడిఒసిలో ఆర్‌డిఒలు షర్మిల, జల కుమారితో కలిసి ఎల్‌డిఎం ఉమా శంకర్, ఆర్ బిఐ ఎజిఎం చిరంజీవి, నాబార్డ్ డిడిఎం జయప్రకాష్, ఇతర బ్యాం క్ ఉన్నత అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు అందించాల్సిన రుణ సదుపాయాలు, రుణాల పునర్వ్యవస్థీకరణ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూ రల్, హుజురాబాద్ మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించిందన్నారు. పాక్షిక కరువు మండలాల్లో 36 నెలల వరకు(ఏడాది మారటోరియం+24 నెలలు) రుణాలను మధ్యకాలిక రుణాలుగా మార్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కరువు పరిస్థితుల కారణంగా రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బ్యాంకర్లు బలవంతపు రుణ వ సూళ్లకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. అర్హులైన రైతులకు కొత్త రుణాలు అందించి వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల కు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని సూచించా రు. జిల్లాలోని ప్రతి పౌరుడికి బ్యాంకింగ్, బీమా, పింఛను సదుపాయాలు అందించడమే లక్ష్యంగా జరుగుతున్న ఆర్థిక సమ్మిళిత సంతృప్త ప్రచారంలో ప్రజలు పాల్గొనాలని కలెక్టర్ చిత్రా మిశ్రా కోరారు. బ్యాంకు ఖాతాల పునరుద్ధరణ, ఇకెవైసి , బ్యాంకుల అందించే బీమా పథకాలు, ఇతర రుణాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అభ్యాసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, భాషా నైపుణ్యాలు,రాత సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ రూ పొందించి పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కో య శ్రీ హర్ష సూచించారు. బుధవారం జూలపల్లి లోని జెడ్‌పి హెచ్‌ఎస్‌లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ స మావేశం ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో పా ల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నా ణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రెమిడియేషన్,ఎఎక్స్‌ఎల్ ఎఐ, ఎఫ్.ఎల్.ఎన్. తరగతుల నిర్వహణను మండల విద్యాధికారులు (ఎం.ఇఒ లు), ప్రధానోపాధ్యాయులు (హెచ్.ఎం.లు) నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టు ల్లో నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతుల పురోగతిని ఎప్పటి కప్పుడు సమీక్షించాలని, విద్యార్థుల నమోదు, అభ్యసన ఫలితాలు, ఇతర పరిపాలనా అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరాక్ పరీక్షకు సంబంధించి ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలపై కూడా మార్గనిర్దేశం చేశారు. రాత నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ 100 రోజుల కార్యాచరణలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఎఎ క్స్‌ఎల్ ఎఐ కార్యక్రమంలో విద్యార్థుల నమోదు ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు, డిజిటల్ అభ్యసన విధానం ద్వారా విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయుల తరగతి గది బోధనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,పాల్గొన్నారు.

‘అగ్నివీర్’ల సేవా కాలం
మరో రెండేళ్లు పొడిగింపు

- తరువాత ఆసక్తిగల అగ్నివీర్‌లు సాయుధ దళాల్లో చేరవచ్చు
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం
- దేశంలో 850 ఫాస్ట్ ట్రాక్ కోర్టుల విస్తరణకు గ్రీన్‌స్నిగల్

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ‘అగ్నిపథ్’ పథకంలో భాగంగా అగ్నివీర్‌ల సేవా కాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగిస్తున్నట్లు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ ఎన్. ఎస్. రాజా సుబ్రమణి తెలిపారు. ఈ పథకం కింద నాలుగేళ్ల ప్రాథమిక పదవీ కాలం ముగిసిన తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మంది అగ్నివీర్‌లకు అదనంగా మరో రెండేళ్లపాటు సేవలు అందించే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. ఈ అదనపు రెండేళ్ల పొడిగింపు గడువు పూర్తయిన తర్వాత ఆసక్తి గల అగ్నివీర్‌లు సాయుధ దళాల్లో చేరవచ్చని వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గం బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని సిడిఎస్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి మీడియాకు తెలియజేశారు. ‘ అగ్నివీరులందరూ భారత సాయుధ దళాల్లో శాశ్వతంగా చేరేందుకు వీలుగా కేంద్ర కేబినెట్ మార్గాన్ని సుగమం చేసింది. 2022 జూన్ 14న అగ్నిపథ్ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. అప్పట్లోనే అగ్నివీర్‌ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని, ఈ పథకాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని పేర్కొంది. ఇప్పుడు మొదటి బ్యాచ్ అగ్నివీర్‌ల నాలుగేళ్ల పదవీ కాలం ముగింపు దశకు చేరుకుంది. ఈ నాలుగేళ్లలో వారి పనితీరుపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. ప్రతిభ ఆధారంగా 25శాతం మంది అగ్నివీర్‌లను రక్షణ దళాల్లో (రెగ్యులర్ ఫోర్సెస్) చేర్చుకోవాల్సి ఉంది. గత నిబంధనల ప్రకారం మిగిలిన 75శాతం మంది అగ్నివీర్‌లు క్రమశిక్షణ కలిగిన, ఉత్సాహవంతులైన యువకులుగా తిరిగి సమాజంలోకి వెళ్లాల్సి ఉండేది. అయితే ఇప్పుడు కేంద్రం తాజాగా అగ్నిపథ్ పథకాన్ని సవరించింది. ఆ 75 శాతం అగ్నివీర్‌లకు అదనంగా మరో రెండేళ్ల పాటు సైన్యంలో పనిచేసే చేసే అవకాశం



కల్పించింది. ఈ రెండేళ్ల కాలం పూర్తైన తర్వాత ఆసక్తి ఉన్న వారందరినీ నిర్దిష్ట ఎంపిక ప్రమాణాలకు లోబడి సాయుధ దళాల్లో చేర్చుకుంటుంది’ అని రాజా సుబ్రమణి పేర్కొన్నారు. కాగా, ‘అగ్నిపథ్’ పథకాన్ని కేంద్రం 2022లో ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఎంపికైన అగ్నివీర్‌లు నాలుగేళ్ల పాటు సైన్యంలో సేవలు అందించిన తర్వాత వారి ప్రతిభ, సంస్థాగత అవసరాల ఆధారంగా కేవలం 25శాతం మంది మాత్రమే సాయుధ దళాల్లో శాశ్వత నియామకానికి అర్హత పొందుతారు. మిగిలిన 75 శాతం మంది పౌర ఉద్యోగాలలో చేరడానికి వీలుగా ఆర్థిక ప్యాకేజీ, నైపుణ్య ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం నుంచి పొందుతారు.

కేంద్ర కేబినెట్ నిర్ణయాలివే!
మరోవైపు, బుధవారం కేంద్ర కేబినెట్ తీసుకున్న కీలక నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. చిన్నారులపై వేధింపులు, అత్యాచారాల కేసులను విచారించేందుకు దేశంలో 850 ఫాస్ట్ ట్రాక్ కోర్టులను బలోపేతం చేయడానికి, వాటి పరిధిని విస్తరించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే అఘాయిత్యాల కేసులను కఠినంగా ఎదుర్కోవడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుత చట్టాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని అమలు చేయడం, అలాగే ఇలాంటి కేసులను పరిష్కరించడానికి కొత్త చట్టాలను రూపొందించే ప్రయత్నాలలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర కేబినెట్ ఒక చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి 2031 మధ్య కాలంలో 92 గిగావాట్ అవర్ గ్రిడ్ స్కేల్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ కోసం రూ. 14,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని సాధించాలన్న ప్రభుత్వ ప్రతిష్టాత్మక లక్ష్యం దృష్ట్యా ఈ నిర్ణయం చాలా కీలకమైనదని అభిప్రాయపడ్డారు.
రూ. 4,371 కోట్లతో ‘విస్తార్’
దేశంలోని అధికారిక గణాంక వ్యవస్థను మార్చి, ఆధునీకరించేందుకు ఉద్దేశించిన ఒక పథకానికి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. దీని కోసం రూ. 4,371.1 కోట్ల వ్యయాన్ని కేటాయించారు. ‘విక్షిత్ భారత్ ఇనిషియేటివ్ ఫర్ స్టాటిస్టికల్ ట్రాన్స్‌ఫార్మేషన్, అనలిటిక్స్ అండ్ రీసెర్చ్’ (విస్తార్) అనే ఈ పథకం, 2030–31 ఆర్థిక సంవత్సరం వరకు ఐదేళ్ల కాలానికి అమలులో ఉంటుంది. ఇది కేంద్ర ప్రభుత్వ రంగ పథకంగా కొనసాగుతుంది. అదే విధంగా లిథియం, నికెల్ వంటి కీలక ఖనిజాల శుద్ధిని ప్రోత్సహించేందుకు రూ. 2,814 కోట్ల పథకానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

‘ఓట్ చోరీ’పై ప్రశ్నిస్తున్న యావత్ దేశాన్ని
మోదీ ఎదుర్కోవాలి

- ఈ అంశంపై ప్రధాని వద్ద సమాధానం లేదు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శ



న్యూఢిల్లీ : ‘ఓట్ చోరీ’పై ప్రశ్నిస్తున్న యావత్ దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఎదుర్కోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సవాల్ విసిరారు. బహిరంగ చర్చకు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మోదీకి సవాల్ చేసిన మరుసటి రోజు ఖర్గే కూడా అలాంటి వ్యాఖ్యలే చేశారు. ఓటు దొంగతనం అంశంపై మోదీ వద్ద సమాధానాలు లేవని, అందువల్ల విదేశీ సంబంధాలు సహా పలు అంశాలపై చర్చకు రాహుల్‌గాంధీ విసిరిన బహిరంగ సవాలును ఆయన అంగీకరించాలని ఖర్గే బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ‘ప్రధాని మోదీ తన ఫ్లాప్ నినాదమైన ‘దిమాగీ నక్సల్’ను చిలుకలా వల్లెవేస్తున్నారు! ఓటు దొంగతనం పైనా, భారత ప్రయోజనాలను విదేశీ శక్తులకు ఎలా తాకట్టు పెట్టారనే దానిపై చర్చించాలన్న రాహుల్ గాంధీ బహిరంగ సవాలుపైనా ఆయన వద్ద ఎలాంటి సమాధానం లేదు!’ అని ఖర్గే అన్నారు. అమిత్ షా 3 కోట్ల మంది ఓటర్లు ‘ఘుస్‌పాయిథియాలు’ అని మనకు చెబుతున్నారు. ఇన్నాళ్లు హోం మంత్రిగా ఉంటూ వలసదారులను భారతదేశంలోకి ప్రవేశింపజేస్తూ ఏం చేశారు? ఆయన అసమర్థతకు పదవి నుంచి తొలగించాలి’అని ఖర్గే అన్నారు. సర్ విషయంలో ఎన్నికల సంఘం ఐదు సార్లు మాట మార్చిందని, తోటి ఎన్నికల కమిషనర్లు చట్ట విరుద్ధం అని పేర్కొన్న ఫారం– 6ను పూర్తిగా మార్చడం కూడా ఇందులో ఉందని ఖర్గే అన్నారు. ఇలా ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించారు. పార్లమెంటు గత సమావేశాలు వాయిదా పడకుండా 83 రోజులు గడిచాయి, ఆ సంఖ్య ఇంకా పెరుగుతూనే ఉంది. ఇప్పుడు, తదుపరి సమావేశాలు సమీపిస్తుండగా, వారు ప్రత్యేక సమావేశం కోరుకుంటున్నారు.
సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై బహిరంగ అభిశంసన, రామ్‌లీలా మైదాన్‌లో జరిగిన భారీ ‘వోట్ బచావో’ ర్యాలీ మోదీజీ–షాలను కుదిపేశాయి!! అని కాంగ్రెస్ అధినేత ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. ‘మీరు పార్లమెంటుకు రావడం లేదు. ఒక్క బహిరంగ పత్రికా సమావేశం కూడా నిర్వహించలేదు; ఇప్పుడు మీరు చర్చకు రావాల్సిన సమయం ఆసన్నమైంది’ అని చెప్పారు. ‘ముందుకు రండి, ప్రశ్నలను ఎదుర్కోండి. ‘వోట్ చోరీ’కి ఎందుకు పాల్పడ్డారో దేశానికి చెప్పండి!!’ అని ఖర్గే డిమాండ్ చేశారు. మంగళవారం, ‘ప్రతిపక్షం దేశద్రోహి’ అన్న తన ఆరోపణపై రాహుల్‌గాంధీ మోదీకి బహిరంగ చర్చకు సవాలు విసిరారు. అలాగే, తన విదేశీ సంబంధాల ఆరోపణపై ప్రధానమంత్రి తనపై పరువు నష్టం కేసు ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు దేశాన్ని అస్థిరపరిచేందుకు విదేశీ సహాయం తీసుకుంటున్నాయని ప్రధాని మోదీ ఆరోపించిన నేపథ్యంలో, ఆయనతో బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు విసిరిన మరుసటి రోజే, మోదీ స్వయంగా విదేశీ సహాయంతోనే ప్రధాని కుర్చీని ఆక్రమించారని ఆయన ఆరోపించారు.

9 మంది మత్స్యకారులు గల్లంతు

చెన్నై : చెన్నైలోని కాసిమేడు ఫిషింగ్ హార్బర్ నుండి సముద్రంలోకి వెళ్లిన తొమ్మిది మంది మత్స్యకారులు గల్లంతయ్యారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య వారి యంత్ర పడవతో సంబంధాలు తెగిపోవడంతో గల్లంతయినట్లు స్థానిక మత్స్యకారులు బుధవారం తెలిపారు. స్థానిక మత్స్యకారుడైన సెల్వలగన్‌కు చెందిన టిఎన్ 02 ఎంఎం 2584 రిజిస్ట్రేషన్ నంబరు గల పడవలో ఈ బృందం అక్టోబర్ 29న లోతైన సముద్రంలో చేపల వేటకు బయలుదేరిందని కాసిమేడుకు చెందిన తోటి మత్స్యకారులు తెలిపారు. మత్స్యకారుడు సతీష్ కుమార్ తెలిపిన ప్రకారం, 3న మధ్యాహ్నం 3 గంటలకు పడవతో సంబంధాలు తెగిపోయాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఒడ్డుకు తిరిగి రావాలని సిబ్బందికి సూచించినప్పటికీ, వారు ఆ ప్రయాణం చేయలేకపోవడంతో మరో పడవ పక్కన లంగరు వేశారని ఆయన పేర్కొన్నారు. కానీ బుధవారం ఉదయం, సమీపంలోని పడవ డ్రైవర్లైన శరవణన్, సూర్య, ఆ



పడవ లంగరు వేసిన చోట లేదని మాకు తెలియజేశారు అని ఆయన తెలిపారు. 9 మంది అదృశ్యమైన తర్వాత, మత్స్యకారుల సంఘం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ మత్స్యశాఖ సహాయ సంచాలకుడికి, కోస్ట్ గార్డ్‌కు, రాష్ట్ర మంత్రులకు అధికారికంగా ఫిర్యాదులు సమర్పించింది. కానీ ఇంకా ఎలాంటి సమాచారం అందలేదని కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, తమిళనాడు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని, ఆ తొమ్మిది మందిని రక్షించడానికి కోస్ట్ గార్డ్ నౌకలను, హెలికాప్టర్లను మోహరించాలని తాము అభ్యర్థిస్తున్నామన్నారు.

ప్రశాంత్ భూషణ్‌పై ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ : రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ భారతకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ, డిజిటల్‌గా మార్ఫింగ్ చేసిన వీడియోను షేర్ చేసినందుకు, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈనెల 3న సైబర్ పెట్రోలింగ్ సందర్భంగా, భూషణ్ ఎక్స్ హ్యాండిల్ నుండి విదేశాంగ మంత్రికి సంబంధించిన మార్ఫింగ్ చేసిన వీడియోను షేర్ చేశారని పేర్కొంటూ ఒక సోషల్ మీడియా పోస్ట్‌ను పోలీసులు గమనించడంతో, స్పెషల్ సెల్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ఆ వీడియోలో తప్పుదోవ పట్టించే, రెచ్చగొట్టే కంటెంట్ ఉందని, ఇది పుకార్లను వ్యాప్తి చేయడానికి, వ్యక్తులను అప్రతిష్టపాలు చేయడానికి, ప్రజాశాంతికి భంగం కలిగించే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. స్పెషల్ సెల్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్లు 336 (4) (నకిలీ), 353 (1) (సి) (ప్రజా అపాయానికి దారి తీసే ప్రకటనలు), 356 (పరువు నష్టం), 340 (2) (నకిలీ పత్రాన్ని అసలైనదిగా ఉపయోగించడం)తో పాటు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని 66 సి (గుర్తింపు దొంగతనానికి శిక్ష) కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేయబడింది. రష్యా విదేశాంగ మంత్రికి తప్పుగా ఆపాదించబడిన డిజిటల్‌గా మార్ఫింగ్ చేసిన వీడియోను విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) ఫ్యాక్ట్‌చెక్ చేసిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆ కల్పిత క్లిప్‌లో, ఆయన భారతదేశ అంతర్గత వ్యవహారాలు, చమురు కొనుగోళ్లపై విమర్శనాత్మక వ్యాఖ్యలు చేస్తున్నట్లుగా చూపించారు. పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. ఆ వీడియోలోని కంటెంట్‌ను, సోషల్ మీడియాలో దాని వ్యాప్తిని పరిశీలిస్తున్నారు.

ప్రత్యర్థి గ్రూపుల మధ్య కాల్పులు
నలుగురు మిలిటెంట్లు మృతి

ఇంఫాల్ : మణిపూర్‌లోని నోనీ జిల్లాలో బుధవారం ప్రత్యర్థి వర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మిలిటెంట్లు మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. జెలియాంగ్‌రోంగ్ యునైటెడ్ ఫ్రంట్ (జెంచుయ్)తో సహా వివిధ నాగా మిలిటెంట్ సంస్థలకు చెందినవారని భావిస్తున్న వర్గాల మధ్య తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో తీవ్రమైన కాల్పులు చోటుచేసుకున్నాయి. నాగా ప్రజలు అధికంగా ఉండే ఈ జిల్లాలోని ఖౌపుమ్ ప్రాంతంలో ఉన్న తౌడైజాంగ్ గ్రామంలో ఈ కాల్పులు జరిగాయని అధికారులు పేర్కొన్నారు. మరణించిన వారి మృతదేహాలను స్థానికులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన తర్వాత, మహిళల నేతృత్వంలోని స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని, ఆ వర్గాల మధ్య మరింత హింస జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అంతేకాకుండా, కాల్పులను ఆపివేయాలని కోరుతూ వారు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ (మైకులు/ధ్వని విస్తరణ పరికరాలు) ద్వారా విజ్ఞప్తి చేశారని అధికారులు తెలిపారు.





ద్వైపాక్షిక సంబంధాలపై
భారత్–నేపాల్ చర్చ

కాఠ్మండు: భారత్–నేపాల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై ఉన్నతస్థాయి సంభాషణలు జరిగాయి.భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి బుధవారం కాఠ్మండులో ఆ దేశ విదేశాంగమంత్రి షిసిర్ ఖానల్‌తో సంభాషణలు జరిపారు. ఇరు దేశాలమధ్య బహుముఖ రంగాలలో సంబంధాలను మరింత లోతుగా విస్తరించి బలోపేతం చేసుకునే విషయంపై ఈ చర్చలు జరిగాయి.రెండు దేశబూలమధ్య ఉన్న దీర్ఘకాలిక స్నేహం గురించి ప్రధానంగా చర్చించారు. కాంఠ్మండు చేరుకున్న వెంటనే మిస్రి ఖానల్‌తో సమావేశమయ్యారు. ఇంధనం, వాణిజ్యం, క్రీడలు, విద్య వంటి రంగాలలో ఇరు దేశాలమధ్యా సహకారంపై ఈ చర్చలు జరిగాయి. మిస్రి రెండు రోజుల పాటు నేపాల్‌లో పర్యటిస్తారు.నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షాను గురువారం కలుసుకుంటారు.భారత్‌లో పర్యటించాల్సిందిగా ఆయనకు విజ్ఞప్తి చేస్తారు. నేపాల్‌లో భారత్ దౌత్యవేత్తగా కొత్తగా నియమితులైన సుధాకర్ దలేలా, నేపాల్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి గెహెంద్ర రాజ్‌భండారి మొదట మిస్రికి త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. నేపాల్ విదేశాంగ కార్యదర్శి అమిత్ బహదూర్ రాయ్ ఆహ్వానం మేరకు మిస్రి ఆ దేశంలో పర్యటిస్తున్నారు.

శ్రీరాముని పేరుతో
ఇంకెన్ని పాపాలు చేస్తారు?

- ‘విబి–జి రామ్ జి’ పథకంలో నకిలీ హాజరుపై మండిపడ్డ కాంగ్రెస్



న్యూఢిల్లీ : ‘వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)’ (విబి–జి రామ్ జి) పథకంలో నకిలీ హాజరు నమోదవుతున్న ఉదంతాలపై కాంగ్రెస్ పార్టీ బుధవారం బిజెపిని తీవ్రంగా విమర్శించింది. శ్రీరాముని పేరుతో బిజెపి ఇంకెన్ని పాపాలు చేయాలని చూస్తోందని ప్రశ్నించింది.
కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మాజీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరామ్ రమేశ్ మాట్లాడుతూ ‘గతంలో గోరఖ్‌పూర్‌లో ఇదే పథకానికి సంబంధించి నకిలీ హాజరుకు సంబంధించిన ఒక పెద్ద ఉదంతం వెలుగులోకి వచ్చింది. మేము ఈ విషయాన్ని లేవనెత్తిన తర్వాత, ప్రభుత్వం వివరణ కూడా ఇచ్చింది’ అని పేర్కొన్నారు. ప్రస్తుతం, అదే పథకానికి సంబంధించి సంత్ కబీర్ నగర్ జిల్లాలో కూడా ఇలాంటిదే మరో ఉదంతం బయటపడిందని ఆయన ఆరోపించారు. క్లోన్ యాప్‌ల ద్వారా నకిలీ హాజరును నమోదు చేస్తున్న ఘటనలు పదేపదే వెలుగులోకి వస్తున్నాయని, ఇది అత్యంత తీవ్రమైన విషయం అని రమేశ్ అన్నారు. రామమందిర విరాళాల చోరీ ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, ‘శ్రీరాముని పేరుతో విరాళాలు దొంగిలించడం, శ్రీరాముని పేరుతోనే నకిలీ ఉపాధిని సృష్టించడం... ఇలా శ్రీరాముని పేరుతో బిజెపి ఇంకెన్ని పాపాలు చేయాల్సి ఉంది?’ అని ఆయన ప్రశ్నించారు. గత నెలలో కూడా, ఇదే పథకంలో హాజరుకు సంబంధించి జరుగుతున్న మోసాలపై కాంగ్రెస్ బిజెపిని విమర్శించింది. శ్రీరాముని పేరును వాడుకుంటూనే, పేదల హక్కులపై దాడి చేయడం బిజెపికి అలవాటుగా మారిందని ఆ పార్టీ పేర్కొంది. విబి–జి రామ్ జి పథకంలో జరుగుతున్న మోసానికి సంబంధించిన మీడియా కథనం స్క్రీన్‌షాట్‌ను జైరామ్ రమేశ్ షేర్ చేశారు. అధికారిక ‘నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్’ (ఎన్ఎంఎంఎస్) యాప్‌ను పోలి ఉండే ఒక ‘క్లోన్ యాప్’ను ఉపయోగించి, మొబైల్ ఫోన్లలో ఉన్న పాత ఫోటోల ద్వారా పెద్ద ఎత్తున నకిలీ హాజరును నమోదు చేస్తున్నట్లు తేలింది. ‘మొదట శ్రీరాముని పేరుతో సేకరించిన విరాళాల చోరీ; ఆ తర్వాత ఎంజి నరేగా (ఉపాధి హామీ పథకం) కింద లభించే 100 రోజుల ఉపాధి హక్కుపై దాడి; ఇప్పుడు విబి–జి రామ్ జి పథకంలో నకిలీ హాజరు రికార్డుల ద్వారా పేదలను దోచుకునే ప్రభుత్వ ప్రేరేపిత కుంభకోణం!’ అని ఆయన విమర్శించారు.
శ్రీరాముని పేరును ప్రస్తావిస్తూనే, పేదలపై దాడి చేస్తూ వారి ఉపాధి హక్కును బిజెపి హరిస్తోందని ఆరోపించారు. ‘ఇది కేవలం అవినీతి మాత్రమే కాదు; ఇది నమ్మకద్రోహం, పేదల హక్కులను దోచుకోవడమే ఇదంతా భక్తి, ఉపాధి కల్పన పేరుతో జరుగుతోంది’ అని ఆయన అన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన, రెండు దశాబ్దాల నాటి ‘మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం’ (ఎంజినరేగా) స్థానంలో, విబి–జి రామ్ జి పథకం జులై 1 నుండి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది.

పార్లమెంట్‌లో కచ్చితంగా చర్చ జరగాలి

- లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా

తిరువనంతపురం : ఒప్పందాలు, విభేదాలు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే అయినప్పటికీ పార్లమెంటులో ఫలవంతమైన చర్చలు జరగాలని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా అన్నారు. పార్లమెంటులో అన్ని చర్చలు, సంప్రదింపులు ఎలాంటి అంతరాయాలు లేకుండా జరగాలన్నారు. త్వరలో శీతాకాల సమావేశాలకు ముందు ఓం బిర్లా ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల పబ్లిక్ అకౌంట్స్ కమిటీల చైర్‌పర్సన్‌ల సమావేశం బుధవారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. సమావేశంలో బిర్లా మాట్లాడుతూ ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) అంశం పార్లమెంటరీ చర్చకు వచ్చే అవకాశం గురించి అడగ్గా, సభలో చర్చించాల్సిన అంశాలను బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎంసి) నిర్ణయిస్తుందని బిర్లా అన్నారు. అంతకు ముందు, రెండు రోజుల సదస్సు ముగింపు సమావేశంలో ప్రసంగిస్తూ, కేటాయించిన ప్రభుత్వ నిధులు సక్రమంగా వినియోగించబడేలా చూడటం, పెరిగిన బడ్జెట్ కేటాయింపులు ఆశించిన ఫలితాలను ఇచ్చేలా చూడటం చాలా అవసరమని బిర్లా అన్నారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు, సామాజిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలలో పెట్టుబడులు పెరుగుతున్నాయని స్పష్టంగా తెలుస్తోందని ఆయన అన్నారు. ఫలితంగా, ప్రభుత్వ వ్యయం, బడ్జెట్ కేటాయింపుల పరిమాణం కూడా పెరుగుతోందని స్పీకర్ అన్నారు. ‘ఏదైనా పథకం విజయం సాధించాలంటే, ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం కేటాయించిన బడ్జెట్ వాస్తవానికి ఆ ప్రయోజనం కోసమే వినియోగించబడుతోందని నిర్ధారించుకోవడానికి శాసన కమిటీలు నిరంతరం పర్యవేక్షించడంపై ఆధారపడి ఉంటుంది’ అని ఆయన అన్నారు. మౌలిక సదుపాయాల నాణ్యత, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం లేదా సామాజిక సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు సరైన సమయంలో చేరేలా చూడటం వంటి అన్ని అంశాలకు సరైన మూల్యాంకనం అవసరమని బిర్లా అన్నారు. ప్రజాస్వామ్యంలో మనం చర్చల కోసం సమావేశమైనప్పుడు, కేంద్ర, రాష్ట్రాల కమిటీల మధ్య అనుభవాలు, పని చేసే పద్ధతులు, ఉత్తమ విధానాల వినిమయం జరుగుతుంది అని ఆయన అన్నారు. ఇలాంటి చర్చలు మన కమిటీల పని తీరును, సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయని, అలాగే కాగ్ నివేదికలను సమర్థవంతంగా పరిశీలించడంలోనూ, వాటి సిఫార్సులను కాలపరిమితిలోగా పరిష్కరించడంలోనూ విలువైన మార్గదర్శకత్వాన్ని అందిస్తాయని బిర్లా అన్నారు. మారుతున్న పరిపాలనా వాతావరణంలో, పాలనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. ప్రజాధనాన్ని విస్తృత ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలి అనే ఒకే ఉమ్మడి దృక్పథం, సంకల్పం సంబంధిత వర్గాలందరికీ ఉండాలని స్పీకర్ అన్నారు. ప్రజాధనంలోని ప్రతి రూపాయిని పారదర్శకంగా, జవాబుదారీగా ప్రణాళికబద్ధంగా కేటాయించి, వినియోగించాలన్నదే రెండు రోజుల చర్చల్లో వ్యక్తమైన ఉమ్మడి అభిప్రాయమని ఆయన అన్నారు.

కర్ణాటకలో ఆర్‌టిసి చార్జీలు పెంపు

బెంగళూరు : కర్ణాటకలోని నాలుగు ప్రభుత్వ రవాణా సంస్థల బస్సు ఛార్జీలను పెంచినట్లు రవాణా శాఖ మంత్రి బైరతి సురేష్ ప్రకటించారు. ఇందులో భాగంగా కెఎస్‌ఆర్‌టిసి బస్సుల్లో గరిష్టంగా రూ. 9 వరకు, బిఎంటిసి నగర బస్సుల్లో గరిష్టంగా రూ. 10 వరకు ఛార్జీలు పెరిగాయి. ఈ కొత్త ధరలు బుధవారం అర్ధరాత్రి నుండి అమల్లోకి వస్తాయని ఆయన తెలిపారు. బెంగళూరులోని బిఎంటిసి బస్సుల్లో కనీస ఛార్జీ రూ. 6 నుండి రూ. 10కి, గరిష్ట ఛార్జీ రూ. 35 నుండి రూ. 45కి పెరగనుంది. ఎసి ‘వజ్ర’ బస్సుల్లో గరిష్ట ఛార్జీ రూ. 75 నుండి రూ. 90కి, అలాగే కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి నడిపే ‘వాయు వజ్ర’ సర్వీసుల ఛార్జీ రూ. 405 నుండి గరిష్టంగా రూ. 425కి పెరిగింది. డీజిల్ ధరల పెరుగుదల కారణంగానే ఈ ఛార్జీల సవరణ చేపట్టామని, తమిళనాడు, మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇప్పటికే బస్సు ఛార్జీలను పెంచాయని మంత్రి సురేష్ విలేకరులతో అన్నారు.
కెఎస్‌ఆర్‌టిసి బస్సుల్లో ఛార్జీల పెంపును గరిష్టంగా రూ. 9కే పరిమితం చేశామని, ‘రాజహంస’, ఇతర ఎసి లగ్జరీ సర్వీసుల ధరలను మార్కెట్ పోటీని దృష్టిలో ఉంచుకుని నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు.

డీజిల్ ధరలు పెరగడం వల్లే : సిఎం డికె
కాగా, కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే ‘శక్తి’ పథకం కింద మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సాధారణ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తోంది. కాగా, ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ బస్సు ఛార్జీల పెంపును సమర్థించుకున్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడం, ప్రభుత్వ రవాణా సంస్థలు భారీ నష్టాల్లో కూరుకుపోవడమే దీనికి కారణమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలిపే బదులు, ఇంధన ధరలను తగ్గించాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరాలని ఆయన ప్రతిపక్ష బిజెపికి సవాలు విసిరారు. రవాణా సంస్థలు తీవ్ర నష్టాల్లో ఉన్నాయని, కనీసం డీజిల్ కొనుగోలు చేయడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన చెప్పారు. ఛార్జీల పెంపుపై ప్రతిపక్షాలు రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిద్ధమవుతున్నాయన్న వార్తలపై స్పందించిన శివకుమార్, ‘వారు నిరసనలు చేయవచ్చు. పది రోజుల క్రితం, డీజిల్ కొనుగోలు చేయడానికి ఆ సంస్థల వద్ద డబ్బు లేదు. అప్పుడు ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సి వచ్చింది. అవి భారీ నష్టాల్లో ఉన్నందున, ప్రభుత్వం ఆ నిధులను ఉచితంగానే అందించింది’ అని పేర్కొన్నారు.

బాల కార్మిక సవరణ చట్టం–2016...
అమలు కోసం ఒక ప్రత్యేక విభాగం

కేంద్రాన్ని ఆదేశించిన ‘సుప్రీం’

న్యూఢిల్లీ: ప్రమాదకరమైన పరిశ్రమలలో బాలకార్మికులను నియమించడాన్ని నిషేధించే బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) సవరణ చట్టం–2016లోని నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌విఎన్.భట్టి, జస్టిస్ ఎన్‌వి.అంజారియాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, ఈ విషయమై ఆయా రాష్ట్రాల ప్రధానకార్యదర్శుల ద్వారా అమలుచేసే ఏజెన్సీలకు ఆదేశాలు జారీచేయాలని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖను ఆదేశించింది. ‘పిల్లలు / కౌమారదశలో ఉన్నవారి హక్కులను పరిరక్షించే దృష్ట్యా 2016నాటి చట్టం నెంబర్ 35 ద్వారా సవరించబడిన ఈ చట్టంలోని నిబంధనల అమలును పర్యవేక్షించడాన్ని కొనసాగించడానికి, అలాగే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు చేసే ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేయడానికి, రెండవ ప్రతివాది ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని మేం ఆదేశిస్తున్నాం’ అని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ ‘ఎన్‌జిఓ హెల్త్ ఫర్ మిలియన్స్’ తరపున న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, ప్రణవ్ సచ్‌దేవలు హాజరు అయ్యారు. బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) సవరణ చట్టం–2016 (2016నాటి చట్టం నెం.35) 1985 నాటి ప్రధాన బాలకార్మిక చట్టాన్ని సవరించి, 2016 సెప్టెంబరు 1న అమలులోకి వచ్చింది. ఇది బాలల ఉపాధిపై పూర్తి నిషేధాన్ని విధించింది. 14 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలను అన్ని వృత్తులు, ప్రక్రియలలో నియమించడాన్ని నిషేధించింది. 2009లో దాఖలు చేసిన పిటిషన్ 1986 బాల కార్మిక (నిషేధం, నియంత్రణ చట్టంలోని సెక్షన్ 3కు ఉన్న నిబంధన యొక్క రాజ్యాంగ బద్ధతను సవాల్ చేసింది. ఈ నిబంధన వర్క్‌షాపులలో ప్రభుత్వ సహాయం /నిధులు పొందే పాఠశాలల్లో కుటుంబ శ్రమలో భాగంగా ప్రమాదకరమైన బీడి చుట్టే ప్రక్రియలో బాల కార్మికులను నియమించడాన్ని అనుమతిస్తుంది. అటువంటి బాల కార్మికులకు విద్యా సౌకర్యాలతో పాటు రెండు పూటలా భోజనం కూడా అందించాలని కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. విచారణ సమయంలో కేంద్రం తరపున హాజరైన న్యాయవాది మాత్ర చట్టానికి చేసిన సవరణతో పిటిషనర్ యొక్క ఫిర్యాదు గణనీయంగా పరిష్కరించబడిందని, పిటిషన్ పరిశీలనకు నిలవదని ధర్మాసనానికి

CHANGE OF NAME
I, **AMULA KONDAL GOUD S/o AMULA NAGANNA GOUD,** Plot No.2, Road No.3, Chandrapuri Colony, L.B.Nagar, Rangareddy Dist. Telangana State - 500074, My minor Daughter Name was mistakenly occurred in Educational / Study Certificates as **A.HARSHINI** (Old Name), Shall henceforth be known as **AMULA HARSHINI** (New Name) for all purposes.

డాక్యుమెంట్స్ పోయినవి
హనుమకొండ జిల్లా మరియు కాజీపేట మండలం ప్రశాంత్ నగర్ కు చెందిన అరూరి రమేష్, తండ్రి : గట్టుమల్లు, ఇంటి/ ప్లాటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెంబర్ **10066/06** గలది పోయినది. ఆగస్టు - 2026లో ప్రశాంత్ నగర్ లోని నివాసం నుండి కాజీపేటకు కారులో వెల్తుండగా ఇట్టి డాక్యుమెంట్ పోయినది. ఇట్టి డాక్యుమెంట్ దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందించగలరు.
ఇట్లు
అరూరి రమేష్,
ఇంటి నెంబర్ : 1-1-374
ప్రశాంత్ నగర్,
మండలం : కాజీపేట,
జిల్లా : హనుమకొండ,
పిన్ నెం : 506001.
ఫోన్ నంబర్: 99123 99103

THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT, AT:: L.B. NAGAR
G.W.O.P. No. 56 OF 2026
Between:
Master Bayya Sai Bharath Yadav and another
... Petitioners
AND
All Concerned ... Respondent
To
All Concerned
NOTICE
Please take notice that the Petitioners filed the above G.W.O.P. No. 56/2026 before the Hon'ble Prl. District and Sessions Judge, L.B. Nagar to permit the Petitioner No. 2 to sale minor's property i.e., Petitioner No. 1 in the above case in respect of Plot bearing No. 25 East Part, admeasuring an area of 125 Sq. Yards equivalent to 104.51 Sq. Meters, in Survey No. 553/1, situated at Pedda Amberpet Village, Hayatnagar Revenue Mandal, Ranga Reddy District and the Hon'ble Court was pleased to order Notice. Hence, who ever have any objections over this G.W.O.P. are requested to appear in person or through an Advocate on **09.12.2026 at 10.30 A.M.** before the above said Hon'ble Court, failing which the matter will be decided on merits. Hence this notice.
(BY ORDER OF THE COURT)
A. SANJAY
ADVOCATE
H. No. 2-4-215, Road No. 9A, Snehapuri Colony, Nagole, Hyderabad - 500 102,
Cell: 99660 88568

అమెరికా ఎన్నికల్లో భారత సంతతి విజయాలు



వాషింగ్టన్: అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో భారతీయ సంతతి అభ్యర్థులు మంచి విజయాలు నమోదు చేశారు. డెమోక్రటిక్‌పార్టీ తరపున పోటీ చేసిన అమీ బేరా, రో ఖన్నా, సుహాస్ సుబ్రమణ్యం, ప్రమీలా జయపాల్ అమెరికా దిగువసభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌కు తిరిగి ఎన్నిక కాగా, పియా దాండియా మొదటిసారి అమెరికా కాంగ్రెస్‌లో అడుగుపెట్టారు. అనేకమంది భారత సంతతి అమెరికన్ అభ్యర్థులు సెనేట్, దిగువసభ, గవర్నర్ పదవులకు, మేయర్ పదవుకులకు ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. 435 దిగువసభ స్థానాలకు, 35 సెనేట్ పదవులకు, 39 గవర్నర్ పదవులకు, ఇతర స్థానిక సంస్థల పదవులకు ఈ మధ్యంతర ఎన్నికలు జరిగాయి. 61 ఏళ్ళ వయసుగల బేరా కాలిఫోర్నియా థర్డ్ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుండి హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌కు తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ఎనిమిదోసారి ఎన్నికయ్యారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన రోబ్ టక్కర్‌ను ఆయన ఓడించారు. ఫిజీషియన్‌గా పనిచేస్తూ రాజకీయాలలో చేరిన బేరా దీర్ఘకాలంగా అమెరికా కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆరోగ్యసంరక్షణ, దౌత్య కార్యకలాపాలలో ఆయన దిట్ట. 2012లో మొదటిసారి ఆయన కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. 2013 జనవరిలో పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన దిగువసభ విదేశీ వ్యవహారాల కమిటీ బాధ్యతలు చూస్తున్నారు. 1965లో ఆయన లాస్‌వేగాస్‌లో జన్మించారు. కాలిఫోర్నియాలోని ప్రభుత్వ స్కూలులో చదువుకున్నారు. బయలాజికల్ సైన్సెస్‌లో ఆయన బ్యాచిలర్ డిగ్రీ పొందారు. ఇర్విన్ లోని కాలిఫోర్నియా యూనివర్సిటీ నుండి మేడిసిన్ డిగ్రీ తీసుకున్నారు. కాగా ఖన్నా(50) సిలికాన్ వ్యాలీలోని 17వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుండి విజయం సాధించారు. ఆయన ఇప్పటివరకూ ఐదుసార్లు దిగువసభకు ఎన్నికై ఇప్పుడు మళ్ళీ ఆరోసారి విజయం సాధించారు. భారత సంతతికి చెందిన ఖన్నా1970 నుండి అమెరికాలో ఉంటున్నారు. ఇక సుబ్రమణ్యం(40) కూడా విర్జీనియా టెన్త్ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుండి మళ్ళీ గెలిచారు. రిపబ్లికన్ అభ్యర్థి దేవ్ బెక్‌విత్‌ను ఓడించారు. ఆయను 61 శాతం ఓట్లు లభించాయి. సుబ్రమణ్యం తొలుత మాజీ అధ్యక్షుడు ఒబామాకు సలహాదారుగా పనిచేశారు. హూస్టన్‌లో జన్మించారు. 2024లో మొదటిసారి ఆయన కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. జయపాల్ కూడా వాషింగ్టన్ సెవెన్త్ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుండి ప్రాతినిధ్యం వహిస్తూ ఆరోసారి గెలిచారు. భారత్‌లో జరుగుతున్న సర్ ప్రక్రియను ఆమె విమర్శించారు. దీంతో అమెరికాలో ఉన్న భారత దౌత్యవేత్త ఆమెను తీవ్రంగా విమర్శించారు. 2016లో జయపాల్ మొదటిసారి అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. వలస సంస్కరణలు, ఆరోగ్యరక్షణ విషయాలపై ఆమె బలంగా సభలో వాదనలు వినిపిస్తారు. మరో అభ్యర్థి దాండియా(39) ఫ్లోరిడాలోని 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుండి విజయం సాధించారు. రిపబ్లికన్ అభ్యర్థి కాసే అస్కర్‌ను ఆమె ఓడించారు. ఆమె న్యూయార్క్‌లోన హార్లెమ్‌లో ఒక టీచర్‌గా కెరీర్ ప్రారంభించి రాజకీయాల్లో చేరారు. ఆమెకు ఈ ఎన్నికల్లో 51.9 శాతం ఓట్లు వచ్చాయి. మేరీలాండ్‌లో భారత సంతతి అభ్యర్థి లెఫ్టినెంట్ గవర్నర్ అరుణా మిల్లెర్ కూడా మరోసారి విజయం సాధించారు. ఇదిలా ఉండగా భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి మాత్రం ఒహియోలో ఓటమిపాలయ్యారు. ఆయనకు ట్రంప్ మద్దతు ఉంది. ఆయన కేరళకు చెందినవారు. రిపబ్లికన్‌పార్టీకి చెందిన మహేశ్ గనోర్‌కర్ కూడా ఉత్తర కరోలినాలో నాలుగవ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌లో ఓటమిపాలయ్యారు. డెమోక్రాట్లు ఈ ఎన్నికల్లో ఘన విజయాలు నమోదు చేశారు. ఇప్పుడు ఎన్నికైనవారంతా 2027 జనవరి మూడో తేదీన పదవీ ప్రమాణాలు చేస్తారు. ఇంకా కొన్ని స్థానాల్లో కౌంటింగ్ పూర్తి కాలేదు. అందువల్ల మరింతమంది భారత సంతతి అభ్యర్థులు ఫలితాలకోసం ఎదురు చూస్తున్నారు.

జార్జియా గవర్నర్ ఎన్నికల్లో చరిత్ర సృష్టించిన లాన్స్

రిపబ్లికన్ల 25 ఏళ్ళ పాలనకు తెర



తిబిలిసి: అమెరికా జార్జియా రాష్ట్రంలో డెమోక్రాట్స్ తరపున విజయం సాధించిన కీషా లాన్స్ బాటమ్స్ (56)గవర్నర్ పదవికి జరిగిన ఎన్నికల్లో చరిత్ర సృష్టించారు. గడచిన 25 సంవత్సరాలుగా జార్జియాలో డెమోక్రాట్లకు గవర్నర్ పదవి దక్కలేదు.అమెరికాలో ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా మొదటిసారి ఒక నల్లజాతీయురాలు న్నికయ్యారు. ఆమె విజయం దేశంలో ఒక పెద్ద రాజకీయ మార్పును సూచించింది. దేశంలో ఎక్కడాలేనివిధంగా తీవ్రస్థాయిలో ఈ రాష్ట్రంలోనే హోరాహోరీ ఎన్నికల పోరు జరిగింది. ఈ తీవ్రమైన పోటీలో ఆమె విజయం సాధించగలిగారు. లెక్కలేనంత ధనం ఉన్న రిపబ్లికన్ అభ్యర్థి,ప్రముఖ వ్యాపారవేత్త, హెల్త్‌కేర్ స్టాఫింగ్ కంపెనీ ''జాక్సన్‌హెల్త్‌కేర్'' వ్యవస్థాపకుడు రిక్ జాన్సన్‌పై బాటమ్స్ బ్రహ్మాండమైన విజయం సాధించారు. ఈ విజయం అమెరికాలో నల్లజాతి మహిళలకు ఒక కొత్త స్ఫూర్తిని నింపింది. అదే విధంగా రిపబ్లికన్ల తరపున ఫ్లోరిడా గవర్నర్‌గా ఒక నల్లజాతీయుడు బైరన్ డోనాల్డ్స్ మొదటిసారి గవర్నర్‌గా ఎన్నికయ్యారు. ఈ విధంగా నల్లజాతీయులకు రెండు రాష్ట్రాలలో గవర్నర్ పదవులు మొదటిసారి రెండు ప్రధాన పార్టీల తరపున లభించాయి.అదేవిధంగా ఒహియో రాష్ట్రంలో మొట్టమొదటిసారి మహిళా గవర్నర్‌గా అమీ ఆక్టన్ విజయం సాధించారు. ట్రంప్ వీరాభిమాని భారత సంతతికి చెందిన రామస్వామి ఆమె చేతిలో పరాజయం పొందారు. న్యూ మెక్సికోలో మొదటి మహిళా గవర్నర్‌గా దేవ్ హాలాండ్ విజయం సాధించి చరిత్ర సృష్టించారు.

జార్జియాలో రెండున్నర దశాబ్దాలుగా రిపబ్లికన్లు గవర్నర్ పదవిని తమ గుప్పెట్లోనే ఉంచుకుని ఏకఛత్రాధిపత్యం వహించారు. వారిని మట్టికరిపించడంతో అమాంతంగా లాన్స్ అమెరికాలో ప్రముఖ మహిళగా తెరమీదకు వచ్చారు. ఇంతకుముందు ఆమె 2018–2022 వరకూ అట్లాంటా మేయర్‌గా డెమోక్రటిక్‌పార్టీ తరపున పదవీబాధ్యతలు నిర్వహించారు. 2022లో జో బైడెన్ పాలనాయంత్రాంగంలో ఆయనకు సీనియర్ అడ్వైజర్‌గా వైట్‌హౌస్ పబ్లిక్ ఎంగేజ్‌మెంట్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1970 జనవరి 18న అటాంటాలో జన్మించిన లాన్స్ తల్లి మేజర్ లాన్స్ 1960లో తన పాటలతో అమెరికాను ఉర్రూతలూగించారు. ఫ్లోరిడా యూనివర్సిటీలో బ్రాడ్‌కాస్ట్ జర్నలిజంలో లాన్స్ డిగ్రీతీసుకున్నారు. అటార్నీగా పనిచేశారు. పిల్లల న్యాయస్థానంలో ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. డెమోక్రటిక్‌పార్టీలో చేరారు. ఆమెకు నలుగురు పిల్లలు. ఇదిలా ఉండగా ఫ్లోరిడాలో రిపబ్లికన్ల తరపున ఒక నల్లజాతీయుడు బైరన్ డోనాల్డ్స్ మొదటిసారి గవర్నర్‌గా విజయం సాధించారు.ఆయన వయసు 48 సంవత్సరాలు. 2021 నుండి అమెరికా దిగువసభలో సభ్యుడుగా ఉన్నారు. 2010లో రిపబ్లికన్‌పార్టీలో చేరకముందు ఆయన డెమోక్రటిక్‌పార్టీలో ఉండేవారు.

యుద్ధాన్ని తిరస్కరించిన అమెరికన్లు: ఘాలిబాఫ్



టెహ్రాన్: అమెరికన్ ప్రజలు యుద్ధాన్ని తిరస్కరించారని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ వ్యాఖ్యానించారు. అమెరికన్ ప్రజల ఆశయాలనకు, వారి స్ఫూర్తికి ఇరాన్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని,వారికి అండగా ఉంటుందని అన్నారు. ఎక్స్‌వేదికగా ఆయన ఒక పోస్టింగ్ పెడుతూ,''జీవన వ్యయాలను భరించలేక ఓటు వేసినా,మనస్సాక్షికి అనుకూలంగా ఓటువేసినాగానీ అమెరికన్ ప్రజలు మాత్రం యుద్ధం వద్దు అని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.అంతర్జాతీయంగా డబ్బులు కుమ్మరించేవారికి,బ్లాక్‌మెయిల్‌చేసేవారికి అమెరికా ప్రభుత్వం సేవ చేయాలని కోరుకుని ప్రజాభిప్రాయానికి ద్రోహం చేయాలనుకుంటే ''ఈ వద్దు'' అనే నినాదం పీడకలలా వెంటాడుతుందని హెచ్చరించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో అధికార రిపబ్లికన్‌పార్టీ కాంగ్రెస్ ఉభయపసభలపై పట్టుకోల్పోయిందని,డెమోక్రాట్లు విజయాలు సాధించారని ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో ఘాలిబాఫ్ పైవిధంగా స్పందించారు.ఈ ఎన్నికలలో ఓటింగ్ శాతం చారిత్రకస్థాయిలో నమోదైంది.ఆర్థిక పరిస్థితులు దిగజారిపోవడం,చమురు ధరలు పెరిగిపోవడం,జీవన వ్యవయాలు భరించలేనివిగా మారడం,ప్రజాస్వామ్య వ్యవస్థ దిజారిపోవడం వంటి పరిస్థితులమధ్య ప్రజలు మధ్యంతర ఎన్నికల్లో ఈ తీర్పు ఇచ్చారు.

శాంతియుత బంధాలకే కట్టుబడ్డాం పెజెష్కియన్ ప్రకటన

అంతర్జాతీయంగా అన్ని దేశాలతో శాంతియుత సంబంధాలకే ఇరాన్ కట్టుబడి ఉందని ఆ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అన్నారు. ఇరాన్‌లో కొత్తగా నియమితుడైన పోర్చుగల్ రాయబారి మార్సెలో వాల్టియర్ మాథియాస్ నియామక పత్రాలను స్వీకరించిన సందర్భంగా పెజెష్కియన్ మాట్లాడుతూ,అంతర్జాతీయ చట్టాల ప్రకారం తమ దేశ హక్కులను,ప్రయోజనాలను కాపాడుకుంటామని చెప్పారు. బయటనుండి ఎవరు ఒత్తిడిచేసినా సహించబోమన్నారు. ఇరాన్ శాంతికాముక దేశమని,ప్రపంచదేశాలతో నిర్మాణాత్మక సంబంధాలను కోరుకుంటున్నదని చెప్పారు. ఇరాన్–పోర్చుగల్ మధ్య 500 సంవత్సరాలకుపైగా ఉన్న చారిత్రక సంబంధాలను ఆయన గుర్తుచేసుకున్నారు.

వచ్చేవారం ఉక్రేన్ సమస్యపై త్రైపాక్షిక చర్చలు

వాషింగ్టన్: ఉక్రేన్‌లో యుద్ధం ముగించే విషయంపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రధాన నగరం అబుధాబిలో నవంబరు 10–11 తేదీలలో త్రైపాక్షిక సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒకవైపు రష్యా–ఉక్రేన్ మధ్య దాడులు కొనసాగుతున్న తరుణంలో మరోవైపు ఈ చర్చలకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. గతనెల మూడోవారంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ మాస్కో వెళ్ళి రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో రెండున్నర గంటలసేపు సంభాషణలు చేశారు. ఈ సందర్భంగా అమెరికాసహా రష్యా–ఉక్రేన్ ప్రతినిధులు త్రైపాక్షిక సంభాషణలు నిర్వహించేందుకు ఆయన అంగీకరించారు. ఈ సమావేశం ఖచ్చితంగా జరుగుతుందని స్టీవ్‌విట్‌కాఫ్ తెలయజేశారు. ఇరు దేశాలమధ్యా ఉద్రిక్తతల తగ్గింపు, మానవతా సహాయచర్యలు, యుద్ధానంతర భద్రతా హామీలు వంటి అనేక అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారని భావిస్తున్నారు.

ఇరాన్‌లో అమెరికా అహంకార వ్యతిరేక దినోత్సవం

దేశవ్యాప్తంగా 900 ర్యాలీలు



టెహ్రాన్: ఇరాన్‌లో బుధవారం అమెరికా అహంకార వ్యతిరేక దినోత్సవం పాటించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రజలు వేలాదిమంది వీధుల్లోకి వచ్చి ర్యాలీలు నిర్వహించారు. ప్రముఖంగా 13 ర్యాలీలు జరిగాయి. దేశవ్యాప్తంగా 900 ప్రాంతాలలో పెద్ద ర్యాలీలు నిర్వహించారు. అమరవీరుల స్మృతి, వారిమార్గాన్ని గౌరవించడానికి జాతీయ సంఘీభావం, ఐక్యత ప్రదర్శనకు ఈ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇరాన్ జాతి సందేశాన్ని చాటి చెప్పడానికి ఈ ర్యాలీల్లో ప్రజలు పాల్గొనాలని పాలకులు పిలుపు ఇచ్చారు. ఇరాన్ అధికారిక పత్రిక సమాచారం ప్రకారం,బుధవారం సాయంత్రం నాటికి ఈ ర్యాలీలు దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. 1979లో నవంబరు నాలుగో తేదీన టెహ్రాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని విప్లవకారులు స్వాధీనం చేసుకోవడం ద్వారా అమెరికా–ఇరాన్ మధ్య శత్రుత్వం ధృవీకృతమైంది. నవంబరు నాలుగో తేదీతోపాటు 13వ తేదీని కూడా ఇరాన్ ఇస్లామిక్ జాతీయ విప్లవ దినోత్సవంగా, అమెరికా అహంకార వ్యతిరేక దినోత్సవంగా, విద్యార్థుల దినోత్సవంగా పాటిస్తారు. నవంబరు నాలుగో తేదీన అమెరికా రాయబార కార్యాలయాన్ని ఇస్లామిక్ విప్లవకారులు ముట్టడించారు. దీనిని ఇరాన్ బందీల సంక్షోభం అని కూడా పిలుస్తారు. ఈ రాయబార కార్యాలయంలో ఉన్న 66 మంది అమెరికన్లను బందీలుగా పట్టుకున్నారు. వీరిలో కొందరిని విడుదల చేసి 56 మందిని బందీలుగా 444 రోజులపాటు నిర్బంధించారు. అమెరికాలో తలదాచుకున్న, చికిత్సపొందుతున్న ఇరాన్ మాజీ నియంత షా మొహ్మద్ రెజా పహ్లావీని తమకు అప్పగించాలని ఇస్లామిక్ విప్లవయోధులు అమెరికాను డిమాండ్ చేశారు. తర్వాత రోనాల్డ్ రీగన్ పదవీ స్వీకారం చేసిన రోజున ఈ బందీలను ఇరాన్ విడుదల చేసింది.అప్పటినుండి ఇరాన్‌లో అమెరికా అహంకార వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీలు జరుగుతున్నాయి. ఇస్లామిక్ విప్లవ ఆదర్శాలను పరిరక్షించడం, ప్రపంచ అహంకారాన్ని ప్రతిఘటించడం, ఇస్లామిక్ ఐక్యతను చాటి చెప్పడం ఈ ర్యాలీల ప్రధాన ఉద్దేశం.

డెమోక్రాట్ల వశం

(మొదటి పేజీ తరువాయి)

సాధించి చరిత్ర సృష్టించారు. సెనేట్ ఎన్నికల్లో టెక్సస్, ఒహియో, కాన్సాస్‌లలో 100 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత డెమోక్రాట్లు విజయం సాధించారు. ఇక్కడ గవర్నర్ పదవులను కూడా రిపబ్లికన్‌పార్టీ కోల్పోయింది.జార్జియా,ఫ్లోరిడా రాష్ట్రాలలో ఇద్దరు నల్లజాతీయులు మొదటిసారి గవర్నర్లుగా గెలిచి చరిత్ర సృష్టించారు.ట్రంప్‌ను ఎంతగానో అభిమానించే భారతీయ సంతతికి చెందిన వివేక్ రామస్వామి ఒహియో రాష్ట్ర గవర్నర్ ఎన్నికల్లో డెమోక్రాట్ అభ్యర్థి అమీ ఆక్టన్ చేతిలో ఓడిపోయారు. దేశరాజధాని వాషింగ్టన్ డిసిలో డెమోక్రాట్ల అభ్యర్థి జనీస్ లూయిస్ జార్జ్ మేయర్‌గా ఎన్నికయ్యారు.ఇప్పటికే న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ గెలిచి పరిపాలన చేయడం ట్రంప్‌కు మొదటి ఎదురుదెబ్బ.

రిపబ్లికన్ల స్థావరాలలో డెమోక్రాట్లు విజయబావుటా ఎగురవేశారు. టెక్సస్, జార్జియా, అయోవా, మైనే, ఉత్తర కరోలినా, దక్షిణ కరోలినా వంటి రిపబ్లికన్ పార్టీ కంచుకోటలను బద్దలుకొట్టి డెమోక్రటిక్‌పార్టీ అభ్యర్థులు గవర్నర్ పదవులు, సెనేట్ స్థానాలు చేజిక్కించుకున్నారు. ఊహించిన విధంగానే ప్రతిపక్ష డెమోక్రాట్లు కాంగ్రెస్ ఉభయసభలను తమ అధీనంలోకి తెచ్చుకున్నారు.టెక్సస్, కెన్సాస్, ఒహియోసహా రిపబ్లికన్లకు కీలకస్థావరాలుగా ఉన్న నియోజకవర్గాలలో డెమోక్రాట్లు దిగ్భ్రాంతికరమైన విజయాలు సాధించారు. దీంతో క్యాపిటల్ హిల్ డెమోక్రాట్ల వశమైంది. మొత్తంగా కాంగ్రెస్ ఉభయసభల్లో శాసనాధికారాలను,ట్రంప్‌ను నిలదీసే అధికారాలను డెమోక్రాట్లు చేజిక్కించుకున్నారు.తానే బ్యాలెట్‌లో ఉన్నట్లు భావించాలని ట్రంప్ ప్రచారం చేసిన అయోవాలో కూడా రిపబ్లికన్లు ఘోర పరాజయం ఎదుర్కొన్నారు. ఈ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన అభ్యర్థులు కూడా డెమోక్రాట్స్ తరపున పోటీచేసి ఘన విజయాలు నమోదు చేశారు.

ఓటమి అంగీకరించిన ట్రంప్

డెమోక్రాట్లతో కలిసి పనిచేసేందుకు సిద్ధం

రిపబ్లికన్ నాయకుడు, దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఓటమి అంగీకరించారు. ఈ మధ్యంతర ఎన్నికల్లో ప్రత్యర్థులు గొప్ప ఫలితాలు సాధించారని ప్రశంసించారు.''డెమోక్రాట్లకు నా అభినందనలు,వారు గట్టిగా పోరాడారు, పోరాడుతున్నారు, వారికి నా సందేశం ఏమిటంటే, మన దేశ శ్రేయస్సుకోసం మీతో కలిసి పని చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను,నాకు చాలామంది డెమోక్రాట్లు తెలుసు,సమస్యను పరిష్కరించుకోగలమని అనుకుంటున్నాను,వారు నాతో కలిసి పనిచేయాలనుకుంటున్నారని భావిస్తున్నాను, లేకపోతే నేను ప్రతిదాన్నీ వీటో చేస్తాను, అది వారికి సహజంగా ఇష్టంకాదు'' అని సిబిఎస్ న్యూస్‌కు చెప్పారు.

తొలుత న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఫలితాలను అంగీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నాన్నారు. తన పేరు బ్యాలెట్ పత్రాలలో లేదని,ఒకవేళ తన పేరు బ్యాలెట్ పత్రాలలో ఉండి ఉంటే రిపబ్లికన్ పార్టీ బ్రహ్మాండమైన విజయం సాధించి ఉండేదని అన్నారు. తమ ఓటమిలో ఇరాన్ యుద్ధం కూడా కీలకపాత్ర వహించిందని ట్రంప్ అరమరికలు లేకుండా సోషల్ మీడియా పోస్టింగ్‌లో ఒప్పుకున్నారు.మాగా స్టయిల్‌లో ఉన్న ఒక ఎర్ర టోపీని ఆయన పోస్ట్ చేశారు. కాగా అభ్యర్థులు ఓటర్లకు నచ్చలేదని ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.దేశంలో పెరిగిన జీవన వ్యయాలు,డీజిల్ ధరల పెరుగుదల సమస్యలే ట్రంప్ సంక్షుభిత ఓటమికి కారణమని అనేక సర్వేలు ముందుగానే అంచనావేసి చెప్పాయి.గడచిన నలభైఏళ్ళలో టెక్సస్ నుండి డెమోక్రాట్ అభ్యర్థి జేమ్స్ తలరికో కాంగ్రెస్‌కు వెళ్ళడం ఇదే మొదటిసారి.చాలామంది రిపబ్లికన్లు ఈ ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ప్రభావానికి దూరంగా ఉండాలని కోరుకున్నారు. దూరంగా ఉన్నారు.కానీ టెక్సాస్‌లో పాక్స్టన్‌కు,దక్షిణ కరోలినాలో గ్రాహంకు మద్దతు ఇవ్వడంపట్ల తనకు పశ్చాత్తాపం లేదని ట్రంప్ అన్నారు.

ట్రంప్ వైదొలగితే మంచిది : ఓటర్లు వెల్లడి

ట్రంప్ పదే పదే చెబుతున్న అబద్ధాలు, గొప్పలే తమ విముఖతకు కారణమని మంగళవారంనాడు పోలింగ్ బూత్‌లవద్ద ఓటర్లు పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ''ట్రంప్ నా పిల్లలకు ఆదర్శంగా ఉండటం నాకు ఇష్టం లేదు, ఆయన తన పదవి నుండి ఎంత తొందరగా వైదొలగితే అంతమంచిది, ట్రంప్ అంటేనే ఒక అవమానం, ద్రోహం అని డెమోక్రాట్లకు ఎప్పుడూ ఓటు వేసే ఒక ఓటర్ చెప్పారు. ట్రంప్ శకం ముగిసిందని రిపబ్లికన్ నాయకుడు క్రిస్టీ క్రిస్టీ వ్యాఖ్యానించారు.

ముంచెత్తిన ముసురు

(మొదటి పేజీ తరువాయి)



కారణంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఈ తుఫానుతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే సుమారు ఐదువేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గింతేగానీ నివేదికలు పూర్తి స్థాయిలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా వరి, మినుపు పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికే కోసిన ధాన్యం పలు చోట్ల తడిసి పోయింది. మరోప్రక్క పత్తికి తీవ్ర విపత్తు పొంచి ఉంది. ఇదే తరహా వానలు మరో నాలుగు రోజుల పాటు కొనసాగితే కోతకు సిద్ధంగా ఉన్న పత్తితో పాటు పత్తి కాయలు నల్లబడి చేతికందే పరిస్థితి లేదు. పత్తికి మంచి ధర పలుకుతున్న నేపథ్యంలో ఈ ముసరు రైతుల ఉసురు పోసుకుంటుంది అంటూ పలు వ్యవసాయాధిరిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ములకలపల్లి మండలంలో రాజపేట పాములేరు వాగు సమీపంలో ఇటీవల నిర్మించిన రూ.60 లక్షల అప్రోచ్ రోడ్ తెగిపోయింది. జగన్నాధపురం గ్రామంలో సబ్ స్టేషన్ వద్ద బ్రిడ్జీ, సత్యంపేట వాగు బ్రిడ్జీ పై నుండి సుమారు ఎనిమిది అడుగుల ఎత్తులో వరద ప్రవహిస్తోంది. దీంతో మండల నుండి పాల్వంచ దమ్మపేట సత్తుపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. తాళ్లవాయిపంచాయితీ పరిధిలో నసరత్ కుంట చెరువు అలుగుపడటంతో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ముంపుకు గురయ్యాయి. కొత్తగూడెం నియోజకవర్గంలోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చుంచుపల్లి మండలంలోని పెనుబల్లి వంతెన ములుగు గూడెం వంతెన పై నుంచి వాగు ప్రవహిస్తోంది. సుజాతనగర్ మండలం లక్ష్మీ దేవిపల్లి గరీబ్‌పేట గ్రామాల మధ్య వాగు లోలెవల్ వంతెనపై ప్రవహిస్తోంది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాల్వంచ మండలంలోని దంతెలబోర గొల్లగూడెం ప్రాంతాల్లో వాగు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. పాల్వంచ మండలంలో దంతెలబోరు బంద్రుగొండ రహదారి వరదనీటిలో మునిగిపోయింది. పలు పంటల పొలాలు నీటిలో తెలియాడుతున్నాయి. 8,42వ డివిజన్లలో వరదనీరు చేరడంతో మునకు గురయ్యాయి. మేయర్ మూడ్ గణేష్ వరదనీటిని మళ్లించే పనులను స్వయంగా పరిశీలించారు. చంద్రుగొండ మండలం తిప్పనపల్లి ప్రభుత్వ పాఠశాల్లోకి మోకాళ్లలోతు నీళ్లు చేరాయి. అశ్వారావుపేట నియోజకవర్గం కేంద్రంలో ఖమ్మం,భద్రాచలం రోడ్లు పైనీరు వరదలై పారుతుండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. దొంతుకుంట చెరువులోకి భారీగావరద నీరు చేరడంతో చెరువుకట్ట చెరువుకు గండి పడటంతో నీరు రోడ్లపై పారుతోంది. సంతమార్కెట్ జలమయమైంది. పద్దవాగు ప్రాజక్టుకు నీటి ఉధృతి పెరగడంతో లాకులు ఎత్తిన అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ క్రమంలో రింగ్‌బండ్ తెగిపోవడంతో నీటి ప్రవాహం పెద్దఎత్తున పెరిగి సమీప గ్రామాల్లోకి నీరు చేరుతోంది. నారవారిగూడెం, గుర్రాల చెరువు రోడ్డ తెగి రోడ్డుపై పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహిస్తోంది. దమ్మపేట మండలం కొత్తపేట కాలనీలోకి వరదనీరు చెరడంతో బాధితులను పునరావాస కేంద్రాలకు డిప్యుటీ కలెక్టర్ తరలించారు. మద్దులపల్లి దమ్మపేట రోడ్‌పై భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. అశన్నగూడెం నాగుపల్లి మధ్య రోడ్డుపై మల్లెపూల వాగు పొంగి పొర్లుతోంది. అశ్వారాపుపేట మండలంలో ముంపుకు గురైన ప్రాంతాలను మున్సిపల్ కమీషనర్ దిలీప్‌రెడ్డి తన సిబ్బందితో పరామర్శించారు. కౌన్సిలర్ కొల్లి రవికుమార్ బాధితులకు అండగా నిలుస్తున్నారు. ముంపు ప్రాంతాలను కౌన్సిలర్ డా.జ్యోతి పరిశీలించి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. గుబ్బలమంగి వాగు అలుగుపారుతోంది. ఆళ్లపల్లి,గుండాల, పినపాక, అశ్వాపురం, కరకగూడెం, బూర్గంపాడు మండలాల్లోని పలు వాగులు వంకలు పొంగిపొర్లి గోదావరిలో కలుస్తున్నాయి. ఎగువన కూడా తుఫాను ప్రభావం ఉండటంతో గోదావరికి వరదనీరు వచ్చి చేరుతోంది. తుఫాన్ ప్రభావంతో జనజీవన అస్తవ్యస్థంగా మారింది.

వరదలో కొట్టుకుపోయిన ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

ఖమ్మం: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లిలో చెరువులో చిక్కుకున్న జాలర్లను కాపాడేందుకు వెళ్లి 10 మంది ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతయ్యారు. భారీ వర్షాలకు చెరువు అలుగు పారుతుండడంతో నెట్లు ఏర్పాటు చేసేందుకు ఐదుగురు జాలర్లు వెళ్లి వరదలో చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు తొలుత ముగ్గురు ఫైర్ సిబ్బంది బోటులో వెళ్లగా వారు వరదలో చిక్కుకుపోయారు. దీంతో కొత్తగూడెం ఎస్‌డిఆర్‌ఎఫ్‌కు చెందిన ఆరుగురు, మరో నలుగురు ఫైర్ సిబ్బంది రెండు బోట్లలో వారిని కాపాడేందుకు వెళ్లారు. తొలుత బోటులో చిక్కుకుపోయిన ముగ్గురు అగ్నిమాపక సిబ్బందిని వెనక్కి తీసుకొచ్చారు. అనంతరం మత్సకారులను తీసుకొచ్చేందుకు వెళ్లగా రెండు బోట్లు పల్టీలు కొట్టి అందులోని 10 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం మరో బోటులో ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది గాలిస్తున్నారు. సహాయక చర్యలు కలెక్టర్ దివాకర్, ఎమ్మెల్యే రాగమయి పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందిని రప్పించి బోటు సహాయంతో చిక్కుకున్న వారిని కాపాడే ప్రయత్నం చేపట్టారు. కాగా, బేతుపల్లి చెరువులో ఎస్‌డిఆర్‌ఎఫ్ బోట్ల గల్లంతుపై సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆరా తీశారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిందిగా సీఎస్‌కు సూచించారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందిని కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, సహాయక చర్యలు ముమ్మరం చేయాలని కలెక్టర్‌ను భట్టి ఆదేశించారు.

కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

(మొదటి పేజీ తరువాయి)

సహాయక చర్యల విషయంలో రెండు ప్రభుత్వాలూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి r.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పాల్గొనటన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కరువు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సిపిఐ బృందాలు తప్ప ఇప్పటివరకు ఏ ఒక్కరూ కూడా సందర్శించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఇప్పటికే 12.5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో రైతులు అసలు పంటలే వేయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. కరువు ప్రభావం పంటలు వేసిన రైతులకే పరిమితం కాదని, సాగు చేయలేకపోయిన రైతులు, వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలనూ ఆదుకునే సమగ్ర సహాయక ప్యాకేజీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ నెల 2వ తేదీ నుంచే సిపిఐ ఆధ్వర్యంలో కరువు పరిశీలన బృందాలు పర్యటిస్తున్నాయని కూనంనేని సాంబశివరావు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఇతర నాయకులకు జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించి క్షేత్రస్థాయిలో పంట నష్టం, రైతుల పరిస్థితులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కరువు అంచనాలు రూపొందించి, సహాయక చర్యలు చేపట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయో రావోననే ఎదురుచూపుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక చర్యలు కూడా చేపట్టకపోవడం సరికాదన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి సహ ఇతర వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరిన రూ.25 వేల కోట్ల కరువు సహాయక నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు సమకూర్చి రైతులను ఆదుకోవాలన్నారు.

పంటలు వేయని రైతులకూ కరువు సాయం

కరువు పరిహారం కేవలం పంటలు వేసి నష్టపోయిన రైతులకే పరిమితం కాకూడదని సాంబశివరావు స్పష్టం చేశారు. వర్షాభావం, నీటి కొరత కారణంగా సాగు చేయలేక పంటలు వేయని రైతులకు కూడా ఎకరాకు రూ.10 వేల చొప్పున కరువు సబ్సిడీ ఇవ్వాలని కోరారు. కరువు ప్రభావంతో ఉపాధి కోల్పోయిన పేద కుటుంబాలకు 5 నుంచి 6 నెలల పాటు నెలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక భృతి అందించాలని డిమాండ్ చేశారు. పశుగ్రాసం, ఆహార ధాన్యాలు, నిత్యావసర సరుకులను తక్షణమే పంపిణీ చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో పంటల బీమా అమలులో లేకపోవడం రైతులకు తీవ్ర నష్టం కలిగించిందని అన్నారు. బీమా పథకం అందుబాటులో ఉంటే కొంత మేరకు రైతులకు పరిహారం లభించేదని ఆయన తెలిపారు.

అమిత్‌షా చేయాల్సింది పాదయాత్ర కాదు

కరువు, రైతుల సమస్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎందుకు స్పందించడంలేదని సాంబశివరావు ప్రశ్నించారు. రాష్ట్రానికి వచ్చిన ఆయన రైతుల సమస్యలు, కరువు నివారణ చర్యలు, కేంద్రం నుంచి అందించే ఆర్థిక సహాయంపై ఒక్క ప్రకటన కూడా చేయలేదని విమర్శించారు. ఢిల్లీలో ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి పోటీగా బిజెపి నిర్వహిస్తున్న పాదయాత్ర రాజకీయ ప్రయోజనాల కోసం చేపట్టిన కార్యక్రమమని సాంబశివరావు విమర్శించారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో కోట్లాది ఓట్లు తొలగించారన్న ఆరోపణలపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమ వలసదారుల పేరుతో ఓటర్లను తొలగిస్తున్నామని చెబుతున్న బిజెపి ప్రభుత్వం, ఎంతమంది అక్రమ వలసదారులను గుర్తించింది, ఎంతమంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించిందో వివరించాలని సాంబశివరావు కోరారు.

ఆర్‌టిసి మహిళా ఉద్యోగి కుటుంబానికి రూ. కోటి పరిహారం

విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మరణించిన ఆర్‌టిసి మహిళా ఉద్యోగి ఘటనపై కూనంనేని సాంబశివరావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధితురాలికి మెరుగైన వైద్యం అందించడంలో ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వహించారని ఆయన విమర్శించారు. రక్తస్రావం జరుగుతున్నప్పటికీ సరైన వైద్యం అందించకపోవడం, మెరుగైన వైద్య సదుపాయాలున్న ఆసుపత్రికి తరలించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆర్‌టిసి అధికారులు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారుల బాధ్యతను నిర్ధారించి చర్యలు తీసుకోవాలని కోరారు. మృతురాలి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు, పార్టీలకు అతీతంగా ఇవ్వాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సిపిఐ ప్రతినిధి బృందం కలిసి పలు ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు సాంబశివరావు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ కేటాయించాలని కోరినట్లు చెప్పారు. అవసరమైతే లాటరీ విధానం ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీఓ 58 ప్రకారం ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరినట్లు తెలిపారు. సంబంధిత వివరాలు, అర్హుల జాబితాలను సమర్పిస్తే పరిశీలిస్తామని ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని సాంబశివరావు వెల్లడించారు. తెలంగాణలోని అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు సాంబశివరావు చెప్పారు.

విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

విశ్వవిద్యాలయాలు, కళాశాలలలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎన్నికలు లేకపోవడంతో విద్యార్థుల్లో రాజకీయ, సామాజిక చైతన్యంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందే అవకాశాలు తగ్గుతున్నాయని అన్నారు. గతంలో అనేక రాజకీయ, సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహించిన వారు విద్యార్థి సంఘాల నుంచే ఎదిగారని గుర్తు చేశారు. విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహణపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, ఈ అంశాన్ని అసెంబ్లీ లోనూ ప్రస్తావిస్తానని ఆయన చెప్పారు.

తొలి వన్డేలో భారత్ ఘనవిజయం

విరాట్ కోహ్లీ విధ్వంసకర బ్యాటింగ్





న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. ఆక్లాండ్ వేదికగా బుధవారం వర్షం అంతరాయం కలిగించిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ డక్వర్త్ లూయిస్ ప్రకారం 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో 1–0 తో ఆధిక్యంలో నిలిచింది. విరాట్ కోహ్లీ(51 బంతుల్లో 13 ఫోర్లు, సిక్స్‌తో 74) హాఫ్ సెంచరీతో సత్తా చాటి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకే ఆలౌటైంది. టెయిలెండర్ బ్లెయిర్ టిక్నర్(23 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 34), టీమ్ సీఫెర్ట్(43 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(4/70) నాలుగు వికెట్లు తీయగా.. గుర్నూర్ బ్రార్(3/44) మూడు వికెట్లు పడగొట్టాడు. అన్షుల్ కాంబోజ్(2/22) రెండు వికెట్లు తీసాడు.అనంతరం భారత్ బ్యాటింగ్‌కు దిగగా రెండు సార్లు వర్షం అంతరాయం కలిగించింది. 18 ఓవర్ల ఆట తుడిచిపెట్టుకుపోగా.. భారత్ లక్ష్యాన్ని డక్ వర్త్ లూయిస్ ప్రకారం 32 ఓవర్లలో 143 పరుగులు నిర్ణయించారు. భారత్ 22.4 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి ఈ లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ కోహ్లీతో పాటు శుభమన్ గిల్(56 బంతుల్లో 5 ఫోర్లతో 37) రాణించాడు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 114 పరుగులు జోడించారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకోబ్ డఫీ(3/49) రెండు వికెట్లు తీయగా.. కైల్ జెమీసన్, నాథన్ స్మిత్ తలో వికెట్ తీసారు.

నిరాశపర్చిన రోహిత్.. 186 పరుగుల లక్ష్యఛేదనలో భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. తొలి ఓవర్‌లోనే రోహిత్ శర్మ(0) డకౌట్ వెనుదిరిగి తీవ్రంగా నిరాశపర్చాడు. క్రీజులోకి విరాట్ కోహ్లీ రాగా..శుభమన్ గిల్ ఆచితూచి ఆడాడు. కోహ్లీ తనదైన శైలిలో క్విక్ సింగిల్స్, డబుల్స్ తీస్తూ వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలించాడు. దాంతో పవర్ ప్లేలో భారత్ వికెట్ నష్టానికి 49 పరుగులు చేసింది. పవర్ ప్లే అనంతరం ఐదు బంతులు వేయగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆట ఆగిపోయే సమయానికి భారత్ 10.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 54 పరుగులు చేసింది. 45 నిమిషాల తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. డక్వర్త్ లూయిస్ ప్రకారం భారత్ లక్ష్యాన్ని 40 ఓవర్లలో 167 పరుగులుగా నిర్ణయించారు. మరో 7 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించడంతో మళ్లీ ఆట ఆగిపోయింది. గంటా 17 నిమిషాల తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. భారత్ లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా నిర్ణయించారు. విరాట్ కోహ్లీ దూకుడుగా ఆడాడు. వరుస బౌండరీలతో స్కోర్ బోర్డును పరుగెత్తించాడు. ఈ క్రమంలో కోహ్లీ 35 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం అతను మరింత దూకుడుగా ఆడాడు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన శుభ్‌మన్ గిల్(37) నాథన్ స్మిత్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. భారత విజయం ముంగిట విరాట్ కోహ్లీని జాకోబ్ డఫీ ఔట్ చేశాడు. అయితే కోహ్లీ వికెట్ అనంతరం భారత్ వరుసగా వికెట్లు కోల్పోయింది. డఫీ బౌలింగ్‌లోనే అక్షర్ పటేల్(0) ఔటవ్వగా.. శ్రేయస్ అయ్యర్(15) కూడా అతని బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. క్రీజులోకి వచ్చిన నమన్ ధీర్ బౌండరీ బాది భారత విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

హంపి పరిరక్షణలో
స్థానిక ప్రజల భాగస్వామ్యం







విజయనగర వైభవానికి, శ్రీకృష్ణదేవ రాయల ప్రాభవానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన హంపి వారసత్వ సంపద పరిరక్షణలో స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని, నిర్వహణ సంస్థను మరింత బలోపేతం చేయాలని, అభివృద్ధి ప్రాజెక్టులకు వారసత్వ ప్రభావ అంచనాను తప్పనిసరి చేయాలని యునెస్కో నిపుణుల బృందం చేసిన సూచనలు ఆచరణీయం. హంపి ప్రపంచ వారసత్వ ప్రాంత నిర్వహణ ప్రాధికార సంస్థ (హెచ్‌డబ్ల్యూహెచ్ఎఐ)ను బలోపేతం చేయాలని కూడా బృందం సిఫార్సు చేయడం హర్షణీయం. వారసత్వ పరిరక్షణ వ్యవహారాల్లో పరిపాలనా కొనసాగింపు అవసరమన్నది నిజం. హంపి ప్రపంచ వారసత్వ ప్రదేశాన్ని సుస్థిరంగా నిర్వహించేందుకు తగిన సిబ్బంది, ఆర్థిక వనరులు అందించాల్సిన అవసరం ఉంది. హంపి అత్యంత విశిష్టమైన ప్రపంచ వారసత్వ ప్రదేశం. దాని పరిరక్షణలో అక్కడ, పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలను భాగస్వాములను చేయడం అత్యవసరం. వారసత్వ సంపదను కాపాడటంలో ప్రజలు భాగస్వాములు కావడంతోపాటు, పర్యాటకం, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రయోజనం పొందాలి. స్థానిక ప్రజలు చురుగ్గా పాల్గొనకుండా వారసత్వ సంపద నిర్వహణను సుస్థిరంగా కొనసాగించడం సాధ్యం కాదు. హంపిని సజీవ సాంస్కృతిక భూదృశ్యంగా చూడాల్సిన అవసరం ఉంది. వారసత్వ పరిరక్షణ, పర్యాటకం, స్థానిక ప్రజల జీవన విధానం మధ్య సమతుల్యతను జాగ్రత్తగా పాటించాలి. హంపి ప్రపంచ వారసత్వ ప్రాంత నిర్వహణ ప్రాధికార సంస్థ తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించేందుకు ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన సిబ్బందిని, తగిన ఆర్థిక వనరులను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. హంపి విశ్వవ్యాప్తంగా అసాధారణమైన విలువను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా కాపాడాలి. అదే సమయంలో, పరిరక్షణ కార్యక్రమాల్లో స్థానిక సమాజాన్ని భాగస్వాములను చేయాలి. సుస్థిర వారసత్వ నిర్వహణకు బలమైన సంస్థలు, నిపుణుల నేతృత్వంలోని ప్రణాళికలు, పరిపాలనా కొనసాగింపు అత్యవసరం. హంపిలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు వారసత్వ పరిరక్షణకు, స్థానిక ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా సాగాలి. అప్పుడే హంపి వంటి చారిత్రక ప్రదేశాలకు రక్షణ, భద్రత లభిస్తాయి.

వేల సంవత్సరాల 'మేక'!

ఒక మేక వేల సంవత్సరాలు చెక్కుచెదరకుండా నిలిచి, అందరినీ ఆకర్షిస్తోంది. 3,000 సంవత్సరాలకు పైగా కాలం గడిచినా, వెండి పాత్ర అంచును గట్టిగా పట్టుకున్న బంగారు మేక శిల్పం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. దూకుతున్న భంగిమలో ఉన్న ఈ మేక, ఇన్నేళ్ల తర్వాత కూడా ఆ పాత్రను విడిచిపెట్టనట్టుగా కనిపిస్తుంది. క్రీ.పూ. 13వ శతాబ్దంలో, ఈజిప్టులో 19వరాజవంశం పాలనాకాలంలో, ముఖ్యంగా రెండవ రామెసెస్ II పాలనకు సమీప కాలంలో ఈ పాత్రను వెండితో రూపొందించారు. పురాతన ఈజిప్టులోని బుబాస్టిస్, నేటి టెల్ బస్తా ప్రాంతంలో దీనిని పాతిపెట్టారు. మరణానంతర లోకంలోనూ తన యజమానికి ఉపయోగపడుతుందనే విశ్వాసంతో ఈ పాత్రను సమాధిలో ఉంచి ఉండవచ్చు. 1906లో ఇది అక్కడ బయటపడింది. పాత్ర మెడ చుట్టూ వేట దృశ్యాలు, హైరోగ్లిఫిక్ లిపిలోని చిత్రలిపి గుర్తులు చెక్కబడి ఉన్నాయి. పాత్ర శరీరంపై ఒకదానిపై మరొకటి అమర్చిన పూలరేకుల మాదిరి ఆకృతులను వరుసలుగా తీర్చిదిద్దారు. ఈ అలంకరణలు పురాతన ఈజిప్షియన్ కళాకారుల నైపుణ్యానికి నిదర్శనం. మరి, మరణానంతర లోకంలో ఈ పాత్ర నుంచి ఏమి పోయాలని దాని యజమాని ఆశించి ఉంటాడు? అనే ప్రశ్న వెనుక పురాతన ఈజిప్షియన్ల మరణానంతర జీవితంపై ఉన్న విశ్వాసం దాగి ఉంది.



మధ్యయుగం నాటి రాతప్రతి 'కోడెక్స్ గిగాస్'



ప్రపంచంలో ఇప్పటికీ భద్రంగా ఉన్న అతిపెద్ద మధ్యయుగ చేతిరాత గ్రంథాల్లో 'డెవిల్స్ బైబిల్'గా ప్రసిద్ధి చెందిన 'కోడెక్స్ గిగాస్' ఒకటి. 13వ శతాబ్దం ప్రారంభంలో, నేటి చెక్ రిపబ్లిక్‌లోని బోహీమియా ప్రాంతంలో ఈ గ్రంథం రూపుదిద్దుకుంది. ఇది సుమారు మూడు అడుగుల ఎత్తు ఉంటుంది. దీని బరువు దాదాపు 75 కిలోగ్రాములు(165 పౌండ్లు). ఈ అద్భుతమైన గ్రంథంలోని పేజీలలో బైబిల్‌కు సంబంధించిన రచనలు, చారిత్రక విషయాలు, వైద్య విజ్ఞానానికి సంబంధించిన సమాచారం ఉన్నాయి. వీటితో పాటు, ఒక పూర్తి పేజీని ఆక్రమించేలా చిత్రించిన దెయ్యం బొమ్మ ఈ గ్రంథంలో అత్యంత ప్రత్యేకమైన అంశం. ఈ భయానక చిత్రమే దీనికి 'డెవిల్స్ బైబిల్' అనే పేరు రావడానికి ఒక ప్రధాన కారణం. ఈ గ్రంథం వెనుక ఉన్న ఆసక్తికరమైన పురాణగాథ ప్రకారం, ఒక సన్యాసి ఈ గ్రంథాన్ని ఒక్క రాత్రిలో పూర్తి చేయాలని ప్రయత్నించాడు. అది సాధ్యం కాకపోవడంతో దెయ్యంతో ఒప్పందం చేసుకున్నాడు. ఆ ఒప్పందం ప్రకారం దెయ్యం అతనికి గ్రంథాన్ని పూర్తి చేయడంలో సహాయం చేసిందని కథనం. అయితే, ఇది కేవలం ఒక జానపద గాథ మాత్రమే. ఈ కథకు విశ్వసనీయమైన చారిత్రక ఆధారాలు లేవు. ఈ గ్రంథం అసాధారణమైన పరిమాణం, అందులోని చిత్రాలు, దాని నిర్మాణానికి పట్టిన శ్రమ కారణంగా ఇలాంటి కథలు ప్రచారంలోకి వచ్చి ఉండవచ్చు. ఈ చారిత్రక గ్రంథాన్ని ప్రస్తుతం స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లోని నేషనల్ లైబ్రరీ ఆఫ్ స్వీడన్‌లో భద్రపరిచారు. మధ్యయుగ ఐరోపా చరిత్ర, మతం, వైద్య విజ్ఞానం, పుస్తక నిర్మాణ కళలను అధ్యయనం చేసే పరిశోధకులకు ఇది ఎంతో విలువైన చారిత్రక సంపద.

భారత త్రయానికి స్వర్ణం



దోహా: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ పురుషుల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో రవీందర్ సింగ్, సౌరభ్ చౌదరి, అమన్‌ప్రీత్ సింగ్‌తో కూడిన భారత త్రయం పసిడిని గురిపెట్టింది. ఫైనల్లో ఈ త్రయం.. 1659 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకాన్ని నెగ్గింది. ఇదే ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో రవీందర్ సింగ్ 559 పాయింట్లతో రజతాన్ని గెలిచాడు.

నేటినుంచి తెలంగాణ అస్మిత రగ్బీ టోర్నీ




రాష్ట్రస్థాయి అస్మిత రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు బుధ, గురువారాల్లో సంగారెడ్డిలోని వోక్సెన్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రగ్బీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర రామ్, ప్రధాన కార్యదర్శి ఆదిత్య వుత్పల ప్రకటించారు. ఈ టోర్నీలో 17 జిల్లాల నుంచి మొత్తం 28 జట్లు పాల్గొంటాయని తెలిపారు. అండర్15 విభాగంలో 16 జట్లు, అండర్18 విభాగంలో 12 జట్లు పోటీపడతాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో రగ్బీని బలోపేతం చేయడంతో పాటు, మరింత మంది బాలికలు పాల్గొనేలా ప్రోత్సహించాలన్నదే తమ లక్ష్యమని నరేంద్ర రామ్ తెలిపారు.

పంటనష్టాన్ని శాస్త్రీయంగా అంచనావేసి
పరిహారం అందించాలి

నాగర్‌కర్నూల్ జిల్లాలో తీవ్ర కరువు
పత్తి, మొక్కజొన్న పంటకు తీవ్రనష్టం
రైతులు, ప్రజలను ఆదుకోవాలి
పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి..
గ్రామాలకు తాగునీటి వసతి
కల్పించాలి..సిపిఐ జాతీయ కార్యదర్శి
పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పత్తి, మొక్కజొన్న, తదితర పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కరువు బారిన పడిన రైతులను, గ్రామీణ ప్రజలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్రస్థాయి కరువు బృందం పల్లా నాయకత్వంలో జిల్లాలోని అమ్రాబాద్, బల్మూరు, పదర మండలాల్లో పర్యటించి కరువు పరిస్థితులను, పంటల దుస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పంటనష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి వ్యవసాయ రుణాల నుంచి ఉపశమనం కల్పించి, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంటనష్టాలతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో 15రోజులకు ఒకసారి తాగునీరు అందని పరిస్థితి ఉందని, ప్రభుత్వం మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. జిల్లాలోని తెలకపల్లి, బల్మూరు, అచ్చంపేట, అమ్రాబాద్ మండలాల్లో అతి తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని నూటికి నూరుశాతం పంట నష్టం జరిగిందన్నారు. అమ్రాబాద్, పదర మండలాల్లో 25వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, పట్టాలు లేక రైతులు బోర్లు వేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదర మండలంలో పశుసంపద అధికంగా ఉన్నందున పశుగ్రాసం సరఫరా చేయాలని కోరారు. పర్యటనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహా, జిల్లా కార్యదర్శి ఎస్ఎండి.ఫయాజ్, రాష్ట్రసమితి సభ్యులు కె.కేశవగౌడ్, వి.వెంకటయ్య, జిల్లా నాయకులు పెబ్బేటి విజయుడు, ఈర్ల చంద్రమౌళి, అచ్చంపేట్ నియోజకవర్గ కార్యదర్శి పెరుమల గోపాల్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి సూర్యశంకర్‌గౌడ్, అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు తన్నీరు, నాయకులు మల్లేష్, వి.రవీందర్, పి.పరుశురాం, వంకేశ్వరం, శ్రీనివాసులు, కొత్త రామస్వామి, మహమ్మద్, ఖలీల్, ఎం.ఆంజనేయులు, విష్ణు, నరేందర్‌రెడ్డి, విష్ణు, శివకృష్ణ పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లాను ప్రత్యేక కరువు జిల్లాగా ప్రకటించాలి...చాడ

పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాను ప్రత్యేక కరువు జిల్లాగా ప్రకటించి ప్రతి రైతుకు రూ.50వేలు ఆర్థిక సాయం అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలంలోని గొల్లపల్లి, కనుకుల, కనగర్తి తదితర గ్రామాల్లో సిపిఐ ఆధ్వర్యంలో కరువు యాత్ర నిర్వహించారు. యాత్రలో గ్రామాల్లోని పర్యటించి వరి పంట పరిస్థితులను పరిశీలించి, రైతులను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చాడ వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో రాబోయే యాసంగిలో నీరు లేని పరిస్థితి ఉందని, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో 14 మండలాలలో సర్వే నిర్వహించి కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. సిపిఐ క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న కరువు యాత్రలో వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే అధికారుల అంచనాలకు మించి రైతులు తీవ్రనష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పులు, సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు తదితర కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేవలం కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవడం కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బృందంలో సిపిఐ నాయకులు సూర్య మానస్, నవీన్, శేఖర్, మణికంఠ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు రూ.15వేలు,
వరికి రూ.30వేలు చెల్లించాలి
సిపిఐ ఎమ్మెల్సీ నెలికంటి సత్యం

రంగారెడ్డి/కేశంపేట: తీవ్రమైన వర్షాభావ కరువు పరిస్థితుల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎమ్మెల్సీ నెలికంటి సత్యం కోరారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి, వేములనర్వ గ్రామాలలో ఎండిపోయిన రైతుల పంట పొలాలను సిపిఐ నేతల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా నెలకొన్న తీవ్రమైన కరువు ఛాయలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ద్వారా రాష్ట్రాన్ని మొత్తం కరువు ప్రాంతంగా ప్రకటించే విధంగా ఒత్తిడి తేవాలని కోరారు. రాష్ట్రంలోని రాజకీయ పక్షాలను కలుపుకొని సమన్వయంతో కేంద్రప్రభుత్వం నుంచి కరువు నిధులు రాబట్టాలని సూచించారు. రానున్న ఆరు నెలలు చాలా తీవ్రమైన గడ్డు పరిస్థితులు ప్రజలు ఎదుర్కొనే పరిస్థితి ఉన్నందున ప్రభుత్వాలు సాగునీటి వసతి, కరంటు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని డిమాండ్ చేశారు. ఈ ఆరు నెలలు ప్రతి తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదవాడికి 10కిలోల బియ్యం, పప్పు దినుసులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన మొక్కజొన్న పంటకు రూ.15వేలు, వరి పంటకు రూ.30వేలు, పత్తి పంటకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు బ్యాంకుల్లో పంటలు వేసుకునేందుకు తీసుకున్న రుణాలను మొత్తం ఏకకాలంలో రద్దు చేయాలని కోరారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు పూర్తి చేసి ఈ జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించాల్సిన ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుతో దీనిని బొంద పెట్టారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లాలో 27మండలాలు కరువు పరిస్థితుల్లో ఉన్నందున జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. పంటలు ఎండిపోయిన రైతుల వివరాలను సమగ్రంగా సేకరించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్య, కె.రామస్వామి, ఎం.యాదిరెడ్డి, బుద్దుల జంగయ్య, టి.రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సామెడి శేఖర్‌రెడ్డి, ఎం.శ్రీనునాయక్, పల్నాటి యాదయ్య, ఎం.ప్రభు లింగం, పి.శివకుమార్, ఎం.పవన్ చౌహాన్, ఆర్.యాదగిరి, వడ్ల సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, చంద్రబాబులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌ను ప్రత్యేక కరువు జిల్లాగా ప్రకటించాలి
కలవేణ శంకర్


ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాను ప్రత్యేక కరువు జిల్లాగా ప్రకటించి, తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తి పంట నష్టపోయిన ప్రతి రైతుకూ రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ జిల్లా కన్వీనర్ ఎస్.విలాస్ అధ్యక్షతన ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి, లోకారి, వన్‌వట్, లింగుగూడ, మామిడిగూడ, కప్పర్ల, దహిగూడ గ్రామాల్లో సిపిఐ కరువు యాత్ర నిర్వహించారు. యాత్ర పొలాల్లోకి వెళ్లి పత్తి పంటలను పరిశీలించి, రైతులను పరామర్శించారు. అనంతరం మీడియాతో కలవేణ శంకర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు 20 మండలాలను కరువు మండలాలుగా గుర్తించినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు అధికారుల అంచనాలకు మించి అత్యంత దయనీయంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా ఎకరానికి 6 నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉండగా, ప్రస్తుతం 12 క్వింటాళ్లు కూడా రావడం లేదన్నారు. వర్షాభావం, సాగునీరు, విద్యుత్ కొరతతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారన్నారు. కేవలం కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకోకుండా క్షేత్రస్థాయిలో రైతులకు న్యాయం చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్.అరుణ్‌కుమార్, బత్తుల గంగారెడ్డి, సిర్ర దేవేందర్, రామ్‌రెడ్డి, గేదం కేశవ్, అజయ్, రవీందర్, జైతు, తుకారాం, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.


హుస్నాబాద్/బెజ్జంకి : కరువుతో నీళ్లు లేక వరి, మక్క, పత్తి పంటలు ఎండిపోయి నష్టపోయిన ప్రతి రైతు ఎకరాకు రూ.50 వేలు పంట నష్ట పరిహారం చెల్లించాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కరువు యాత్రలో భాగంగా బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పొట్లపెల్లి, నాగారం, మహ్మదాపూర్, బెజ్జంకి మండల పరిధిలోని ముత్తన్నపేట గ్రామాల్లో కరువు పరిస్థితుల కారణంగా దెబ్బతిన్న పత్తి, వరి, మక్క పంటలను పరిశీలించారు. రైతులను కలిసి పంటల పెట్టుబడులు వేసి పంటలను వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము భాస్కర్, యెదల వనేశ్, జేరిపోతుల జనార్ధన్, శివలింగు, కృష్ణ, మాడి శెట్టి శ్రీధర్, కె.కొమురయ్య, సంజీవరెడ్డి, పిట్టల బాలయ్య, ఎల్లయ్య, బైరి శ్రీనివాస్, మౌటం బాలయ్య, బుద్ద వెంకటమల్లయ్య, ఇజ్జగిరి కిష్టయ్య, ప్రసన్నకుమార్, రాజయ్య, వెంకటరెడ్డి, నాగిరెడడి, భాస్కరచారి, సిపిఐ బెజ్జంకి మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, దొంతరవేణి మహేష్, నాయకులు బోనగిరి శ్రావణ్, రోడ్డ చరణ్, పండు పరుశురాములు, కుంబం రాములు, కుంట లక్ష్మణ్ పాల్గొన్నారు.













బుల్లెట్ టైన్ కారిడార్ సూర్యాపేట మీదుగా ఏర్పాటు చేయాలని కోరుతూ సిఎంకు వినతి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఇటీవల కేంద్ర ప్రభుత్వం శంషాబాద్ హబ్‌గా తెలంగాణ నుండి వివిధ రాష్ట్రాలకు ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యాపేట నియోజక వర్గ ఇంచార్జి ధర్మార్జున్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మార్జున్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మూడు రైల్వే కారిడార్‌లలో ఒకటిగా శంషాబాద్ టు చెన్నై వయా అమరావతి రైల్వే కారిడార్‌ను జాతీయ రహదారి 65కు సమాంతరంగా సూర్యాపేట మీదుగా అలైన్మెంట్ రూపొందించాలని సూర్యాపేటలో స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. సూర్యాపేట ప్రాంతం ఆధునిక అభివృద్ధికి రైలు మార్గం అనేది కీలకమైన అవసరమన్నారు. రెండు రాష్ట్ర రాజధానుల మధ్యలో చుట్టూ ఎనిమిది జిల్లాలకు కూడలిగా విద్యా, వ్యాపార, వైద్యపరంగా అభివృద్ధి చెందుతూ ఉందన్నారు. ట్రాన్స్‌పోర్టు రంగం మొత్తం కేవలం జాతీయ రహదారి మీదనే ఆధారపడడం మూలంగా ఇంకా ముందుకు దూసుకు వెళ్లలేకపోతుందన్నారు. రోడ్డు ప్రమాదాలతో రోడ్డు ట్రెఫర్ ఎదురుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. దాదాపు నలభై సంవత్సరాల నుండి రైలు మార్గం కోసం ఈ ప్రాంత ప్రజలు పోరాడుతున్నారని ఈ పరిస్థితిలో కేంద్రం ప్రకటించిన బుల్లెట్ రైల్ కారిడార్‌ను మొదటి సర్వే ప్రకారం సూర్యాపేట మీదుగానే ఏర్పాటు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు.

ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం

రైతుసంఘం ఆధ్వర్యంలో ఆర్డిఓకు వినతి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన గిరిజన రైతులకు ఎకరాకు 30వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ లు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పలువురు గిరిజన రైతులతో కలిసి హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలిదండ శివారు పెద్ద సీతారాం తండా గిరిజన రైతాంగం నన్న చిన్న రైతులు ఎల్29 లిఫ్ట్ ఆదారంగా వ్యవసాయం చేశారని, సంబంధిత లిఫ్టులు పనిచేయకపోవడంతో సుమారు 100 ఎకరాల పై చిలుకు పంటభూమికి నీరులేక పంట ఎండిపోవడం జరిగిందని తెలిపారు. తక్షణమే వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పొలాలన్ని పరిశీలించి గిరిజన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, రైతు సంఘం పట్టణ అధ్యక్షులు రమేష్,రైతులు దూదియ, బాణావత్ కిషన్, నాగు, బూజు, చిన్ననాగు పాల్గొన్నారు.


తుంగతుర్తిలో రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే సామేల్



ప్రజాపక్షం/తుంగతుర్తి : తాను శాసన సభ్యునిగా ఎన్నికైన తరువాత తుంగతుర్తి నియోజక వర్గంలో దాదాపు రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో సర్పంచుల పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. తుంగతుర్తి నుండి రావులపల్లి వరకు నూతనంగా ఆర్‌అండ్‌బి రోడ్డును వేయడం జరుగుతుందని దానిని తక్షణమే అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. తుంగతుర్తి సర్కిల్ పరిధిలోని పంచాయితీ రోడ్లపై డిజి లింగా నాయక్ నిర్లక్ష్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అభిష్టం మేరకు పని చేయడం ఇష్టం లేకుంటే వెళ్ళిపోవాలని హెచ్చరించారు. మండలంలో 329 ఇందిరమ్మ ఇండ్లు మంజూరి కాగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో 500 పైచిలుకు బెల్ట్ షాపులు ఉన్నాయని దీనికి యువకులు బానిసలవుతున్నారని ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో చితికి పోతున్నారని చెప్పారు. ఎక్సైజ్ అధికారులు వీటిని నియంత్రించాలని ఆదేశించారు. మండలంలో ఉన్న ప్రభుత్వ భూములపై సర్వే చేసి తనకు నివేదిక అందించాలని తహశీల్దార్ దయానందంను కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దయానందం, ఎంపిడిఓ చలపతి, పిపిసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న తోపాటు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

బ్యాంక్ తరలింపుపై గ్రామస్తుల ధర్నా

ప్రజాపక్షం/అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో 1985 నుండి ప్రజలకు సేవలందిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను మరో ప్రాంతానికి తరలించే యత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా గ్రామంలో కొనసాగుతున్న బ్యాంక్ ద్వారా రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ శాఖను వేరే ప్రాంతానికి తరలిస్తే ఇబ్బందులు అవుతాయని తక్షణమే దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయాన్ని స్వీకరించాలని సూచించారు.



ఫ్లోరోసిస్ నిర్మూలనలో తెలంగాణ భేష్

డాక్టర్ అవినాష్ భట్టాచార్య

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ చర్యలు

ఫ్లోరోసిస్ నియంత్రణ,బాధితులకు వైద్య సేవలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక మానిటరింగ్



ప్రజాపక్షం/మర్రిగూడ: ఫ్లోరోసిస్ నిర్మూలన, నియంత్రణ చర్యల్లో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే మెరుగైన ప్రగతి సాధిస్తోందని జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక మానిటర్ డాక్టర్ అవినాష్ భట్టాచార్య ప్రశంసించారు. బుధవారం మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి,ఫ్లోరోసిస్ నివారణకు చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మండలంలో నిర్వహిస్తున్న ఫ్లోరోసిస్ సంబంధిత సర్వేలు,బాధితుల కేసుల స్థితిగతులు, వారికి అందిస్తున్న వైద్య సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో చేపట్టిన ఫ్లోరోసిస్ సర్వేలు,విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలు, బాధితులకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు.అనంతరం మిషన్ భగీరథ నీటి ట్యాంకును పరిశీలించి,ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. ఫ్లోరైడ్ సమస్యను నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, సాధించిన ప్రగతి అభినందనీయమని పేర్కొన్నారు. ఫ్లోరోసిస్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, సమస్య నివారణకు నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,తహసీల్దార్ జక్కుర్తి శ్రీనివాసులు,రాంరెడ్డిపల్లి సర్పంచ్ లప్పంగి నరసింహ,పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శాలిని,డాక్టర్ దీపక్,జిల్లా ఫ్లోరోసిస్ సంబంధిత సలహాదారు డాక్టర్ ప్రవీణ్, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి అధ్యక్షుడు కంచుకట్ల సుభాష్,పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించడం అభినందనీయం :డాక్టర్ అనిమేష్ భట్టాచార్య

ప్రజాపక్షం/నాంపల్లి : మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించడం వల్ల మారుమూల తండాలలో ఫ్లోరోసిస్ సమస్య పూర్తిగా తొలగిపోవడం పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్యసంతోషం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ చాలా మంచి కార్యక్రమమని,స్వచ్ఛమైన తాగునీరు అందించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.బుధవారం ఆయన నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం రామదాస్ తండా గ్రామాన్ని సందర్శించి,ఇంటింటికీ తిరుగుతూ మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కెమికల్ కంపెనీల నుండి విడుదలయ్యే బయటకు వెళ్ళే మార్గాలను తనిఖీ చేశారు. గాల్లో కాలుష్యం శాతాన్ని పరీక్షించారు. చుట్టు ప్రక్కల పంట పొలాల వద్ద పంటలు దెబ్బతిన్న తీరులను అధికారులు పరిశీలించారు. చౌటుప్పల్ ఆర్‌డిఒ శేఖర్ రెడ్డి, తహసీల్దారు శ్రీనివాస్ రెడ్డి ,పొల్యూషన్ బోర్డు అధికారులు ఉన్నారు.



భూగర్భజలాల కలుషితం పరిశీలన

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి మండలంలో దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాలలో నడుస్తున్న రసాయన,ఫార్మా కంపనీల ద్వారా విడుదలయ్యే విషవ్యర్థాలతో భూగర్భ జలాలతో పాటు వాయు కాలుష్యం,పంట నష్టం, ప్రజల ప్రాణాలకు ముప్పు,వరుస ప్రమాదాలతో ఆందోళన చెందిన గ్రామస్తులు అధికారులకు వరుస ఫిర్యాదులు అందజేసిన నేపథ్యంలో, బుధవారం సంబంధిత శాఖా,రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చి తనిఖీ నిర్వహించి రసాయన పరిశ్రమల పరిసర ప్రాంతాలలో గోతులు తవ్వి భూగర్భజలాల కలుషితాన్ని పరిశీలించారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కెమికల్ కంపెనీల నుండి విడుదలయ్యి బయటకు వెళ్ళే మార్గాలను తనిఖీ చేశారు. గాల్లో కాలుష్యం శాతాన్ని పరీక్షించారు. చుట్టు ప్రక్కల పంట పొలాల వద్ద పంటలు దెబ్బతిన్న తీరులను అధికారులు పరిశీలించారు. చౌటుప్పల్ ఆర్‌డిఒ శేఖర్ రెడ్డి, తహసీల్దారు శ్రీనివాస్ రెడ్డి ,పొల్యూషన్ బోర్డు అధికారులు ఉన్నారు.

బియ్యం నాణ్యతలో రాజీపడొద్దు

ఎస్‌డబ్ల్యూసి గోదాంలో కలెక్టర్, ఎస్‌పి తనిఖీలు

అధికారులకు కలెక్టర్ అదేశం

ఆరు బఫర్ గోదాం హమాలీలకు లేబర్‌కార్డులు ఇప్పిస్తాం



ప్రజాపక్షం/కోదాడ: గోదాంలలో బియ్యం నిల్వలు, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అధికారులను అదేశించారు. బుధవారం కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఎస్‌డబ్ల్యూసి గొదాంను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి సందర్శించి తనిఖీలు నిర్వహించారు. గోదాంలోని బియ్యం నిల్వలు, నిర్వహణ తీరను పరిశీలించడంతో పాటు స్టాక్ రికార్డులను తనిఖీ చేసి బియ్యం నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. పరీక్ష ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యాన్ని నాణ్యత దెబ్బతినకుండా జాగ్రత్తగా నిల్వ చేయాలని, నిల్వలు భద్రత ప్రమాణాల నిర్వహణలో నిర్లక్ష్యం చేయకూడదని గోదాం మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్లలకు సూచించారు. ఫస్ట్ ఇన్ ఫస్ట్ ఆవుట్ విధానాన్ని తప్పనిసరిగా పాటిస్తూ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని అదేశించారు. అనంతరం గోదాములో పనిచేస్తున్న హమాలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు లేబర్‌కార్డులు మంజూరు చేయించాలని హమాలీలను కోరగా వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత కార్మిక శాఖ అధికారులతో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలో పనిచేస్తున్న హమాలీలందరికి లేబర్‌కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. హమాలీల ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తహసిల్దార్ సంతోష్‌కిరణ్; ఎస్‌డబ్యూసి మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్‌రెడ్డి, అరుణ పాల్గొన్నారు.

తెలంగాణామే బిజెపి నహీ ఆయేగా అమిత్ షా బాయ్ : ఎంపి చామల

కేంద్రం వైఫల్యంతోనే మూడు లక్షల మంది విదేశీయులు భారతదేశంలోకి ప్రవేశించారు



ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి: కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీరుపై భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అమిత్ షా హైద్రాబాద్‌కు వచ్చి కేవలం 'ఆయేగా... హమ్ ఆయేగా' అంటూ మాటలు చెప్పున్నారని తెలంగాణామె బీజేపీ నహీ ఆయేగా అని చామల ఎద్దేవా చేశారు. దేశంలో బీజేపి అధికారం ఉండగా మూడు లక్షల మంది విదేశీయులు భారత దేశంలోకి ఎలా అక్రమంగా ప్రవేశించారని, అది కేంద్రప్రభుత్వ వైపల్యం కాదా అని ప్రశించారు. సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్ వంటి నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందే బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని చెప్పి, పార్లమెంటు ఎన్నికలకు వచ్చేసరికి మాత్రం బీజేపీ ఎలా గెలిచిందని చామల ప్రశ్నించారు. కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన చోట, హరీష్ రావు మరియు సిరిసిల్లలో కూడా బీజేపీయే గెలిచిందని, ఇదంతా ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో ఉన్న నియోజకవర్గాలలో ఓట్లు ఎట్లా మాయమైనాయని నిలదీసిన నాయకులు, పార్లమెంట్లో కాంగ్రెస్ను అధికారంలోకి రాకుండా ఉంచేందుకే బీఆర్ఎస్ పార్టీ సహకరించిందని, అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్ లబ్ధి పొందిందని ఆరోపించారు. తెలంగాణ నుంచి ఉన్న బీజేపీ సీనియర్ నేతలు సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్లే అమిత్ షా అవాస్తవాలు మాట్లాడాల్సి వచ్చిందని, ఇకనైనా ఆయేగా...ఆయేగా... నినాదం వదిలి అభివృద్ధి గురించి మాట్లాడాలని హితవు పలికారు.

చదువు మానేసిన విద్యార్థులను బడిలో చేర్పిద్దాం

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జిల్లాలో బడి మానేసిన పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్‌తో కలిసి బాలల సంరక్షణ మరియు బలోపేతంపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యలోనే చదువు మానేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పాఠశాలలు,కళాశాలలకు హాజరుకాని పిల్లలను గ్రామాల వారీగా గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్య ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు.ప్రమాదకర వృత్తుల్లో,ఇటుక బట్టీల్లో పనిచేసే పిల్లలను గుర్తించి వారికి తగిన రక్షణ, పునరావాసం, విద్య మరియు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో విద్యార్థులు చెదు మార్గంలో వెళ్లకుండా సక్రమ మార్గంలో వెళ్లేలా చూడాలన్నారు.యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్ మాట్లాడుతూ బాలల సంరక్షణ,వారి హక్కుల పరిరక్షణ కోసం యువ నేస్తం అనే కార్యక్రమం ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని,ఈ కార్యక్రమం ద్వారా చెడు మార్గంలో వెళ్లే పిల్లలను గుర్తించి సూచనలు చేస్తూ పునరావాసం కల్పించి వారి జీవితాలను నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని కోరారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,అదనపు ఎస్పి రమేష్,శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి లావణ్య,డీఈఓ సుశీందర్ రావు,డీఐఈఓ దస్రు నాయక్, డీపీఓ తరుణ్ చక్రవర్తి,డీవైఎస్ఓ అక్బర్ అలీ, ఆర్‌సివోలు,డీసీవో,సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జూనియర్ బాలుగా గుండెపురి

ఉపేంద్రా చారి గానానికి ఉభయ రాష్ట్రాల జేజేలు

ఉభయ తెలుగు రాష్ట్రాల పాటల పోటీలో ప్రథమ బహుమతి



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన గుండెపురి ఉపేంద్రా చారి వేదిక ఏదైనా... పాట ఏదైనా తన గాత్రంతో గాన గాంధర్వుడిగా పేరొందిన సినీ గాయకుడు బాలసుబ్రహ్మణ్యాన్ని తలపించేలా చేస్తూ సూర్యాపేట జూనియర్ బాలుగా గుర్తింపు పొందాడు. ఏ పాటనైనా అవలీలగా శృతి లయబద్ధంగా ఆలపిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలతో జేజేలు అందుకుంటున్నారు. వేలాది మంది ప్రేక్షకుల ఎదుట అదరకబెదరక ఎంతో 'గుండె' ధైర్యంతో తనదైన శైలితో ఆలపిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు. సూర్యాపేట మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఉపేంద్రా చారి చిన్ననాటి నుండే పాటలపై మక్కువతో ఏ గేయాన్ని అయినా అవలీలగా పాడుతూ అందరిని మంత్ర ముగ్దులను చేస్తూ వస్తున్నారు. పాటలపై ఉన్న మక్కువతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ పాటల పోటీలు జరిగినా అక్కడికి వెళ్ళి తన ప్రతిభను చాటుతూ ఎన్నో అవార్డులను సొంతం చేసుకోవడంతో పాటు సూర్యాపేటకే ఓ గుర్తింపు తెస్తున్నాడు. ఇటీవల కాలంలో ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీభక్తరామదాసు స్టేజీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల పాటల పోటీలో ఆయన పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి పురస్కారాన్ని అందుకున్నారు. బాలభవన్‌లో సంగీత మాస్టర్‌గా పనిచేస్తున్న రాచర్ల అనిల్ కుమార్ తన గురువని చెప్పుకొచ్చారు. అతని వద్ద శిష్యరికం చేయడంతోనే పాటల పోటీలలో రాణిస్తున్నానని స్పష్టం చేశారు. జీవన గమనంలో ఉపేంద్రా చారి తన గాత్రంతో ప్రేక్షకులకు మరింత దగ్గరై వారి మన్ననలు పొందాలని ఆశిద్దాం.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

వైద్య సిబ్బందిని ఆదేశం



ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పిహెచ్‌సి) సాధారణ ప్రసవాల సంఖ్యను గణనీయంగా పెంచాలని, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో తగినన్ని వసతులు ఉన్నప్పటికీ సాధారణ ప్రసవాలు తక్కువగా జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనే ప్రసవాలు జరిగేలా గర్భిణులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఆన్లైన్ నమోదు, అభా కార్డులు, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని, అందరికీ 'అభా' రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు, బాలింతలతో నేరుగా మాట్లాడి హిమోగ్లోబిన్ శాతాన్ని, మందుల పంపిణీని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి మనోహర్ మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారాన్ని అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, హాజరు శాతంతో పాటు వసతి సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంతరం కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి లక్ష్యాలు, పాఠశాలలోని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వాతావరణ మార్పులు ఎలోనినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటి వినియోగంతో అధిక ఆదాయం ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. బుధవారం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామం లో రైతు మహేందర్ రావుకు చెందిన 15 ఎకరాల మునగ తోటను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగు విధానం, దిగుబడి, మార్కెటింగ్ అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు మహేందర్ రావు మాట్లాడుతూ, ఎకరాకు మూడేళ్లలో 6,600 కిలోల ఎండిన మునగ ఆకుల దిగుబడి వస్తుందని, కిలో రూ.100 చొప్పున సుమారు రూ.6.60 లక్షల ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

మహిళలను వేధిస్తున్న యువకుడు అరెస్ట్

ప్రజాపక్షం/తుర్కపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం, రుస్తాపూర్ గ్రామానికి చెందిన వంగూరి చందు(23) అనే యువకుడు గత కొన్ని రోజులుగా ఒక మహిళను వేధిస్తూ, ఆమె వెంటపడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఈ వేధింపులు భరించలేక బాధిత మహిళ తుర్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని ఎస్సై శివకృష్ణ తెలిపారు. ఈ క్రమంలో బుధవారం నిందితుడు వంగూరి చందును అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగిందని శివకృష్ణ తెలియజేసారు. మహిళలు, బాలికలను వేధించడం, వెంటపడటం, మహిళలకు సంబంధించిన ఇతర నేరాలకు పాల్పడే వారిపై పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, బాలికల పట్ల ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఎస్సై ప్రజలకు సూచించారు.

పంటలకు నీరు లేక రైతుల ఆందోళన

ప్రజా పక్షం/ఖానాపూర్ ఃఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామపం చాయతీ పరిధిలో సాగునీటి విషయంలో రైతులు, మత్స్యకారుల మధ్య వివాదం చెలరేగింది. పంట పొలాలకు వెళ్లాల్సిన నీటిని అడ్డుకట్ట వేసి చేపల కుంటకు మళ్లించడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.డి 27 కాలువ యొక్క ఉప కాలువ ద్వారా బీర్నంది గ్రామపంచాయతీ పరి ధిలోని పంట పొలాలకు సాగునీరు వెళ్తుంది. అదే పంచాయతీ పరిధిలో భాగయ్య చెరువు ఉంది.ఈ కుంటలో మత్స్యకారులు చేపలను పెంచుతు న్నారు. కుంటలో నీరు తగ్గిపోవడంతో కొంతమంది మత్స్యకారులు ఉప కాలువకు అడ్డుకట్ట వేశారు. అడ్డుకట్ట దగ్గర గండి కొట్టి పిల్ల కాలువ ఏర్పాటు చేసి,ఆ నీటిని భాగయ్య కుంటలోకి తీసుకువెళ్లారు.డి27 కాలు వలో నీరు ఉన్నా,తమ పొలాలకు నీరు రాకపోవడంతో అనుమానం వచ్చిన రైతులు ఉప కాలువ వెంట వెతుకుతూ వెళ్లారు.పై అధికారులు వెంటనే స్పందించి అడ్డుకట్టను తొలగించి తమ పొలాలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో రైతులు,మత్స్యకారుల మధ్య ఘర్షణ జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ కార్యక్ర మంలో రైతులు గోపు నర్సయ్య,కిషన్ నగర్ ఎల్లయ్య,పీలి రాజేష్,సపిలి విష్ణు,కుర్ర శ్రీను,వడ్ల గట్ల శంకర్,తదితరులు ఉన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/భైంసా ఃమాటేగాం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశిం చారు.బుధవారం భైంసా మండలం మాటేగాం గ్రామంలో కలెక్టర్ పర్య టించి,డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుపై సంబంధిత అధికారులతో సమీ క్షించారు.ఇళ్లకు సంబంధించి న రికార్డులు,లబ్ధిదారుల వివరాలను పరిశీ లించి,ప్రభుత్వ నిబంధనల ప్ర కారం అర్హులను గుర్తించాలని సూచిం చారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా ఇళ్ల కేటా యింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.అనంతరం భైంసా పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ కార్యా లయాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు.స్థల విస్తీర్ణం,ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి,తదుపరి చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ పర్యటనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,హౌసింగ్ పిడి శ్రీనివాస్,తహసీల్దార్ శశిభూ షణ్,ఎంపిడిఒ నీరజ్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నిర్మల్ జిల్లా క్రీడాకారుల ఎంపిక!



ప్రజాపక్షం/నిర్మల్ టాన్ ఃరాష్ట్రస్థాయి పిఎం శ్రీ అండర్17 కబడ్డీ పో టీల్లో పాల్గొనేందుకు నిర్మల్ జిల్లా నుంచి ఎంపికైన పిఎం శ్రీ పాఠశాలల విద్యార్థినీ,విద్యార్థులు బుధవారం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో నవంబర్ 5, 6 తేదీల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు.ఈ పోటీల్లో జిల్లా తరపున పాల్గొనే క్రీడాకారులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ యూనిఫామ్‌లను అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావా లని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సెక్టో రల్ అధికారి నరసయ్యతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, అంబాజీ, రమణారావు,పోశెట్టి, దేవేందర్,జమున,రాధిక, పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలి

కలెక్టర్ కుమార్ దీపక్




ప్రజాపక్షం/మంచిర్యాలఃప్ర భుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థు లకు మెరుగైన వసతులు కల్పించి, అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం భీమిని మండలంలోని కస్తూరిబా పాఠశాలలో అదనపు తరగతి గదులు, భోజనశాల పనులను పరిశీలించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్య మైన భోజనం అందించాలన్నారు. అనంతరం మల్లిడిలో ఇందిరమ్మ ఇళ్లు, విఒ భవన నిర్మాణాలు, ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యా ప్రమా ణాలు పెంచాలని సూచించారు. తర్వాత కన్నెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూరిబా పాఠశాల, రైతు వేదికలో ఉపాధి హామీ శిక్షణ కార్యక్ర మాన్ని పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. భీమిని తహసిల్దార్ బికర్ణదాస్, కన్నెపల్లి ఎంపిడిఒ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఆర్ సర్వే, భూముల క్రమబద్ధీకరణ

అదనపు కలెక్టర్ రాములు

ప్రజాపక్షం/మందమర్రిఃజిల్లాలో కొనసాగుతున్న ఆర్ సర్వే పనులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఆదేశించారు. బుధవారం మందమర్రి మండలంలో జరుగు తున్న ఆర్ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మం డల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వి.రాములు మాట్లాడుతూ జిఒ నంబర్లు 58, 59, 76 కింద చేపడుతున్న భూముల క్రమబద్ధీకరణ పురోగతి, ఎస్ఐఆర్ ప్రక్రియ ను వేగవంతం చేయాలన్నారు. భూ భారతి దరఖాస్తులు, మీసేవ ద్వారా రావాల్సిన పెండింగ్ ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజ లకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తహసి ల్దార్ సతీష్ కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



పకడ్బందీగా పుష్కరాలకు ఏర్పాట్లు

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ ఃరానున్న గోదా వరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కరాల నాటికి అన్ని అభివృద్ధి, నిర్మాణ పనులను పూర్తి చేయా లని స్పష్టం చేశారు.బుధవారం బాసరలోని ఆల య ఈవో కార్యాలయంలో పుష్కరాల ఏర్పాట్లు, సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పుష్కర ఘా ట్ల మరమ్మతులు, నూతన ఘాట్ల నిర్మాణం, మ రుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పిం డ ప్రదాన ప్రాంతం, పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రం, భక్తుల పార్కింగ్, వీఐపీ పార్కింగ్ తది తర పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయా లని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించా లని,పుష్కరాలకు వచ్చే ప్రముఖుల వసతికి త గిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి ప నికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొం దించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.అనం తరం సరస్వతీ అమ్మవారి ఆలయ నిర్మాణ ప నుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.పుష్కరాల ఏర్పాట్లు, ఆలయ నిర్మాణ పనులను సంబంధిత శాఖల అధికారులు నిరం తరం పర్యవేక్షిస్తూ, పనుల పురోగతిపై ఎప్పటిక ప్పుడు సమీక్షించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ సుభాష్, ఉ ద్యానవన శాఖ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్

ప్రజాపక్షం/మంచిర్యాలఃజాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, కాం ట్రాక్టు పద్ధతి రద్దు చేసి వారిని క్రమబద్ధీకరించాలని ఎఐటి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి మేక ల దాసు డిమాండ్ చేశారు. మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న ఉద్యోగులకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు తెలిపింది.ఏళ్ల తరబడి సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత లేక కార్మికులు ఇబ్బం దులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం, 100 శాతం గ్రాస్ శాలరీ, పెండింగ్ ఇంక్రిమెంట్లు, పిఆర్ సి బకాయిలు, లాయ ల్టీ బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. 6వ తేదీలోపే వేతనాలు ఇవ్వాలని, ప్రసూతి సెలవులు, ఈహెచ్ఎస్, ఈఎస్ఐ బీమా కల్పించాలన్నారు. చనిపోయి న ఉద్యోగి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు ఉద్యోగం ఇ వ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటి యుసి నాయకులు పాలు, అఫ్రోజ్ ఖాన్, సత్యనారాయణ పాల్గొన్నారు.



రూ.40వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి దొరికిన ఎస్ఐ రమేష్



ప్రజాపక్షం/ఆదిలాబాద్: ఒక కేసు విషయంలో బాధితుడి నుంచి రూ. 40వేలు లంచం తీసుకుంటుండగా బజార్‌హత్నూర్ ఎస్ఐ రమే ష్‌ను ఎసిబి అధికారులు బుధవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసులో అనుకూలంగా ఉండేందుకు రూ.50వేలు డిమాండ్ చేయగా, బాధితుడు ఎసిబిని ఆశ్రయించారు. ఎసిబి డిఎస్పి ఆధ్వర్యంలో వల పన్ని ఎస్ఐని పట్టుకుని స్టేషన్‌లో సోదాలు నిర్వహించారు. అధికా రులు లంచం అడిగితే ఎసిబిని సంప్రదించాలని డిఎస్పి సూచించారు.

డంపింగ్ యార్డు సందర్శించిన కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్ ఃఇంటింటికి తిరుగు తూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా ప ర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచిం చారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ బుధవారం సందర్శించారు. నగరపాలక సంస్థ పరిధిలో రోజువారిగా ఇంటింటికి తిరిగి సే కరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిల్వ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారిగా వేరు చేస్తూ ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగ టున 600 మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ జరుపుతుండగా దానిని వెయ్యి మెట్రిక్ టన్నులకు పెంచాలని కలెక్టర్ సూచించారు. డంపింగ్ యార్డు ప్రాంతంలో ఖాళీ స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పచ్చదనం పెంపొందించాలన్నారు.

రోడ్లపై పశువులకు వదిలితే కేసులు నమోదు

రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించ కుండా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశిం చారు. డంపింగ్ యార్డుతో పాటు ప్రధాన రహదా రులపై ఆవులు, ఇతర పశువులు ఎక్కడబడితేఅ క్కడ సంచరిస్తుండటంతో గమనించి కలెక్టర్ అధి కారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై పశువు లను వదిలితే కేసులు నమోదు చేయాలని, జరిమా నాలు విధించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్ అధి కారులున్నారు.

బాలసదన్‌లో బాలలకు 'న్యాయ అవగాహన'

జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి సౌజన్య



ప్రజాపక్షం/సంగారెడ్డి ఃజాతీయ న్యాయ సే వా దినోత్సవం వారోత్సవ కార్యక్రమాల్లో భా గంగా బుదవారం సంగారెడ్డిలోని బాలసదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ,సీని యర్ సివిల్ జడ్జి బి. సౌజన్య న్యాయ అవగా హన కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రతి బాలు డు ,బాలికకు సమాన హక్కులు ,గౌరవం, రక్ష ణ, నాణ్యమైన విద్య పొందే హక్కు ఉందని తెలి పారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోందని వివరిం చారు. బాగంగా బాలలకు ఈ విషయాలపై అవ గాహన కల్పించారు. మొదటిది బాలల హక్కు లు ,వాటి పరిరక్షణ, రెండవది బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ,బాల్యవివాహాల నిషేదం ,బాలలపై లైంగిక వేదింపుల నిరోదక చట్టం పోక్సోచట్టంపై ,బాలలపై జరిగే శారీరక ,మాని సిక వేధింపులు ,వాటి నివారణ, విద్యాహక్కు ,బాలల సమగ్ర అభివృద్ధి ,బాలల అక్రమ ర వాణా ,దోపిడి, ఇతర అసాంఘీక కార్యకలపాల నుంచి రక్షణ , బాలలు ఎదుర్కొనే సమస్యలను సంబందిత అదికారులకు తెలియజేసి విదానం, ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలు, గురించి వివరించారు. పిల్లలు , తమ హక్కుల గురించి తెలుసుకోవాలని ఏలాంటి వేదింపులు ,అన్యాయం జరిగినా భయపడకుండా సంబం దిత అధికారులకు ఉపాద్యాయులకు ,బాలల సంరక్షణ అధికారులకు తెలియజేయాలని సూచించారు.న్యాయపరమైన సహాయం అవస రమైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలి పారు. జాతీయ న్యాయ సేవాదినోత్సవ వారోత్స వాల సందర్భంగా ప్రజలకు ముఖ్యంగా బాల లకు చట్టాలపై అవగాహన కల్పించడం న్యా యం అందరికి చేరువ చేయడం ఉచిత న్యాయ సేవాలపై చైతన్యం పెంపొందించడం ఈ కార్య క్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

అర్హులైన పేదింటి ఆడబిడ్డలకు.. అండగా ప్రజాప్రభుత్వం



ప్రజాపక్షం/ఆర్మూర్ ఃప్రజాపాలన ప్రభుత్వంలో అర్హులైన పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిదారు లకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు.ఆర్మూర్ పట్టణంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పైడి రాకే ష్‌రెడ్డి లబ్ధిదారులకు ఆయా గ్రామాల సర్పంచ్‌ల సమక్షంలో అందజేశారు. మొత్తం 108 మంది లబ్ధిదారులకు కోటి 8 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో ఆర్థిక సాయమందిస్తోందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డె, తహసీల్దాన్ నడిమెట్ల సత్యనారాయణ, డిప్యూటీ తహసీ ల్దార్ సుజాత, సర్పంచ్‌లు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



కలెక్టర్ హరిత

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ఃజిల్లాలో తాగునీ టికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతిరోజూ సరఫరా చేసే వి ధంగా పక ర్చందీ చర్యలు తీ సుకోవాలని జిల్లా కలె క్టర్ కె. హ రిత అధికారులను ఆదేశిం చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సము దాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇంట్రా గ్రిడ్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి క్రమం తప్పకుండా తాగు నీటిని అందించాలని, ఎక్కడా సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వ హించాలని ఆదేశించారు. గ్రామాల్లోని ప్రతి బోరు, సింగిల్ ఫేజ్ మోటారు, ఓవర్ హెడ్ ట్యాంకులు, గ్రిడ్ పైప్‌లైన్ పనులను క్షేత్రస్థా యిలో పరిశీలించి, మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యలు రాకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

'ఖానాపూర్' కోర్టుకు రెగ్యులర్ జడ్జిగా నిఖిత నియామకం



ప్రజా పక్షం/ఖానాపూర్ ఃఖానాపూర్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిగా నూతనంగా నియమితులైన గౌర వనీయ న్యాయమూర్తి బి.సి. నిఖితకి ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు మట్టేరి రాజశేఖర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మర్యాద పూర్వకంగా నూతన న్యాయమూర్తిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఖానా పూర్ కోర్టులో గత దాదాపు రెండున్నర సంవత్సరా లుగా రెగ్యులర్ జడ్జి లేకపోవడంతో ఇంచార్జి జడ్జి ఆధ్వర్యంలో వారానికి కేవలం ఒక రోజు మాత్రమే కోర్టు విధులు నిర్వహించబడేవి.దీంతో న్యాయవా దులు,కక్షిదారులు,సామాన్య ప్రజలు అనేక ఇబ్బ ందులు ఎదుర్కొంటున్నారు.నూతనంగా ఎన్నికైన ఖానాపూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు పలుమార్లు హైదరాబాద్‌కు వెళ్లి హైకోర్టు న్యాయ మూర్తులను, నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసి ఖానాపూర్‌కు రెగ్యులర్ జడ్జిని నియమించా లని వినతిపత్రాలు సమర్పించారు.ఈ క్రమంలో ఇటీవల జరిగిన న్యాయమూర్తుల బదిలీల్లో భాగంగా ఖానాపూ ర్ కోర్టులో ఇన్‌చార్జి జడ్జిగా విధులు నిర్వహిస్తున్న బి.సి. నిఖిత ని పూర్తి స్థాయి (ఫుల్ ఛార్జ్) రెగ్యులర్ జడ్జిగా నియమిస్తూ ఉత్త ర్వులు జారీ కావడంతో ఖానాపూర్ న్యాయవా దులు ఆనందం వ్యక్తం చేశా రు.రెగ్యులర్ జడ్జి నియామకంతో ఇకపై ఖానాపూర్ కోర్టులో న్యాయ పరమైన కార్యకలాపాలు సక్రమంగా, నిరంతరా యంగా కొనసాగడంతో పా టు కక్షిదారులకు సత్వర న్యాయం అందుబాటులోకి వస్తుందని ప్ర జలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.బార్ అధ్యక్షు లు మట్టేరి రాజశేఖర్,ఎజిపి అసిఫ్ అలీ, జా యింట్ సెక్రటరీ బాశెట్టి శివ, సీనియర్ న్యాయవా ది వెంకట్ మహేంద్ర, రాజురా సత్యం,కమలాకర్, ప్రశాంత్ రెడ్డి,ఎక్సిక్యూటివ్ మెంబర్లు షబ్బీర్ పా షా,షేఖ్ ఖదీర్,రాచమల్ల అశోక్, పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ. లక్షల విలువైన బంగారం, కారు స్వాధీనం



ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : పగటిపూట తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా వరుస చోరీలకు పా ల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టును నిజామాబాద్ పోలీసులు రట్టుచేశారు. వివరా ల్లోకి వెళ్తే నిందితులు ముగ్గురు మహారాష్ట్రలోని బుల్దానా జిల్లా, జవహర్ నగర్‌కు చెం దిన వారుగా వివరాలను నిజామాబాద్ పోలీస్ కమి షనర్ సాయి చైతన్య బుధవారం కమాండ్ కం ట్రోల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించా రు. ముఠా ప్రధాన సూత్రధారి సయ్యద్ షకీల్ పాన్ షాప్ వ్యాపారం ముసుగులో చోరీలు చేస్తుంటాడు. గతంలో వరంగల్, నిర్మల్, యాదాద్రి, కర్ణాటక, మహా రాష్ట్రలో చోరీ కేసుల్లో జైలుకు వెళ్లాడు. షేక్ అహ్మద్ అలియాస్ రాజు పండ్ల వ్యాపారి, షేక్ ఇమ్రా న్ భిక్షాటన చేస్తుంటాడు. నింది తుల నుండి మొత్తం 80 గ్రాముల బంగారు ఆభ రణములు, 25 తులాల వెండి ఆభరణములు, రూ. 5 వేల నగదు, చోరీలకు ఉపయోగించిన హోండా సిటీ కారు, మూడు నకిలీ నెంబరు ప్లేట్లు, ఇనుప రాడ్లు స్వాధీనం చేసుకున్నారు. 11 కేసుల్లో నేరం నవీపేట్ పోలీస్ స్టేషన్ పరి ధిలో అక్టోబర్ 4న జరిగిన చోరీ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ఈ ముఠాను నవీపేట ఏరి యాలో బుధవారం ఉదయం 11 గంటలకు పట్టుకున్నారు. నిర్మల్‌జిల్లా ముథోల్, బాసర, యాదాద్రి భువనగిరి ఆలేర్, కరీంనగర్ చొప్ప దండి సహా 11 చోరీ కేసుల్లో తమ ప్రమేయం ఉందని ఒప్పుకున్నారు. సయ్యద్ షకీల్ నకిలీ నెంబరు ప్లేట్లతో కారులో వచ్చి ఒక్కడే ఇంట్లోకి వెళ్లి తాళం పగలగొట్టి చోరీ చేస్తాడు.కేసును ఛేదించిన ఎసిపి బి. ప్రకాష్ యాదవ్, నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ శ్రీనివాస్, నవీ పేట్ ఎస్ఐ కె. శ్రీకాంత్, సిసిఎస్ ఎసిపి పి. శ్రీశైలం, సిఐ అజయ్ కుమార్ తదితర సిబ్బం దిని సిపి అభినందించారు.

'ఎల్ నినో'తో తాగునీటి ఎద్దడికి ముందస్తు కార్యాచరణ

కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/మెదక్ : ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకా శం ఉన్నందున ప్రజలకు నీటి భద్రత కల్పించేందుకు ముం దస్తు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. హవేళి ఘన్‌పూర్ మండలం సర్దన గ్రామంలోని చెక్‌డ్యామ్‌ను సంబంధిత అధికారు లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.డిసెంబర్ తర్వాత సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం ప్రభుత్వం మెదక్ జిల్లాకు రూ.42 కోట్లు మంజూరు చేసిందని తెలి పారు. సర్దన చెక్‌డ్యామ్ వద్ద ప్రత్యేక గ్రిడ్ ఏర్పాటు చేసి, 3.5 కిలోమీటర్ల పైప్ లైన్ ద్వారా జక్కన్నపేటకు నీటిని తరలించనున్నట్లు వివరించారు. ఈ వ్యవ స్థతో 33 గ్రామాలకు రోజుకు ఒక్కొక్కరికి 55 లీటర్ల చొప్పున తాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని, నిరుపయోగంగా ఉన్న నల్లాల ద్వారా నీటి వృథాను అరికట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, తహసీల్దార్ సింధు రేణుక, సర్పంచ్ వినోద, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
గురువారం
05-11-2026
www.prajapaksham.in

ఈ నగరానికి ఏమైంది' సినిమాలోని క్రేజీ గ్యాంగ్ మళ్లీ కలుసుకోబోతున్న సమయం ఆసన్నమైయింది. ఈ కల్ట్ సినిమాకు సీక్వెల్గా రూపొందుతున్న 'ఈఎన్ఈ రిపీట్' నవంబర్ 19న విడుదల కానుంది.





కిషోర్ మూవీ మేకర్స్' బ్యానర్పై నిర్మాత ఎన్.ఎన్. కిషోర్ నిర్మిస్తున్న తొలి చిత్రం ప్రొడక్షన్ నెంబర్ 1 ఘనంగా ప్రారంభమైంది.

'కిషోర్ మూవీ మేకర్స్' సినిమా షూటింగ్ ప్రారంభం

బుధవారం హైదరాబాద్లోని రామానాయుడు స్టూడియోలో సినీ ప్రముఖులు, అతిథుల సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి. వినాయక్, ప్రామిసింగ్ హీరో ఆది సాయికుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేయడంతో ప్రారంభోత్సవ వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వి.వి. వినాయక్ చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందజేశారు. ముహూర్తపు షాట్కు నిర్మాత ఎన్.ఎన్. కిషోర్ క్లాప్ కొట్టారు. ఆది సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు ప్రముఖ నిర్మాత మల్కాపురం శివకుమార్, సిద్ధు రెడ్డి, చీకోటి ప్రవీణ్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. .కన్నడ చిత్రం 'కేజీయఫ్'లో యశ్ తల్లిగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న అర్చనా జోయస్ హీరోయిన్గా నటిస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'అమీతుమీ' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అతిథి మైకల్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : కె.కె. రావు, సంగీతం : సుధా శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : శ్రీనివాస్ కె. నాయుడు, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ : ఆర్.వి. రామకృష్ణ, పిఆర్ఓ : జికె మీడియా (గణేష్, కుమార్).

'ఈఎన్ఈ రిపీట్' ఫ్యామిలీతో కలిసి చూడండి



ట్రైలర్ లాంచ్లో దర్శకుడు తరుణ్ భాస్కర్

ఈ నగరానికి ఏమైంది' సినిమాలోని క్రేజీ గ్యాంగ్ మళ్లీ కలుసుకోబోతున్న సమయం ఆసన్నమైయింది. ఈ కల్ట్ సినిమాకు సీక్వెల్గా రూపొందుతున్న 'ఈఎన్ఈ రిపీట్' నవంబర్ 19న విడుదల కానుంది. తరుణ్ భాస్కర్ ధాస్యం రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సీక్వెల్లో విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి మరోసారి కలిసి నటిస్తున్నారు. ఎస్ ఒరిజినల్స్, రూట్నోడ్ సినిమా బ్యానర్లపై సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ పెళ్లి చూపులు విజయం తర్వాత ఎలాంటి సినిమా చేయాలని ఆలోచిస్తున్నప్పుడు, నా జీవితంలో ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా సరే, నా చుట్టూ ఎప్పుడూ నలుగురు స్నేహితులు నన్ను అంటిపెట్టుకుని ఉండేవారు. అలాంటి ఫ్రెండ్షిప్ గురించి సినిమా చేస్తే బాగుంటుందని చేసిన సినిమానే ఈ నగరానికి ఏమైంది. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్ చేస్తున్నప్పుడు కూడా మా కాంపిటీషన్ మళ్లీ ఆడియన్సే. ప్రేక్షకుల అంచనాల గురించే నాకు భయం ఉంది. దీనికి ఎలాంటి ట్రైలర్ కట్ చేయాలని ఆలోచిస్తున్నప్పుడు, ఈ నగరానికి ఏమైంది సినిమాకు ఒక ఎపిక్ వెర్షన్లా ఉండాలని రూపొందించిన ట్రైలర్ ఇది. మీరందరూ ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా రండి. థియేటర్లలో చాలా ఎంజాయ్ చేస్తారు అని అన్నారు. హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ ఈ ట్రైలర్ చూసినప్పుడు నిజంగా ఒక అద్భుతంలా అనిపించింది. నవంబర్ 19న నా సినిమా రిలీజ్ అవుతుంది. చాలా గర్వంగా వరల్ వైడ్ రిలీజ్ అని చెప్పుకునే సినిమా ఇది. తరుణ్ ప్రాణం పెట్టి సినిమా చేశారు. ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని తీసిన సినిమా ఇది అని చెప్పారు. శ్రీనాథ్ మాగంటి, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను, అనిషా, శివాత్మిక, నిర్మాత సృజన పాల్గొన్నారు.

'ధర్మన్'లో రజనీకాంత్ సరసన శ్రీలీల

సూపర్స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. హీరోయిన్ శ్రీలీలకు స్వాగతం పలుకుతూ, ఆమెను సరికొత్త, ఆకట్టుకునే అవతార్లో పరిచయం చేసే గ్లింప్స్ను విడుదల చేశారు. రాక్స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన క్లాసికల్ మ్యూజిక్ ఆమె పరిచయ సన్నివేశాలకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. ఆమె పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ షీ ఈజ్ ది స్పార్క్ అండ్ షీ ఈజ్ ది పటాకా ''అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ ఇచ్చారు. దీంతో సినిమాలో శ్రీలీల పోషించబోయే పాత్ర ఎంతో సందడిగా ఉండబోతోందనే సంకేతాలు ఇచ్చారు. రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లపై కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్తో ఈ సినిమా మంచి క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. ఇందులో రజనీకాంత్ 'ది డెడ్లీ డాక్టర్' అనే మిస్టీరియస్ డాక్టర్ పాత్రలో కనిపించారు. ఈ చిత్రంలో నయనతార కూడా నటిస్తున్నారు. ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్లో అన్బరివ్ యాక్షన్ సీక్వెన్సును పొందిస్తున్నారు. సూపర్స్టార్ రజనీకాంత్, సరసన నయనతారతో పాటు శ్రీలీల మరో హీరోయిన్గా నటిస్తోంది.

'గీతా ఆర్ట్స్' అలవాటును ధీరజ్ అనుసరించారు



'సమ్మర్ హాలిడేస్' ఈవెంట్లో అల్లు అరవింద్

సమ్మర్ హాలిడేస్ నిర్మాత ధీరజ్ నాతో పాటు సినిమాలు చేశాడు. ఈ సినిమా బాగా వచ్చిందని విన్నాను. సరిగ్గా లేని సీన్స్ మళ్లీ తీసుకోవడం గీతా ఆర్ట్స్లో అలవాటు. అదే ధీరజ్ ఫాలో అయ్యాడు అని ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. డైరెక్టర్ శ్రీకర్ ఈ సినిమాను ఆకట్టుకునేలా తెరకెక్కించాడని విన్నాను. ఇలాంటి మంచి చిత్రాలను సపోర్ట్ చేసేందుకు హీరో కిరణ్ అబ్బవరం రావడం ప్రశంసనీయం. ఏదో చిన్న సినిమా అనుకోకుండా చాలా మంది దర్శకులు అతిథులుగా వచ్చి తమ బ్లెస్సింగ్స్ ఇచ్చారు. ఈ సినిమాను మీరంతా థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయబోతున్నారుఅని అన్నారు. బాలల చిత్రంగా తెరకెక్కించిన 'సమ్మర్ హాలిడేస్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. నిర్మాత అల్లు అరవింద్, హీరో కిరణ్ సబ్బవరం అతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఈ జనరేషన్ చాలా ఫాస్ట్గా ఉన్నారు. మనమంతా లైఫ్లో చాలా బిజీగా గడిపేస్తున్నాం. కానీ ఎంత డబ్బున్న వారైనా ఒక్క ఏడాది వ్యవసాయం చేస్తే మన లైఫ్లో ఎంతో ప్రశాంతత వస్తుంది. ఈ సినిమా కంటెంట్ చూస్తున్నంత సేపు మనకు తెలియని ఎమోషన్స్ కనెక్ట్ చేస్తున్నారు అనిపించింది. ఈ సినిమా మనం మర్చిపోయిన జ్ఞాపకాలను గుర్తుచేసేలా ఉంది. ఈ సినిమా ద్వారా మనల్ని , మన అమ్మమ్మ ఊరికి తీసుకెళ్తారని నమ్ముతున్నాను. ప్రొడ్యూసర్ ధీరజ్ అన్న నమ్మకం నిజం కావాలి. ఆయనకు ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలి. ఈ దీపావళికి సమ్మర్ హాలిడేస్ సినిమాకు థియేటర్స్కు వెళ్లండి. ప్రేక్షకులంతా చిన్న పిల్లలైపోయి సినిమాను ఎంజాయ్ చేస్తారని అన్నారు. ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై 'సమ్మర్ హాలిడేస్' అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 6న సినిమా థియేట్రికల్ రిలీజ్ కానుంది. ధీరజ్ మొగిలినేని ఈ సినిమాను నిర్మించారు. ఈ ఈవెంట్లో దర్శకులు బాబీ, రవీంద్ర తో పాటు చిత్రంలో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.



'ఓం: చాప్టర్ 1'..నవంబర్ 20న విడుదల

పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'ఓం: చాప్టర్ 1 రుధిరం: ది బ్లడ్ వుడ్' సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సితార ఎంటర్టైన్మెంట్స్ సిద్ధమైంది. నవంబర్ 20న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేయనుంది. జాతీయ అవార్డులు అందుకున్న వెర్సటైల్ స్టార్ ధనుష్, మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న ఈ సినిమాలో సాయి పల్లవి, శ్రీలీల, నజీరుద్దీన్షా, ఇంద్రన్స్, చైతు జొన్నలగడ్డ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అమరన్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ రాజ్కుమార్ పెరియసామి ఈ చిత్రానికి కథ అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు మ్యూజిక్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఎళిల్ అరసు కె. సినిమాటోగ్రాఫర్గా, ఆర్. కళైవానన్ ఎడిటర్గా, ఎ. పన్నీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్గా పనిచేస్తున్నారు. యానిక్ బెన్, కేచా కంపక్డీ యాక్షన్ కొరియోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.వండర్బార్ ఫిల్మ్స్, ఆర్టేక్ స్టూడియోస్ బ్యానర్పై ధనుష్, శ్రద్ధా అగర్వాల్, అజ్మత్ జగ్మగ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.తెలుగు ప్రేక్షకులకు వైవిధ్యమైన సినిమాలను అందించడంలో ముందుండే సితార ఎంటర్టైన్మెంట్స్ గతంలో 'లోకా: చాప్టర్ 1 చంద్ర', రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' చిత్రాలను తెలుగులో డిస్ట్రిబ్యూట్ చేసి మంచి విజయాలను అందుకుంది. ఇప్పుడు 'ఓం: చాప్టర్ 1' సినిమాతో మరో భారీ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుంది.

విజయ్ సేతుపతి నుదుటిపై గన్ పెట్టిన టబు



తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన హీరోయిన్ టబు చాలా కాలం తరవాత తిరిగి తెలుగు తెరపై కనిపిస్తోంది. దర్శకుడు పూరి జగన్నాథ్ తెరకెక్కించిన 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్' సినిమాలో టబు పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తోంది. ఒక కేసులో విచారణకు తీసుకొచ్చిన హీరో విజయ్ సేతుపతి నుదిటిపై గన్ పెట్టింది. ఇంతకీ విజయ్ సేతుపతి చేసిన తప్పేంటి? టబు ఎందుకు గన్ పెట్టింది. అసలు ఎం జరిగింది అనేది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే అని అంటున్నాడు పూరి జగన్నాథ్. డైనమిక్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి పాన్ఇండియా యాక్షన్ డ్రామా 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్' షూటింగ్ పూర్తయింది. ఇటీవల హైదరాబాద్లో జరిగిన షూటింగ్తో ఈ చిత్రం పూర్తయింది. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యాన్స రూపొందిస్తున్నారు. పవర్ ఫుల్ కథలు, తనదైన స్క్రీన్ ప్రజెంటేషన్తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూరి జగన్నాథ్, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఈ చిత్రంలో సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, టబు, దునియా విజయ్, జరీనా వహాబ్, బ్రహ్మాజీ, వీటీవీ గణేశ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ బాధ్యతలను సామ్ కె. నాయుడు నిర్వహిస్తుండగా, హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. సంతోష్ నూజిల్లా ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు.తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు.

వరుస వివాదాలు..!

(మొదటి పేజీ తరువాయి)

ముగిసిన తర్వాత గుర్తింపు అంశాన్ని తెరపైకి తీసుకురావడం అధికారు నిర్లక్ష్యమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వరుస పరిణామాలతో ఇంటర్ బోర్డు విశ్వసనీయత దెబ్బతినే పరిస్థితులు ఉంటాయని పలువురు విద్యావేత్తలు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా నకిలీ సర్టిఫికెట్ల వివాదానికి ఇంటర్ బోర్డ్ కేంద్రంగా మారింది. నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన తర్వాత, కొంత కాలానికి ఈ అంశం తెరపైకి వచ్చింది. ఇటీవల ఫైర్ ఎన్ఓసి అంశం వివాదస్పదంగా మారింది. నిబంధనలను ఉల్లంఘించారని, నకిలీ ఎన్ ఓ సి సర్టిఫికెట్లు జత చేశారనే నెపంతో కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని ఇంటర్ బోర్డ్ బెదరింపులకు పాల్పడుతోందని ఇంటర్ ప్రైవేటు యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. గతంలో కూడా తాము ఇదే సర్టిఫికెట్లను సమర్పించామని, కొందరు ఇంటర్ జిల్లా అధికారులు సూచనల మేరకే తాము ఆయా ఏజెన్సీల వద్దకు వెళ్లామని ప్రైవేటు యాజమాన్యాలు బాహాటంగానే ఆరోపిస్తున్నాయి. గతంలో జిహెచ్ ఎంసి నుంచి సర్టిఫికెట్లు సమర్పించామని, ఇప్పుడు హైడ్రా నుంచి తీసుకోవడంలోనే సమస్య ఉత్పన్నతమవుతోందని పలువురు చెబుతున్నారు. దీనిపై స్పష్టత లేకపోడంతోనే తాము గతంలో తరహాలోనే జిహెచ్ఎంసి నుంచి ఏజెన్సీల ను ఆశ్రయించామని ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు చెబుతున్నాయి. అయితే ఈ సర్టిఫికెట్లు నకిలీవి అయితే ఆ పత్రాలను సమర్పించే సమయంలో సంబంధిత అధికారులు ఎందుకు సక్రమంగా పరిశీ లించలేదని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒప్పంద జూనియర్ లెక్చరర్స్ క్రమబద్ధీకరణ విషయంలో కూడా సర్టిఫికెట్లను కనీసం పరిశీలించకుండా ఎలా ఉద్యోగాలను క్రమబద్దీకరంచారనే ఆరోపణలు కూడా సర్వత్రా వినిపిస్తున్నాయి. చదువు పట్ల శ్రద్ధ పెట్టాల్సిన వి ద్యార్థులు తమ కళాశాలలకు గుర్తింపు ఉంటుందా? లేదా?, విద్యా సంవత్సరం పరిస్థతి ఏమిటనే అనుమానాలు ,విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఇలాంటి ఒత్తిడితో విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం ఉంటుందని విద్యావేత్తలు చెబుతున్నారు.

కార్పొరేట్కు వర్తించని నిబంధనలు...?

మరో వైపు పలు ప్రముఖ కార్పొరేట్ సంస్థలకు చెందిన కళాశాలలు ఒకే అనుమతి పేరుతో వివిధ ప్రాంతాల్లో అనధికారికంగా బ్రాంచీలను కొనసాగిస్తున్నాయంటూ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలు విద్యార్థి సంఘాలు ఇంటర్ బోర్డ్ దబుష్టాకి తీసుకెళ్లారు. అయినప్పటికీ దీనిపై ఇప్పటి వరకు ఇంటర్ బోర్డ్ నుంచి ఎటువంటి స్పష్టత రాలేదు. ఇలాంటి ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించేందుకు ఇంటర్ బోర్డ్ భయపడుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థల విషయంలో ఇంటర్ బోర్డ్ ఎటువంటి కఠిన నిర్ణయాలు తీసుకునే పరిస్థితుల్లో లేదని, కేవలం ప్రైవేటు కళాశాలపైనే నిబంధనల పేరుతో ఇబ్బందికి గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు.విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దనే ఉండడంతో ఇప్పటికైనా ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తే సమస్య పరిష్కారం కావడంతో పాటు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులలో ఉన్న అనుమానాలు నివృత్తి అయ్యే అవకాశాలు ఉంటాయని పలువురు కోరుతున్నారు. ఇలాగే వదిలేస్తే భివష్యత్తులో ఇంటర్ బోర్డ్ పట్ల విశ్వనీయత తగ్గే ప్రమాదం లేకపోలేదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

మోదీ దేశద్రోహి

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. రాహుల్గాంధీ ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశద్రోహి అని, ఆయనను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంత్రిస్తున్నారని, తనతో చర్చకు వస్తే ఆ విషయాన్ని 5 నిమిషాల్లో నిరూపిస్తానని అన్నారు. ఈ అంశంపై చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డిఎ నేతలు అంటున్నారని చెప్పారు. కానీ లోక్సభలో తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని రాహుల్ తెలిపారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు షా మూడు సంవత్సరాల గడువు పెట్టారని, అయితే అప్పటికి ఆయన ఆ పదవిలో ఉంటారో? లేదో? అని రాహుల్ సెటైర్ వేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో గుజరాత్లోని అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి? అని ప్రశ్నించారు. 'నేను అమిత్ షాను ఒక్కటే అడగాలనుకుంటున్నా. అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి? ఆ విషయంలో మీరు తీసుకున్న చర్యలేమిటి? అక్కడ పట్టుబడిన వేల కిలోల మాదకద్రవ్యాలు, హెరాయిన్ ఏమయ్యాయి? మీరు శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నారు. నిజానికి, మీరు జైళ్లలో ఉన్న గ్యాంగ్స్టర్లకు ఆశ్రయం కల్పిస్తున్నారు. అమిత్ షా తన గ్యాంగ్స్టర్లను ప్రోత్సహిస్తున్నారని దేశం మొత్తానికి తెలుసు. మాదకద్రవ్యాల గురించి, శాంతిభద్రతల గురించి మాట్లాడకండి. ఒకవేళ మీరు శాంతిభద్రతల గురించి మాట్లాడాలనుకుంటే, మణిపూర్లో ఏం జరుగుతుందో దేశానికి చెప్పండి' అని డిమాండ్ చేశారు. తనతో చర్చకు రావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి విసిరిన సవాల్ గురించి రాహుల్ ప్రస్తావించారు. 'నాతో ముఖాముఖి చర్చకు రావాలని నరేంద్ర మోదీకి సవాలు విసిరాను. ఆ చర్చకు మధ్యవర్తిగా ఎవరినైనా (న్యాయనిర్ణేతగా) ఎంచుకోవచ్చునని చెప్పాను. ఒకవేళ మోదీ నాతో చర్చకు కూర్చుంటే, ఐదు నిమిషాల్లోనే, ఆయన ఒక 'దేశద్రోహి' అని, ఆయనను డోనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని నిరూపించగలను రాహుల్ గాంధీ ఆరోపించారు.

ఆప్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

మరోవైపు ఆప్ ప్రభుత్వాన్ని పలు కోణాల్లో లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో 'చిట్టా' (కల్తీ హెరాయిన్) ఒక ప్రధాన సమస్య అని పేర్కొంటూ, హత్యకు గురైన గాయకుడు సిద్ధూ మూసేవాలాతో తనకున్న పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు. 'చాలా సంవత్సరాల క్రితం, పంజాబ్లో మాదకద్రవ్యాలు వ్యాపిస్తున్నాయని చెప్పాను. ఆ సమయంలో బిజెపి, అకాలీ దళ్ పార్టీలు మాదకద్రవ్యాల ముప్పును తక్కువ చేసి చూపుతూ, రాహుల్ గాంధీకి పంజాబ్ గురించి ఏమీ తెలియదని అన్నాయి. నేడు రాష్ట్రంలో 'చిట్టా' (కల్తీ హెరాయిన్) ఒక ప్రధాన సమస్యగా మారింది' అని అన్నారు. ప్రజలకు పంజాబ్ కోసం పనిచేసే ప్రభుత్వం కావాలని, ఢిల్లీ నుంచి నడిచే ఆప్ లాంటిది కాదని రాహుల్ ఉద్ఘాటించారు. ఆప్ ఏ ఎన్నికల హామీలను నెరవేర్చిందని ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం, మాదకద్రవ్య రహిత పంజాబ్ కోసం కాంగ్రెస్కు ఓటు వేయాలని రాహుల్ ప్రజలను కోరారు. పంజాబ్లో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని రాహుల్గాంధీ పేర్కొన్నారు. ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలాను పగటి పూట అందరూ చూస్తుండగానే హత్యం చేయడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. పంజాబ్, దేశం కోసం పనిచేయాలని ఆశించే ఎవరినైనా బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం, చివరకు పగటిపూట అందరి కళ్లముందే కాల్చి చంపడం జరుగుతోందని ఆరోపించారు.

కేంద్రంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఉందన్నారు. 2034–35 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్లోని అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు, ప్రముఖ విద్యాసంస్థలతో పాటు రీజినల్ రింగ్ రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. డీప్ టెక్ ఆవిష్కరణలతో యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వ్యవసాయం, వైద్యం, విద్యుత్ రంగాల్లో ప్రజలకు ప్రయోజనం కలగాలని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్బాబు మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర పారిశ్రామిక రంగం 8.1 శాతం వృద్ధి సాధించిందని, జిఎస్విఎ రూ.3.04 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. వస్తువుల ఎగుమతులు 39.3 శాతం పెరిగాయని వెల్లడించారు. జాతీయ జిడిపిలో తెలంగాణ వాటాను 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే సామర్థ్యం రాష్ట్రానికి ఉందన్నారు. పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్లో 11 నూతన పారిశ్రామిక పాలసీలతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిక్కీ మాజీ అధ్యక్షురాలు, అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి, ఫిక్కీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ వి.వి. రామరాజు, కోచైర్మన్ జయదేవ్ మీలా, ఎఫ్టిసిసిఐ అధ్యక్షురాలు కె.కె. మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రవళిక మృతి

(మొదటి పేజీ తరువాయి)

కండక్టర్ ప్రవళిక(24)ను చిల్లర విషయంలో ఓ ప్రయాణికురాలు నెట్టివేయగా కిందపడ్డారు. బస్సు చక్రాల కింద పడి రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతినగా ఆమెను హైదరాబాద్లోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. బాధితురాలిని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆరోగ్యం మెరుగుపడుతుందని అంతా భావించినా... వైద్యుల ప్రయత్నాలు ఫలించలేదు. ప్రవళిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ప్రవళిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని సిఎం హామీ ఇచ్చారు. కాగా ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక పార్థివదేహానికి ఆర్టిసి ఎండి నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. అనంతరం ప్రవళిక తల్లిని పరామర్శించి, కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టిసి అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ప్రభుత్వంలో ఉద్యోగం కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. ప్రభుత్వం, ఆర్టిసి తరపున కలిపి రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా అందిస్తామని, బ్యాంకు ద్వారా రూ.కోటి ప్రమాద బీమా కూడా కుటుంబానికి అందనుందని తెలిపారు. ప్రవళికకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఆమెను కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఆర్టిసి కుటుంబ సభ్యురాలిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆర్టిసి కార్మికుల భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రయాణికులకు సిబ్బంది వల్ల ఏదైనా ఇబ్బంది కలిగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతే కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సిబ్బందిపై దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.





Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com